సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 340
గురువారం 2-3-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'



'నంబర్‌వన్' అశ్విన్
ఐసీసీ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో భారత స్పిన్నర్ -12లో

AXIS BANK
యాక్సిస్ గూటిలో 'సిటీ'
సిటీ బ్యాంకు రిటైల్ బిజినెస్ కొనుగోలు పూర్తయిందన్న యాక్సిస్ బ్యాంక్ -13లో



కేజ్రీవాల్ కేబినెట్లో కొత్త ముఖాలు
రాజీనామా చేసిన మంత్రుల స్థానాలను ఎమ్మెల్యేలు ఆతిషి, సౌరభ్ భరద్వాజ్‌లతో భర్తీచేయాలని ఆప్ ప్రభుత్వం నిర్ణయం.
వివరాలు 6లో ▸



గ్రీస్‌లో ఘోర రైలు ప్రమాదం
తెంపే పట్టణ సమీపంలో ప్రయాణికుల, సరకు రవాణా రైళ్లు ఢీకొన్న దుర్ఘటనలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸



రాహుల్‌గాంధీ కొత్త లుక్
భారత్ జోడో యాత్రలో నెరిసిన గడ్డంతో కనిపించిన రాహుల్. బ్రిటన్ పర్యటనలో గడ్డం ట్రిమ్ చేసుకుని కొత్త లుక్‌లో కన్పించారు.
వివరాలు 6లో ▸



ముకేశ్‌కు జెడ్ ప్లస్ భద్రత
ముకేశ్ అంబానీకి జెడ్ ప్లస్ భద్రత కల్పించాలని, ఆ ఖర్చులను ఆయనే భరించాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.
వివరాలు 6లో ▸

ఈ టార్చర్ తట్టుకోలేను
తరగతి గదిలో ఉరివేసుకున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి సాత్విక్

అడ్మిన్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్, క్యాంపస్ ఇన్‌చార్జి వేధిస్తున్నారని సూసైడ్ నోట్

నార్సింగి శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఘటన

ఉరేసుకున్నాడని తెలిసినా కాలేజీ సిబ్బంది పట్టించుకోలేదంటున్న తోటి విద్యార్థులు

తామే మోసుకుంటూ ఆస్పత్రికి తరలించామని వెల్లడి

మంగళవారం రాత్రే ఘటన.. బుధవారం ఉదయం కుటుంబ సభ్యుల ఆందోళనతో వెలుగులోకి..

మణికొండ (హైదరాబాద్)/ షాద్‌నగర్: 'సరిగా చదవడం లేదంటూ తిడుతున్నారు. మార్కులు రాకుంటే గేటు బయట వాచ్‌మన్‌గా కూడా పని కిరావని అవమానిస్తున్నారు. కాలేజీలో పెట్టే మెంటల్ టార్చర్‌ను, నరకాన్ని భరించలేక వెళ్లిపోతున్నాను..'' అంటూ ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాలేజీ అధ్యాపకులు, హాస్టల్ నిర్వాహకుల వేధింపులతో మనస్తాపం చెంది తరగతి గదిలోనే
మిగతా 2వ పేజీలో ▶



ఒక్కసారి రా.. నాన్నా..
ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి సాత్విక్.. కాలేజీలో వేధింపులు భరించలేక చనిపోదామనుకున్నాడు.. నాన్న చివరి చూపు.. అమ్మతో ఆఖరి మాటల కోసం తపించాడు. 'జ్వరం వచ్చింది.. ఒక్కసారి రా నాన్నా..' అని ఫోన్ చేసి తండ్రిని పిలిపించుకున్నాడు. ఆఖరి సారిగా అమ్మతో ఆప్యాయంగా మాట్లాడాడు. అంతకు ముందే 'మిస్ యూ అన్నా.. నన్ను క్షమించు.. అమ్మానాన్నను బాగా చూసుకో' అని సూసైడ్ నోట్ రాసి పెట్టాడు. తరగతి గదిలోనే ఉరివేసుకున్నాడు.

కాలేజీలో పెట్టే నరకం భరించలేక...
సూసైడ్ నోట్‌లో సాత్విక్ ఆవేదన



బుధవారం సాయంత్రం నార్సింగి శ్రీచైతన్య కాలేజీ హాస్టల్ నుంచి సాత్విక్ సామగ్రిని తీసుకుంటున్న సమయంలో అతడి డ్రెస్‌ల మధ్య సూసైడ్ నోట్ బయటపడింది. అందులో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అడ్మిన్ ప్రిన్సిపాల్ ఆచార్య, శోభన్, క్యాంపస్ ఇన్‌చార్జి నరేశ్‌ల వేధింపులు భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు సాత్విక్ పేర్కొన్నాడు. తనతోపాటు తన మిత్రులకూ వారు నరకం చూపిస్తున్నారని, వారిపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని కోరాడు. ''అమ్మ, నాన్న, అన్న.. ఈ పనిచేస్తున్నందుకు నన్ను క్షమించండి. మిమ్మల్ని బాధపెట్టాలని కాదు. కాలేజీలో పెట్టే మెంటల్ టార్చర్, వాళ్ల చూపే నరకాన్ని భరించలేకనే ఈ చెడ్డ పని చేస్తున్నాను. మిస్ యూ. మీ అందరినీ బాధపెడుతున్నందుకు సారీ.. నన్ను క్షమించండి, నా కోసం మీరు బాధపడితే నా ఆత్మ శాంతించదు. మీరు హ్యాపీగా ఉంటే నేను హ్యాపీగా ఉంటాను. అమ్మా, నాన్నకు నేను లేనిలోటు రాకుండా చూసుకో అన్నా..'' అని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. ఆ లేఖ బాగా నలిగిపోయి ఉండటం చూస్తే.. కొన్ని రోజుల కిందే రాసిపెట్టుకున్నట్టు ఉందని సాత్విక్ స్నేహితులు చెప్తున్నారు.



కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో స్వామివారికి స్వర్ణ కిరీటాన్ని సమర్పిస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు. చిత్రంలో సీఎం సతీమణి శోభ, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి, కుమారులు, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కాళేశ్వరంతో సస్యశ్యామలం...

తిమ్మాపూర్ సభలో సీఎం కేసీఆర్
- నిజాంసాగర్ ఇప్పుడు ఏడాది పొడవునా నిండుకుండనే..
- రాష్ట్రం సాధించుకున్నాక కాళేశ్వరం ద్వారా నీటిని తెచ్చుకుంటున్నాం
- రాష్ట్ర ఉద్యమానికి సింగూరు సమస్య కూడా ఓ ప్రధాన కారణం
- పోచారం ఫోన్ చేస్తే సీఎస్ అయినా, సీఎం అయినా మాట్లాడుతారు
- శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరైన ముఖ్యమంత్రి దంపతులు
- బాన్సువాడకు రూ.50 కోట్లు, ఆలయానికి రూ.7 కోట్లు మంజూరు

సాక్షి, కామారెడ్డి: 'ఉమ్మడి రాష్ట్రంలో నిజాంసాగర్ ఆయకట్టు కోసం సింగూరు జలాలు వదలాలంటూ నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ ముందు ఎన్నో ఆందోళనలు జరిగేవి. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరికొందరు ఎమ్మెల్యేలు రోజుల తరబడి దీక్షలు చేస్తేగానీ నీళ్లు వదిలే పరిస్థితి ఉండేది కాదు. ఆ దీక్షలు చూశా. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి సింగూరు సమస్య కూడా ఒక కారణమే. కానీ ఇప్పుడు ఏడాది పొడవునా నిజాంసాగర్ నిండు కుండనే. నిరంతరం నీళ్లు ప్రవహిస్తూనే ఉంటాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే ఇది సాధ్యమైంది. రాష్ట్రం సాధించుకున్నాక కాళేశ్వరం ద్వారా నిజాంసాగర్‌కు నీటిని తెచ్చుకుంటున్నాం..'అని సీఎం
మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

సైఫ్ వేధించింది నిజమే..



ప్రీతిని సీనియర్ విద్యార్థి సైఫ్ వేధించినట్లు కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ధారించింది. గత నవంబర్ 18న కళాశాలలో అడ్మిషన్ పొందిన ప్రీతికి, సైఫ్‌కు మధ్య పూర్తిస్థాయిలో భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయని, ఈ క్రమంలో ప్రీతిపై సైఫ్ వాట్సాప్ గ్రూపుల్లో హేళన చేస్తూ సందేశాలు పెట్టినట్లు నిర్ధారించింది.
- వివరాలు 5లో▶

'ఈశాన్య' ఫలితాలు నేడే



మూడు ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు గురువారం వెలువడనున్నాయి. ఈశాన్యాన మరింతగా విస్తరించాలన్న అధికార బీజేపీ ఆశలు ఏ మేరకు నెరవేరాయన్నది ఈ ఫలితాలతో తేలనుంది.
- వివరాలు 6లో▶

దరఖాస్తు చేసుకున్న రోజే 'లెక్క'



జీవో నంబర్ 59 కింద ప్రభుత్వ భూముల్లోని నివాసాల క్రమబద్ధీకరణ విషయంలో భూముల విలువ లెక్కింపుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఈ జీవో ప్రకారం ఫలానా తేదీ (జూన్ 2, 2014) అని కాకుండా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న రోజున ఉన్న ప్రభుత్వ విలువ ఆధారంగా క్రమబద్ధీకరణ ఫీజును నిర్ధారించనున్నారు.
- వివరాలు 5లో▶

బండపై మళ్లీ రూ.50



- 14.2 కేజీల గృహావసర సిలిండర్‌పై రూ.50 పెంపు
- రాష్ట్ర ప్రజలపై నెలకు రూ.50 కోట్ల అదనపు భారం
- వాణిజ్య సిలిండర్ ధర రూ. 350.50 పెంపు
- భారం కానున్న హోటల్ తిండి
- మహిళా దినోత్సవానికి మోదీ ఇచ్చిన కానుక: మంత్రి గంగుల

సాక్షి, హైదరాబాద్

పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇప్పటికే సతమతమవుతున్న సామాన్య ప్రజానీకంపై మరో బాదుడు. ఎనిమిది నెలల విరామం తరువాత చమురు సంస్థలు మరోసారి గ్యాస్ సిలిండర్ ధరలను పెంచేశాయి. 14.2 కిలోల గృహావసర సిలిండర్‌పై రూ. 50 పెంచగా, వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల సిలిండర్‌పై రూ. 350.50 పెంచాయి. దీంతో హైదరాబాద్‌లో గృహావసరాల సిలిండర్ రేటు రూ.1,105 నుంచి రూ.1,155కి చేరింది. కాగా, గ్యాస్ సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయడంతో రెండేళ్లగా వినియోగదారులకు నగదు బదిలీ నిలిచిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 1.16 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో సింగిల్ సిలిండర్ కనెక్షన్లు 68.74 లక్షలు కాగా, డబుల్ గ్యాస్ సిలిండర్ కనెక్షన్లు 48 లక్షలు. ఇవి కాకుండా దీపం కనెక్షన్లు 19.72 లక్షలు, ఉజ్వల కనెక్షన్లు 11.46 లక్షలు, సీఎస్ఆర్ కింద 7.30 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. కుటుంబ సభ్యులను బట్టి సిలిండర్ల వినియోగంలో తేడాలున్నా... సాధారణ కుటుంబానికి సగటున నెలకు ఒక సిలిండర్ అవసరమవుతుంది. గ్రామాల్లో కొంత తక్కువ వినియోగం ఉంటుంది. ఈ లెక్కన రాష్ట్రంలో ప్రతి నెలా కోటి సిలిండర్లకు పైగా రీఫిల్ కోసం వస్తాయనుకున్నా... నెలకు అదనపు భారం రూ. 50 కోట్లకుపైనే ఉంటుందని
మిగతా 2వ పేజీలో ▶

బుధవారం దేవరయాంజాల్‌లోని జీవీకే-ఈఎంఆర్ఐ సెంటర్‌లో సీపీఆర్‌పై నిర్వహించిన శిక్షణలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మల్లారెడ్డి తదితరులు ▶



అద్భుత పురోగతిలో రాష్ట్ర వైద్యరంగం
- స్పష్టం చేసిన మంత్రులు హరీశ్, కేటీఆర్
- దేవరయాంజాల్ జీవీకే ఈఎంఆర్ఐలో సీపీఆర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

- వివరాలు 2లో▶

హార్డ్‌వేర్ ఔత్సాహికుల కోసం
'టీ వర్క్స్'
వినూత్న ఆలోచనలకు వేదికగా 'టీ వర్క్స్'ను రూపొందించినట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు.
- వివరాలు 2లో▶

విద్యార్థుల మెస్ చార్జీల పెంపు
ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ మెస్ చార్జీల పెంపు
- 25 శాతం పెంపుతో ప్రతిపాదనలు సిఫార్సు చేసిన కేబినెట్ సబ్‌కమిటీ
- హాస్టళ్లలో ఉండేవారితో పాటు డేస్కాలర్లకూ వర్తింపు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ విద్యార్థులకు శుభవార్త. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా 'ఉపకారాన్ని'అందించాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. ప్రస్తుతం అందిస్తున్న మెస్ చార్జీలను 25 శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు ఆర్థిక మంత్రి టి.హరీశ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన భేటీలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు
మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



... ఏ చానల్ పెట్టినా ఈ ప్రోగ్రామే వస్తుంది డియర్!

వనరులు పుష్కలం.. అవకాశాలు అపారం
974 కి.మీ సుదీర్ఘ తీర ప్రాంతం, నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులో..

- పారిశ్రామికవేత్తల అభిప్రాయాలకు అనుగుణంగా ప్రోయాక్టివ్‌గా ముందుకెళుతున్నాం
- అందుకే గతంలో ఎన్నడూ రాని అంబానీ, బిర్లా, అదానీ, బంగూర్, బజాంకా, దాల్మియా ఇప్పుడు వస్తున్నారు
- 11 పారిశ్రామిక కారిడార్‌లు దేశంలో వస్తుంటే.. అందులో 3 మన రాష్ట్రంలోనే వస్తున్నాయి
- ఖనిజాధార పరిశ్రమలకు అనుకూలం

జీఐఎస్ నేపథ్యంలో జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏపీ సీఎం వైఎస్ జగన్ వ్యాఖ్యలు



> మేము అమలు చేస్తున్నవి కేవలం ఉచిత పథకాలు కాదు. ఇదంతా మానవ వనరుల మీద పెడుతున్న పెట్టుబడిగా మేం భావిస్తున్నాం. మానవ వనరుల నైపుణ్యాభివృద్ధిగానే చూస్తున్నాం. ప్రభుత్వం అలా ఆలోచించకపోతే ప్రగతి సాధించలేం. మా విద్యార్థులు సొంత కాళ్ల మీద నిలబడి, ఉన్నత స్థానాలకు ఎదగడానికి అవసరమైన వనరులను సమకూరుస్తున్నాం. అందుకోసం విద్యా ప్రమాణాలు పెంపొందిస్తున్నాం. అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేస్తున్నాం.

సాక్షి, అమరావతి: 'పరిశ్రమలు నెలకొల్పడానికి అన్ని విధాలా అనువైన వాతావరణం, వనరులు మన రాష్ట్రంలో ఉన్నాయి. 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం, నిరంతరాయమైన విద్యుత్ సరఫరా, కొత్తగా ఏర్పాటవుతున్న 4 పోర్టులు, నాణ్యమైన వనరులు.. ఇవన్నీ పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూలమైన అంశాలు. పోర్టు ఆధారిత పరిశ్రమలకు రాష్ట్రం అత్యంత ఆకర్షణీయం. ఇక్కడ గ్రీన్ ఎనర్జీ రంగంలో అపార అవకాశాలున్నాయి. దేశంలో 11 పారిశ్రామిక కారిడార్‌లు రాబోతుంటే... అందులో 3 మన రాష్ట్రంలోనే వస్తున్నాయి. మూడు పారిశ్రామిక కారిడార్‌లున్న ఏకైక రాష్ట్రం కూడా మనదే'అని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో
మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

హార్డ్‌వేర్ ఔత్సాహికుల కోసం 'టీ వర్క్స్': కేటీఆర్

నేడు టీహబ్ సమీపంలో ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: వినూత్న ఆలోచనలకు వేదికగా, ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ సెంటర్‌గా 'టీ వర్క్స్'ను రూపొందించినట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం తొలివిడతగా రూ.110 కోట్లు వెచ్చించామని, ఔత్సాహిక యువతను ప్రోత్సహించేందుకు ఎంతైనా ఖర్చు పెట్టడానికి సిద్ధమని ప్రకటించారు. గచ్చిబౌలి టీహబ్ సమీపంలో కొత్తగా నిర్మించిన 'టీ–వర్క్స్'ను ప్రారంభించనున్న సందర్భంగా బుధవారం కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. దేశంలోనే అతిపెద్ద ప్రొటో టైపింగ్ సెంటర్‌గా రూపొందించిన టీ–వర్క్స్‌ను ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్‌లీ గురువారం సాయంత్రం ప్రారంభిస్తారని చెప్పారు. సాఫ్ట్‌వేర్ రంగంలోని ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు, స్టార్టప్‌లకు చేయూతనిచ్చేందుకు 'టీ–హబ్' ఉపయోగపడుతుందని, అదే తరహాలో హార్డ్‌వేర్ రంగంలో తొలిసారిగా 'టీ వర్క్స్'ను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత ఇన్నోవేటర్స్‌కు జిల్లాల్లో ఉన్న ఐటీ టీం గైడ్ చేసి, టీ వర్క్స్ ద్వారా వారికి ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి చెప్పారు. గ్రామీణస్థాయిలో కొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చేవారికి తగిన ఆర్థిక సాయాన్ని అందిస్తామని, చేనేతలో ఆసు యంత్రం రూపకల్పన చేసిన మల్లేశంకు కోటి రూపాయల గ్రాంట్ ఇచ్చి ప్రోత్సహించామని కేటీఆర్ గుర్తుచేశారు. లేజర్ కట్టింగ్, టెస్టింగ్ ల్యాబ్, ఎలక్ట్రానిక్స్ ల్యాబ్, 3డీ ప్రింటింగ్, వెల్డింగ్, మెటల్ షాప్, వుడ్ షాప్, సెరామిక్స్ స్టూడియో, రిటైల్ స్టోర్ వంటి వాటిని టీ వర్క్స్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు, ఎంఎస్ఎంఈలు, హార్డ్‌వేర్ స్టార్టప్‌లు, రూరల్ ఇన్నోవేటర్లకు ఈ టీవర్క్స్ ఉపయోగపడుతుందని తెలిపారు.

కేటీఆర్‌తో అసదుద్దీన్ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావుతో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ బుధవారం భేటీ అయ్యారు. గచ్చిబౌలిలో కొత్తగా నిర్మించిన 'టీ–వర్క్స్' ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం అక్కడికి వచ్చిన కేటీఆర్‌తో అసదుద్దీన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇటీవల జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకుండా ఎంఐఎంకు మద్దతు ఇవ్వడం తెలిసిందే. ఎంఐఎం అభ్యర్థి ఎన్నికయ్యేలా సహకరించినందుకు అసదుద్దీన్ కృతజ్ఞతలు తెలపడంతో పాటు.. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై ఇద్దరు నేతలు చర్చించినట్లు సమాచారం.

ఇంటర్ బోర్డు ముట్టడికి ఎస్ఎఫ్ఐ యత్నం

నాంపల్లి (హైదరాబాద్): శ్రీ చైతన్య విద్యా సంస్థలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థి సాత్విక్ ఆత్మహత్యను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఇంటర్మీడియెట్ బోర్డు ముట్టడించింది. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం అవుతున్న శ్రీ చైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం చేపట్టిన ఇంటర్ బోర్డు కార్యాలయ ముట్టడిని బేగంబజార్ పోలీసులు భగ్నం చేశారు. ఇంటర్ బోర్డు కార్యాలయంలోని ఒక్కసారిగా దూసుకెళ్లేందుకు యత్నించిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి బేగం బజార్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. పోలీసులు ఏఎక్కడికక్కడే వారిని అడ్డుకుని బోర్డు కార్యాలయం లోనికి వెళ్లకుండా నిలువరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. ర్యాంకులు, మార్కుల కోసం విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న విద్యా సంస్థలపై సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

శ్రీచైతన్య అనుమతులను రద్దు చేయాలి

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: శ్రీచైతన్య విద్యాసంస్థలు ఫీజుల కోసం తల్లిదండ్రులను, ర్యాంకుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆరోపించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం యూత్ కాంగ్రెస్ నేతలు ఇంటర్మీడియట్ బోర్డు ముట్టడికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థల్లో వరుస ఘటనలు జరుగుతున్నా ఇంటర్ బోర్డు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రేపటి నుంచి అన్ని శ్రీచైతన్య విద్యాసంస్థల ముందు నిరసన చేపడతామని హెచ్చరించారు.

యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి: జాజుల

సాత్విక్ ఆత్మహత్యకు కారణమైన శ్రీచైతన్య యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ కాలేజీల ఆగడాలకు, ఫీజుల దోపిడీని నియంత్రించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆత్మహత్యలు ఆందోళనకరం: శంకర్

వైద్య విద్యార్థి ప్రీతి, నిజామాబాద్‌లో వైద్య విద్యార్థి దాసరి హర్ష ఆత్మహత్య మరువకముందే.. శ్రీచైతన్య కాలేజ్ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యుడు గన్నారపు శంకర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆత్మహత్యకు కారణాలను వెలికితీసేందుకు ప్రభుత్వం విచారణ జరిపించాలన్నారు. కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు.

ఏపీ సంస్కృతికి అద్దం పట్టేలా..

విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) ద్వారా కేవలం పెట్టుబడుల ఆకర్షణే కాకుండా రాష్ట్ర హస్తకళలు, సంస్కృతి సంప్రదాయాలకు ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వీటికి పెద్ద ఎత్తున ప్రచారం కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. సదస్సులో చర్చాగోష్టులకే పరిమితం కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యమివ్వనుంది. ఇందులో భాగంగా అటు సంప్రదాయ కళలకు కూడా పెద్దపీట వేయనుంది. మెడలో వేసుకునే బ్యాడ్జీల దగ్గర నుంచి కార్యక్రమంలో పాల్గొనే వారికి ఇచ్చే కిట్ల వరకు అన్నింటిలోనూ రాష్ట్ర హస్తకళలకు ప్రాచుర్యం కల్పించనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ రెండుసార్లు సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. తోలుబొమ్మల తయారీలో వినియోగించే మెటీరియల్‌తో కూడిన బ్యాడ్జీలు చేసి.. వాటి వెనుక పెడన కలంకారీ డిజైన్లను ముద్రించారు. ఆహూతులకు ఇచ్చే నోట్ బుక్స్‌ను కూడా కలంకారీ డిజైన్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పెన్నులపై రాష్ట్ర పక్షి.. చిలుక లోగోతో పాటు అడ్వాంటేజ్ ఏపీ అని ముద్రించారు. ముఖ్య అతిథులకు సిల్వర్ ఫిలిగ్రీతో చేసిన రాష్ట్ర జీఐఎస్ లోగో బహూకరిస్తారు.





అతిథుల కోసం కలంకారీ డిజైన్‌తో తయారు చేసిన సిరామిక్ ప్లేట్

కూచిపూడి, జానపద కళలకు పెద్దపీట..

సదస్సు జరిగే రెండు రోజులు రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కూచిపూడి నృత్యం, జానపద కళలకు పెద్దపీట వేశారు. మార్చి 3న తొలిరోజు రాష్ట్ర గీతం.. 'మా తెలుగు తల్లి'తో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ప్రముఖ నర్తకి యామినీరెడ్డితో కూచిపూడి నృత్యంతోపాటు ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ తుషార్ కలియాతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. వీటితోపాటు రాష్ట్ర జానపద కళలైన థింసా, తప్పెటగుళ్లు, గరగలు, ఉరుములు, కొమ్ము నృత్యం తదితర ప్రదర్శనలు అతిథులను ఆకట్టుకోనున్నాయి. సదస్సు రెండో రోజు నవరత్న పథకాలను అందరికీ అర్థమయ్యేలా కూచిపూడి నృత్యరూపకం ప్రదర్శించనున్నారు.

గిఫ్ట్ బాక్సుల్లో ఎన్నో ప్రత్యేకతలు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరయ్యే అతిథులకు ఇచ్చే గిఫ్ట్ బాక్స్‌ల్లో చాలా ప్రత్యేకతలున్నాయి. సిరామిక్ ప్లేట్, పెన్ను, అరకు కాఫీ, వుడెన్ కోస్టర్స్‌తో కూడిన గిఫ్ట బాక్స్‌లను ఇవ్వనున్నారు. ఈ సిరామిక్ ప్లేట్‌ను కలంకారీ డిజైన్‌తో అందంగా తీర్చిదిద్ది.. దాని వెనుక రాష్ట్ర చిహ్నం, జీఐఎస్ లోగోను ముద్రించారు. కలంకారీ డిజైన్‌తో వుడెన్ కోస్టర్స్‌ను అందంగా రూపొందించారు. చూడగానే ఆకట్టుకునేలా గిఫ్ట్ బాక్స్‌లపైనా కలంకారీ డిజైన్‌ను ముద్రించారు. సదస్సులో వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ కింద రాష్ట్రంలోని హస్తకళలు, వివిధ ఉత్పత్తులకు ప్రచారం కల్పించేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



అతిథుల ఆగమనం

- విశాఖ జీఐఎస్‌కు తరలి వస్తున్న పారిశ్రామిక దిగ్గజాలు
- ప్రత్యేక అతిథులుగా అంబానీ, బిర్లా, అదానీ, బజాజ్, జిందాల్, భజాంకా, దాల్మియా, బంగర్ తదితరులు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023

సాక్షి, అమరావతి: ఏపీకి భారీగా పెట్టుబడులను రప్పించడం, ఉపాధి కల్పనే లక్ష్యంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ (జీఐఎస్)లో పాల్గొనేందుకు కార్పొరేట్ దిగ్గజాలు విశాఖ చేరుకుంటున్నాయి. విశాఖ సమ్మిట్‌లో పాల్గొనేందుకు బుధవారం ఒక్క రోజే నాలుగు వేలకుపైగా రిజిస్ట్రేషన్స్ నమోదు కాగా ఇప్పటివరకు మొత్తం 12,000కిపైగా నమోదు కావడం గమనార్హం. గత సర్కారు మాదిరిగా ఆర్భాటాలు కాకుండా వాస్తవ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం ఈ సదస్సును నిర్వహిస్తోంది.

నగరానికి కార్పొరేట్లు, కేంద్ర మంత్రులు

దేశవ్యాప్తంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు విశాఖ నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. ఆరుగురు కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు రెండు రోజులపాటు విశాఖ నుంచే కార్యకలాపాలు కొనసాగించనున్నారు. మార్చి 3న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యే సమావేశాల్లో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కే సింగ్, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొంటున్నారు. ప్రత్యేక అతిథులుగా కార్పొరేట్ దిగ్గజ ప్రముఖులు రిలయన్స్ గ్రూప్ చైర్మన్ ముఖేష్ అంబానీ, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమారమంగళం బిర్లా, బజాజ్ ఫిన్‌సర్వ్ ఎండీ, సీఈవో సంజీవ్ బజాజ్, జేఎస్‌డబ్ల్యూ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ నవీన్ జిందాల్, జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లిఖార్జునరావు, రెన్యూ పవర్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుమంత్ సిన్హా, దాల్మియా భారత్ గ్రూప్ ఎండీ పునీత్ దాల్మియా, సైయెంట్ ఫౌండర్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, సెంచురీ ప్లేబోర్డ్స్ చైర్మన్ సజ్జన్ భజాంక, గ్లోబల్ అలయన్స్ ఫర్ సస్టెయినబుల్ ప్లానెట్ సెక్రటరీ జనరల్ సత్య త్రిపాఠి, పెగాసస్ క్యాపిటల్ ఫౌండర్ సీఈవో క్రైగ్ కాట్, పార్లే ఫర్ ది అడ్వైజర్స్ ఓషన్స్ సిరిల్ గచ్, శ్రీ సిమెంట్ చైర్మన్ మోహన్ బంగర్, ఒబెరాయ్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అర్జున్ ఒబెరాయ్, టెస్లా కోఫౌండర్ మార్టిన్ ఎబర్‌హార్డ్, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా తదితరులు పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్, కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌తో పాటు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుచిత్రా ఎల్లా, డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి, వెల్‌స్పన్ గ్రూపు ఎండీ రాజేష్ మండవేవాలా, క్రీడాకారిణి పీవీ సింధు పాల్గొంటారు.

టార్చర్ తట్టుకోలేను.. వెళ్లిపోతున్నా..

▶ మొదటి పేజీ తరువాయి

ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. హైదరాబాద్ శివార్లలోని నార్సింగి శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. అంతే కాదు హాస్టల్‌లో సాత్విక్ కనిపించడం లేదని చెప్పినా, ఉరివేసుకున్నట్టు తెలిసినా కాలేజీ సిబ్బంది పట్టించుకోలేదని తోటి విద్యార్థులు చెప్పారు. తామే మోసుకుంటూ కాలేజీ బయటికి మోసుకొచ్చి, ఓ వాహనదారుడిని లిఫ్ట్ అడిగి ఆస్పత్రికి తీసుకెళ్లామని.. కానీ అప్పటికే సాత్విక్ మరణించాడని తెలిపారు. బుధవారం విద్యార్థి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగటంతో ఈ ఆత్మహత్య విషయం వెలుగులోకి వచ్చింది. విద్యార్థి సాత్విక్ మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం చేశాక కుటుంబ సభ్యులు సాత్విక్ మృతదేహాన్ని షాద్‌నగర్‌లోని ఇంటికి తీసుకెళ్లారు.

పరీక్షలు ఉన్నాయని ఆగి..

రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కొత్తపేటకు చెందిన నాగుల రాజు షాద్‌నగర్‌లో ఉంటూ మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్న కుమారుడు సాత్విక్ నార్సింగి శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్నాడు. శివరాత్రి పండుగ సందర్భంగా ఇంటికి వచ్చిన సాత్విక్.. కాలేజీలో వేధింపుల గురించి తల్లిదండ్రులకు చెప్పాడు. అయితే 15 రోజుల్లో పరీక్షలు ఉన్నాయని, ముగిసిన వెంటనే మరో కాలేజీలో చేర్పిస్తామని తండ్రి సర్దిచెప్పాడు. దీనితో సాత్విక్ నాలుగు రోజుల క్రితం హాస్టల్‌కు తిరిగొచ్చాడు. జ్వరం వచ్చిందంటూ సాత్విక్ ఫోన్ చేయడంతో.. తండ్రి రాజు మంగళవారం రాత్రి 8గంటల సమయంలో హాస్టల్‌కు వచ్చి మాట్లాడి, మందులు ఇచ్చి వెళ్లిపోయారు. హాస్టల్‌లో రాత్రి 10.30 గంటల వరకు స్టడీ అవర్ నిర్వహించారు. అందరి కంటే ముందుగా స్టడీ హాల్ నుంచి లేచిన సాత్విక్.. నేరుగా తరగతి గదికి వెళ్లి ఉరి వేసుకున్నాడు.



సాత్విక్ ఆత్మహత్య చేసుకున్నది ఈ గదిలోనే..

చెప్పినా పట్టించుకోని సిబ్బంది..

స్టడీ హాల్ నుంచి హాస్టల్ గదికి వచ్చాక సాత్విక్ రాలేదని గుర్తించి, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా.. 'అతడే వస్తాడు, మీరు పడుకోండి..' అంటూ నిర్లక్ష్యం చేశారని తోటి విద్యార్థులు చెప్పారు. గట్టిగా అరవడంతో అర గంట తర్వాత గేట్ తీశారని, కాలేజీ అంతా వెతకగా సాత్విక్ ఓ తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడని వివరించారు. వెంటనే అతడిని కిందికి దింపామని.. ప్రాణాలతో ఉన్నట్టు కనిపించడంతో కాలేజీ బయటికి తామే మోసుకుంటూ వచ్చామని తెలిపారు. ఇది చూసి కూడా కాలేజీ సిబ్బంది పట్టించుకోలేదని.. పైగా ఎలాంటి శబ్దం చేయకుండా తీసుకెళ్లాని చెప్పారని వాపోయారు. దీంతో తాము సాత్విక్‌ను మెయిన్ రోడ్డు వరకు మోసుకుంటూ వచ్చి, ఓ వాహనదారుడ్ని లిఫ్ట్ అడిగి సమీపంలోని నర్సింగ్ హోంకు తరలించామని.. కానీ అప్పటికే సాత్విక్ చనిపోయాడని డాక్టర్ చెప్పారన్నారు.

ఇంటికి వచ్చిన అరగంటలోపే..

నాగుల రాజు తన కుమారుడికి మందులు ఇచ్చి సుమారు రాత్రి 10 గంటల సమయంలో షాద్‌నగర్‌లోని ఇంటికి చేరుకున్నాడు. తర్వాత అర గంటసేపటికి సాత్విక్ ఆత్మహత్య చేసుకున్నాడని ఫోన్ వచ్చింది. దీనితో కుటుంబమంతా హతాశులయ్యారు. సాత్విక్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని, కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. సాత్విక్ తల్లితండ్రులు, బంధువులు, స్నేహితులతోపాటు విద్యార్థి సంఘాల నేతలు కాలేజీ ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మృతుడి తల్లి అలివేలు, అన్న మిథున్‌లు పోలీసుల కాళ్లు పట్టుకుని, నిందితులను శిక్షించాలంటూ వేడుకున్న తీరు కలచి వేసింది.



రోదిస్తున్న సాత్విక్ తల్లి, సోదరుడు

అవమానించడంతోనే..


ఎక్కువ మార్కులు రాకపోతే కాలేజీ గేటు ముందు వాచ్‌మన్‌గా కూడా పనికిరారని, ర్యాంకు వచ్చేలా చదవాలని కాలేజీ అడ్మిన్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లు వేధించడంతోనే సాత్విక్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. నా కుమారుడి చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి.

– అలివేలు, సాత్విక్ తల్లి

సమగ్ర విచారణకు మంత్రి సబిత ఆదేశం

సాత్విక్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. ఆత్మహత్యకు కారణాలు తెలుసుకోవాలని, త్వరగా విచారణ నివేదిక ఇవ్వాలన్నారు.

చదువు ఒత్తిడి ఇలా చేస్తుందనుకోలేదు



సాత్విక్‌కు కాలేజీలో ఎదురవుతున్న ఇబ్బందులను నాకు చెప్పాడు. దీనిపై కాలేజీ వారితో మాట్లాడుతానని సర్దిచెప్పాను. ఇంతగా తట్టుకోలేని పరిస్థితి ఉందని చెప్పి ఉంటే ఇంటికి తీసుకెళ్లే వాడిని. కాలేజీ నిర్వాహకులు ఫీజులు, ర్యాంకులు తప్ప విద్యార్థుల మనోభావాలతో పనిలేకుండా వ్యవహరిస్తున్నారు. కానీ చదువే ఇలా చావు వరకు తెస్తుందని ఊహించలేకపోయాం.


– నాగుల రాజు, సాత్విక్ తండ్రి

చదవడం లేదని రక్తం వచ్చేలా కొట్టారు

గతంలో సరిగా చదవడం లేదం టూ నన్ను ముక్కుమీద గుద్దితే రక్తం వచ్చింది. కనికరం కూడా లేకుండా నాతోనే రక్తాన్ని కడిగించారు. షాద్‌నగర్ నుంచి వచ్చి చదువుకుంటున్న మా ఐదుగురు ఫ్రెండ్స్‌ను గాలి బ్యాచ్ అని హేళన చేసేవారు. కాలేజీ గేటు వద్ద వాచ్‌మన్లుగా కూడా పనికిరారంటూ అవమానపర్చేవారు.

– ప్రదీప్, తోటి విద్యార్థి


వేధిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు



కాలేజీలో విద్యార్థులను ఉపాధ్యాయులు వేధిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరం. దీనికి కారణమైన ముగ్గురు సిబ్బంది పోలీసుల అదుపులో ఉన్నారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేస్తాం. విద్యాసంస్థల్లో వేధింపులు, అసాకర్యాలపై విచారణ చేస్తాం.

– స్వామి, చైతన్య కళాశాల ఏజీఎం

నిందితులను అదుపులోకి తీసుకున్నాం



విద్యార్థి మృతికి కారకులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అడ్మిన్ ప్రిన్సిపాల్ ఆచార్య, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జగన్‌లను అదుపులోకి తీసుకున్నాం. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం.

– జీవీ రమణగౌడ్, ఏసీపీ, నార్సింగి

అద్భుత పురోగతిలో రాష్ట్ర వైద్యరంగం

- హరీశ్, కేటీఆర్ స్పష్టీకరణ
- దేవరయాంజాల్ జీవీకే ఈఎంఆర్ఐలో సీపీఆర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

శామీర్‌పేట్: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ వైద్యరంగం అద్భుతంగా ముందుకు సాగుతోందని మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ అన్నారు. బుధవారం తూంకుంట మున్సిపాలిటీ, దేవరయాంజాల్‌లోని జీవీకే–ఈఎంఆర్ఐ సెంటర్‌లో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) శిక్షణ కార్యక్రమాన్ని మంత్రులు హరీశ్, కేటీఆర్, మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి వల్ల కొందరు అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్ట్‌కు గురవుతున్నారని, సరైన సమయంలో సీపీఆర్ అందించడం వల్ల వారి ప్రాణాలను కాపాడే వీలు ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఆర్ శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వెల్లడించారు. గేటెడ్ కమ్యూనిటీ, సెక్యూరిటీ, వాచ్‌మెన్, గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్‌లకు సైతం శిక్షణ అందిస్తామని కేటీఆర్ తెలిపారు. ఏఈడీ పరికరం ద్వారా ఛాతీ నుంచి గుండెకు స్వల్ప విద్యుత్ ఇచ్చి ప్రాణాలను కాపాడే వీలుంటుందని, మొదటి విడతగా రూ.18 కోట్లతో 1,200 ఏఈడీ పరికరాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్న మాస్టర్ ట్రెయినర్లు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అన్ని శాఖల సిబ్బందికి శిక్షణ ఇస్తారని వెల్లడించారు. వైద్యరంగంలో చేపట్టిన అనేక కార్యక్రమాల వల్ల రాష్ట్ర ప్రజలకు వైద్య, ఆరోగ్య శాఖపై నమ్మకం పెరిగిందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలతోపాటు ఇతర వైద్యసేవలను మెజారిటీ ప్రజలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఇటీవల రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి సడెన్ కార్డియాక్ అరెస్ట్ కాగా సీపీఆర్ అందించి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ రాజశేఖర్‌ను మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, మల్లారెడ్డి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, హెల్త్ సెక్రెటరీ రిజ్వీ, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, కుటుంబసంక్షేమ విభాగం కమిషనర్ శ్వేతా మహంతీ, డీహెచ్ శ్రీనివాసరావు, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, జీవీకేఈఎంఆర్ఐ డైరెక్టర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

శభాష్ కిరణ్..

యువకుడికి గుండెపోటు.. సీపీఆర్‌తో ప్రాణం పోసిన కానిస్టేబుల్

టేకుమట్ల(రేగొండ): గుండెపోటుతో కొట్టుమిట్టాడుతున్న ఓ యువకుడికి పోలీస్ కానిస్టేబుల్ సీపీఆర్ ద్వారా ప్రాణం పోశాడు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఓ చికెన్ సెంటర్‌లో పనిచేసే వంశీ (35) నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్క సారిగా గుండెపోటుకు గురై రోడ్డుపై పడిపోయాడు. అక్కడే విధుల్లో ఉన్న బ్లూకోట్ కానిస్టేబుల్ కిరణ్ వెంటనే అతనికి సుమారు 15 నిమిషాలపాటు పీసీఆర్ నిర్వహించగా తిరిగి శ్వాస తీసుకున్నాడు. ఆ తర్వాత వెంటనే మెరుగైన చికిత్స నిమిత్తం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పోలీస్ వాహనంలో పరకాల ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఎస్సై తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతనికి సీపీఆర్‌తో తిరిగి ప్రాణం పోసిన పోలీసులను స్థానిక ప్రజలు అభినందించారు.



గుండెపోటు వచ్చిన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుల్ కిరణ్

గ్యాస్ మంటపై రేపు నిరసనలు

బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియగానే ప్రధాన మంత్రి మోదీ వంటగ్యాస్ ధరలు పెంచారంటూ భారత రాష్ట్ర సమితి తీవ్ర స్థాయిలో మండిపడింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో వినూత్న కార్యక్రమాలతో నిరసనలు చేపట్టాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కె.తారక రామారావు పిలుపునిచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో ఆయన బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు అయిన వెంటనే ప్రతిసారీ గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం కేంద్ర ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని ఆరోపించారు. గృహావసరాల సిలిండర్ ధరను రూ.50, వాణిజ్య సిలిండర్ ధరను రూ. 350 మేర భారీగా పెంచడంపై ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మహిళా దినోత్సవం సందర్భంగా దేశ మహిళలకు ప్రధాన మంత్రి మోదీ ఇచ్చిన కానుకా..? అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం రాకముందు రూ.400 ఉన్న సిలిండర్ ధర ఈరోజు రూ. 1160 దాటి రూ.1200 వరకు పెరిగిందన్నారు. ఒకవైపు ఉజ్వల స్కీమ్ పేరుతో మాయమాటలు చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఈరోజు భారీగా గ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతూ, వారిని సిలిండర్‌లకు దూరం చేస్తోందని విమర్శించారు. ఈ పథకంలో సిలిండర్లు పొందిన మహిళలు ఇప్పుడు వాటిని కొనలేక కట్టెల పొయ్యిపై వంట చేయాల్సిన పరిస్థితులు తలెత్తాతయని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అడ్డగోలుగా గ్యాస్ ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలే కాదు అన్ని వర్గాల వారూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల కష్టాలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లే విధంగా, కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ శుక్రవారం నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

'మహిళలు భయపడుతున్నారు'

సాక్షి, హైదరాబాద్: గ్యాస్ సిలిండర్ ధర చూసి మహిళలు బెంబేలెత్తిపోతున్నారని, వంటింటికి వెళ్లేందుకు భయపడుతున్నారని మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్లుగా మోదీ ప్రభుత్వం ఏదైనా మంచి పనిచేస్తుందేమోనని ఎదురు చూసిన ప్రజల ఆశలను మరోసారి వమ్ము చేశారని విమర్శించారు. బుధవారం బీఆర్ఎస్ఎల్‌పీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. సిలిండర్ ధర పెంపు.. వారం రోజుల్లో రానున్న మహిళా దినోత్సవానికి మోదీ ఇచ్చిన కానుక అని సబిత ఎద్దేవా చేశారు. మోదీకి ఆప్తుడైన పారిశ్రామికవేత్త ఆదానీ ఆస్తులు కరిగిపోతున్నాయని, అందుకే ప్రజల ఆస్తులు కూడా కరిగిపోయేలా మోదీ విధానాలు ఉన్నాయని అన్నారు.

ధరలు పెంచినందుకు ఆయన దేవుడా?

'బీజేపీ నేతలు మోదీని దేవుడు అంటున్నారు.. ధరలు పెంచుతున్నందుకు మోదీ దేవుడు లా కనపడుతున్నారా' అని మంత్రి సబిత ప్రశ్నించారు. అలాగే సిలిండర్ ధర పెంచినందుకు మోదీ బొమ్మను సిలిండర్‌పై వేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం' అని అన్నారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ మోదీ వచ్చాక గ్యాస్ సిలిండర్ ధరలు 175 శాతం పెరిగాయని, దేశంలో అంబానీలే కాకుండా ఆమ్‌ఆద్మీలు కూడా ఉన్నారనే విషయం మోదీ మరిచిపోయారన్నారు. మోదీ అప్పట్లో చాయ్ అమ్మిన రీతిలో ఇప్పుడు దేశ ప్రజల ఆస్తులు అమ్మేస్తున్నారని ఆరోపించారు. ధరల పెంపునకు నిరసనగా రేపు, ఎల్లుండి నిర్వహించే ఆందోళనల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు.

ధాన్యం సేకరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- యాసంగిలో 80ఎల్ఎంటీ సేకరించేందుకు కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ ఆమోదం
- మిల్లింగ్ తరువాత 54 ఎల్ఎంటీ బియ్యాన్ని సేకరించనున్న ఎఫ్‌సీఐ



సాక్షి, హైదరాబాద్: వచ్చే యాసంగి సీజన్‌లో తెలంగాణలో పండే పంటలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జాతీయ అవసరాల కోసం సేకరించేందుకు కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. బుధవారం ఢిల్లీలో వివిధ రాష్ట్రాల పౌరసరఫరాల శాఖ అధికారులు, మంత్రులతో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. కేంద్ర ఆహార శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో వచ్చే రబీలో ఏయే రాష్ట్రం నుంచి ఎంత మేర ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయాలనే దానిపై స్పష్టత ఇచ్చారు. 80 ఎల్ఎంటీ ధాన్యాన్ని మిల్లింగ్ చేయగా వచ్చే 54 లక్షల మెట్రిక్ టన్నుల ముడిబియ్యాన్ని ఈ యాసంగి సీజన్‌లో కేంద్రం సెంట్రల్ పూల్ కింద ఎఫ్‌సీఐ ద్వారా సేకరించనుంది. దీనికి సంబంధించి రైతులకు మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం చెల్లించేందుకు అంగీకరించింది.

1.28 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడికి అవకాశం

యాసంగిలో సాగైన పంట విస్తీర్ణం ఆధారంగా వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం 1.28 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇందులో బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు, మిల్లర్ల కొనుగోళ్లు , రైతుల సొంత అవసరాలు పోగా 80 నుంచి 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. అందుకు అనుగుణంగానే కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖకు నివేదికలు పంపింది. ఇక ఈ ఏప్రిల్ నుంచి ప్రభుత్వ పథకాలన్నింటికీ బలవర్ధక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్) ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్రంలో కూడా ముడి బియ్యాన్ని ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్ (ఎఫ్ఆర్‌కే)తో 1:100 నిష్పత్తిలో కలిపి పంపిణీ చేయనున్నారు. కాగా యాసంగిలో ముడిబియ్యంగా కాకుండా బాయిల్డ్ రైస్‌గా తెలంగాణ నుంచి సేకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని కేంద్రం తిరస్కరించింది. సమావేశంలో తెలంగాణ ప్రతినిధులుగా పౌర సరఫరాల శాఖ కమిషనర్ బి.అనిల్‌కుమార్, పౌర సరఫరాల కార్పొరేషన్ జీఎం రాజిరెడ్డి హాజరయ్యారు.

బండపై మళ్లీ రూ.50

▶ మొదటి పేజీ తరువాయి

చమురు కంపెనీల వర్గాలు తెలిపాయి.

హోటల్ తిండి భారమే..

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు ఏకాఎకిన రూ. 350.50 పెంచేశాయి. దీంతో హోటళ్లు, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే ఈ సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.1,973 నుంచి రూ. 2,323.50కి చేరినట్లయింది. ఆదిలాబాద్, ఖమ్మం వంటి జిల్లాల్లో సిలిండర్ ధర మరింత అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో హోటళ్లలో టిఫిన్లు, భోజనాల ధరలకు రెక్కలు వచ్చే అవకాశం ఉంది.

మహిళలను వంచించిన కేంద్రం: మంత్రి గంగుల కమలాకర్

గ్యాస్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం మహిళలను మరోసారి వంచించింది. వారం రోజుల్లో మహిళా దినోత్సవం రానున్న సందర్భంగా మోదీ ప్రభుత్వం దేశ మహిళలకు గ్యాస్ ధరలను పెంచి కానుకగా ఇచ్చింది. అదానీ నష్టాలను పూడ్చుకునేలా సామాన్యుల నుంచి గ్యాస్ ధరల రూపంలో వసూలు చేస్తోంది. అధ్వానపు విధానాలతో ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి కారణమైన కేంద్రం.. ఏమాత్రం మానవత్వం ఉన్నా పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి.

క్లుప్తంగా...

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ఘర్షణ

• టేకుమట్లలో కర్రలతో కొట్టుకున్న వైనం



బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణదృశ్యం

టేకుమట్ల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో బుధవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఘర్షణ పడ్డారు. మంగళవారం పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో జరిగిన దాడి నేపథ్యంలో బుధవారం టేకుమట్లలో బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు అక్కడికి చేరుకుని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే గండ్ర కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు కల్పించుకుని కాన్వాయ్‌ని పంపించారు. అనంతరం బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటలు పెరిగి.. జెండా కర్రలతో కొట్టుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్ తలకు గాయాలు కాగా, మరికొందరికి స్వల్పగాయాలయ్యాయి. సమాచా రం అందుకున్న సీఐ పులి వెంకట్.. అదనపు సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని లాఠీచార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరు పార్టీల నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

రేవంత్‌రెడ్డి సభపై దాడిని ఖండిస్తున్నాం: భట్టి



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భూపాలపల్లిలో మంగళవారం నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో కార్నర్ మీటింగ్స్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్పడిన దాడిని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై జరిగిన దాడి అప్రజాస్వామికమని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి రాజకీయ పార్టీ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించుకునే హక్కు భారత రాజ్యాంగం ఇచ్చిందన్నారు. అధికార పార్టీకి పోలీసులు పక్షపాతిగా వ్యవహరించినట్లు సభపై జరిగిన దాడి కనిపిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికీ అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసులు గ్రహించాలన్నారు.

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా హిమాన్షు తివారీ

మహారాష్ట్ర డివిజన్ కో–ఆర్డినేటర్ల నియామకం

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి ఆవిర్భవించిన తరువాత తొలిసారిగా పార్టీకి ప్రధాన కార్యదర్శిని నియమించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా హిమాన్షు తివారీని నియమిస్తూ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. యువకుడైన తివారీ ఆరేడేళ్లుగా రైతుఉద్యమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. వారణాసి యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన తివారీ.. భూ సేకరణ చట్టానికి వ్యతిరేకంగా అనేక ఆందోళనలు చేశారని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. ఏపీ, మహారాష్ట్ర బీఆర్ఎస్ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా ఇటీవల మానిక్ కదమ్‌ను నియమించిన కేసీఆర్.. తాజాగా ఆ రాష్ట్ర పార్టీకి డివిజన్ కో–ఆర్డినేటర్లను నియమించారు. నాసిక్ డివిజన్ కో–ఆర్డినేటర్‌గా దశరథ సావంత్, పుణె డివిజన్‌కు బాలసాహెబ్ జైరాం దేశ్‌ముఖ్, ముంబై డివిజన్‌కు విజయ్ తనాజీ మోహితే, ఔరంగాబాద్ డివిజన్‌కు సోమ్‌నాథ్ థోరట్, నాగ్‌పూర్ డివిజన్‌కు ద్యానేష్ వాకుడ్‌కర్, అమరావతి డివిజన్‌కు నిఖిల్ దేశ్‌ముఖ్‌ను కో–ఆర్డినేటర్లుగా నియమించారు.

గని కార్మికుని ప్రాణ దీపం!

వందల ఏళ్లుగా భూగర్భంలో సేఫ్టీ ల్యాంప్ వినియోగం

బొగ్గు గనుల్లో విషవాయువులు గుర్తించడంలో కీలకం

ఆధునిక పరికరాలు వచ్చినా తగ్గని ప్రాధాన్యత



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భూగర్భంలో పని చేసే గని కార్మికులకు ప్రాణదీపంగా వందల ఏళ్ల నుంచి సేఫ్టీల్యాంప్ రక్షణ వెలుగులను పంచుతోంది. బొగ్గు గనుల్లో కాలక్రమేణా అనేక ఆధునిక యంత్రాలు, పరికరాలు అందుబాటులోకి వచ్చినా ఈ బత్తిదీపం ప్రాధాన్యత నేటికీ తగ్గడం లేదు. ఈ దీపం ఆవిష్కరణకు ముందు పలువురు భూగర్భంలోనే విషవాయువులు పీల్చి మృత్యువాత పడ్డారు. ఈ దీపం రాకతో గనుల్లో రక్షణ ప్రమాణాలు మెరుగయ్యాయని సింగరేణి అధికారులు చెబుతున్నారు.



అప్పట్లో పిట్టలే ప్రాణాలు కాపాడేవి

బొగ్గు గాలితో నిత్యం ఆక్సిడేషన్ జరిపి స్వయంగా నిప్పు రాజేస్తుంది. అలా బొగ్గు మండినప్పుడు మీథేన్, కార్బన్ మోనాక్సైడ్, ఇతర విషవాయువులు వెలువడుతాయి. ఆ సమయంలో కార్మికులు పనిచేస్తే శ్వాస సమస్య ఏర్పడి నిమిషాల్లోనే ప్రాణాలు కోల్పోతారు. అలాంటి ప్రమాద పరిస్థితులను ముందే గుర్తించేందుకు పూర్వం కెనరీ పక్షులను పంజరాల్లో భూగర్భంలోకి తీసుకెళ్లేవారు. పక్షిరెక్కలు కొట్టుకోవడం, కదలికల ఆధారంగా వాయువులను గుర్తించేవారు. ప్రతిసారీ పక్షులను బంధించి గనిలోకి తీసుకెళ్లడం, రావడంతో అవి అస్వస్థతకు గురై అనారోగ్యంతో చనిపోయేవి. బ్రిటన్ కు చెందిన హంఫ్రీ డేవీ 1815లో బొగ్గు గనుల్లో రక్షణ కోసం సేఫ్టీ ల్యాంప్‌ను కనుగొన్నాడు. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు గనుల్లో విషవాయువులను గుర్తించడంలో సమర్థంగా పనిచేయడంతో ఈ ల్యాంప్ ప్రామాణికంగా మారింది.

ఎలా పని చేస్తుందంటే..

'వైర్ గాజేస్'సూత్రంతో పనిచేసే ఈ సేఫ్టీ ల్యాంప్ 2.5 కిలోల బరువు, 10 సెం.మీ. పొడవు ఉంటుంది. మంట వెలిగేందుకు కిరోసిన్/పెట్రోల్‌ను వాడతారు. ఇది బానెట్, ఇనుప జాలీలు, వాషర్, గ్లాసు, చెక్‌నట్, నూనె బుడ్డితో నిర్మితమై ఉంటుంది. ఈ ల్యాంప్‌ను గనిలోకి ఓవర్‌మెన్, మైనింగ్ సర్దార్లు తీసుకెళ్లి బొగ్గు తీసే ముందు అక్కడి వాయువుల శాతాన్ని పరీక్షిస్తారు. మీథేన్, ఆక్సిజన్, కార్బన్ మోనాక్సైడ్ తదితర వాయువుల శాతాన్ని తెలుసుకుంటారు. పనిచేసేందుకు అనువుగా ఉంటే ఉత్పత్తి మొదలుపెడతారు. మొదట గనుల్లోకి సాధారణ స్థాయిలో మంట వెలుగుతూ ఉంటుంది. వెలుగుతున్న దీపాన్ని వాయువులు తాకగానే మంటలో మార్పు మొదలవుతుంది. ఉదాహరణకు మీథేన్ ఒక శాతం ఉంటే 0.10 అంగుళాల ఎత్తుతో మంట పక్కవైపులకు వెలుగుతూ కనిపిస్తుంది. 1.5 శాతం ఉంటే 0.15 ఇంచు ఎత్తులో మంట టోపీ ఆకారంలో కనిపిస్తుంది. ఇలా ఎరుపు, నీలిరంగు మంటల కదలికలు, కనిపించే ఆకారాలను బట్టి అక్కడ మీథేన్ గ్యాస్ ఏ మోతాదులో ఉందో గుర్తిస్తారు. ఒకవేళ ఆక్సిజన్ అందకపోతే మంట ఆరిపోతుంది. ఇలా ఆ వాతావరణంలో పైన, కింద, వివిధ ఎత్తుల్లో దీపంతో పరిశీలిస్తారు. ప్రస్తుతం గనుల్లో 1.25 శాతం మీథేన్ ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే కార్మికులను అలర్ట్ చేసి బయటకు పంపుతున్నారు. సింగరేణి వ్యాప్తంగా జీఎల్–50, జీఎల్–60 రకం ల్యాంప్‌లను వాడుతున్నారు. జీఎల్–60లో ఒకవేళ మంట ఆరిపోతే తనంతట తానే వెలిగించుకొనే సాంకేతికత ఉంది. వాయువులను గుర్తించేందుకు డిజిటల్ పరికరాలైన మీథెనోమీటర్, ఆక్సీమీటర్, మల్టీడిటెక్టర్ వంటివి అందుబాటులోకి వచ్చాయి. అయితే ఒక్కోసారి ఈ పరికరాలు భూగర్భంలో సాంకేతిక సమస్యలతో పని చేయకపోవచ్చు. కానీ సేఫ్టీ ల్యాంప్ మాత్రం 100 శాతం కచ్చితత్వంతో పనిచేస్తోంది. దీంతో నేటికీ ఈ దీపం వాడకాన్ని కొనసాగిస్తున్నారు. ఇందుకోసం అధికారులు, కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ల్యాంప్ నిర్వహణ, మరమ్మతులకు ఓ ఇన్‌చార్జి ఉంటారు.

రక్షణలో ఇప్పటికీ ఇదే కీలకం..

బొగ్గుగనుల్లో రక్షణ విషయంలో సేఫ్టీల్యాంప్ కీలకంగా పనిచేస్తోంది. ప్రాణనష్టం జరగకుండా విషవాయువులను గుర్తించేందుకు బాగా ఉపయోగపడుతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా పలు డిజిటల్ పరికాలు వచ్చినా, సేఫ్టీల్యాంప్ వాడకం మాత్రం కొనసాగుతోంది.

–సీహెచ్.సమ్మయ్య, హెడ్ ఓవర్‌మెన్, వీటీసీ, శిక్షకుడు



ఇలా మంటలో మార్పుని బట్టి గ్యాస్ మోతాదును గుర్తిస్తారు. సింగరేణిలో ఒక్కో భూగర్భ గనిలో సగటున 12 నుంచి 14 వరకు దీపాలు అవసరమవుతాయి.



శ్రావణికి పుష్పగుచ్ఛం అందించి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్. చిత్రంలో వివేక్, డీకే అరుణ, అర్వింద్ కుమార్

అవినీతి అంతం కావాలి

- డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యం
- తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయం
- కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్
- బీజేపీలో చేరిన జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని కేంద్ర పర్యావరణ, కార్మిక శాఖల మంత్రి భూపేంద్ర యాదవ్ ఆరోపించారు. రాష్ట్రంలో గత ఎనిమిదిన్నరేళ్లుగా జరుగుతున్న అవినీతి అంతం కావాలంటే రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం రావాలన్నారు. ఇప్పటికే తెలంగాణలోని యువత, ఉద్యోగులు, రైతులు కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ఏకమవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో మార్పు కోరుతూ బీజేపీ ముందుకు దూసుకెళ్తోందని.. త్వరలోనే విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీలోని కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ నివాసంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి సమక్షంలో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డా.శ్రావణి సహా పలువురు బీజేపీలో చేరారు. డీకే అరుణ పార్టీ కండువా కప్పి శ్రావణిని పార్టీలోకి ఆహ్వానించగా, భూపేంద్ర యాదవ్ పార్టీ సభ్యత్వ రశీదును అందించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అత్యధిక సీట్లలో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్‌తో తెలంగాణ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ ఆత్మగౌరవం కోసం డా.శ్రావణి తన పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరడం ఎంతో అభినందనీయమన్నారు.

మోదీ సైన్యంలో సైనికురాలిగా పనిచేస్తా

డా.శ్రావణి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ విధానాలకు ఆకర్షితురాలినై బీజేపీలో చేరానన్నారు. జగిత్యాల జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మోదీ సైన్యంలో ఒక సైనికురాలిగా పనిచేసేందుకు సిద్ధమయ్యానని చెప్పారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబ పాలనతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. డీకే అరుణ మాట్లాడుతూ బీజేపీలో పెద్ద నాయకులు, చిన్న నాయకులు అనే తేడా ఏదీ లేదని, ప్రజలతో మమేకమై పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న అందరినీ బీజేపీ గుర్తిస్తుందని తెలిపారు.

కాళేశ్వరంతో సస్యశ్యామలం...

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రశేఖర్‌రావు చెప్పారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ (తిమ్మాపూర్)లోని తెలంగాణ తిరుమల దేవస్థానం శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన కల్యాణ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సీఎం తన సతీమణి శోభతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు, భక్తులు అందించిన రెండు కిలోల స్వర్ణకిరీటాన్ని స్వామివారికి సమర్పించారు. అనంతరం స్పీకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ మాట్లాడారు.

నాడు పంటలు ఎండుతున్నా పట్టించుకోలేదు..

'తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్నపుడు మంజీర నదిపై దేవునూరు వద్ద 50 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించాలని తలపెట్టారు. అయితే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక దాని సామర్థ్యాన్ని 30 టీఎంసీలకు కుదించి సింగూరు ప్రాజెక్టును కట్టారు. నాడు మెదక్, నిజామాబాద్ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న సింగూరు ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి ఈ ప్రాజెక్టుతో తమకే ఎక్కువ లాభం జరుగుతుందనే ఉద్దేశంతో నిజామాబాద్ ప్రజలు ఎక్కువగా తరలివచ్చారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో సమైక్య పాలకులు సింగూరు నుంచి హైదరాబాద్‌కు మంచి నీళ్లు అందించే పేరుతో నిజామాబాద్‌లో పంటలు ఎండుతున్నా సాగునీరు అందించలేదు. సింగూరు నీటి కోసం ఎమ్మెల్యేలు యుద్ధం చేయాల్సిన పరిస్థితులు ఉండేవి. పంటలను కాపాడుకునేందుకు రోజుల తరబడి దీక్షలు చేసేవారు. సింగూరు మీదనే ఆధారపడిన ఘనపూర్ ఆనకట్ట ఆయకట్టుకు కూడా నీళ్లివ్వకుండా ఇబ్బంది పెట్టారు. ఇలాంటి సమస్యలను చూసి చాలామంది పెద్దలతో చర్చించినా సమస్యకు పరిష్కారం దొరకలేదు. ముఖ్యమంత్రులతో మాట్లాడినా పట్టించుకోలేదు. పైగా తృణీకార భావంతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం చేపట్టడానికి నన్ను ప్రేరేపించిన ప్రధాన అంశాల్లో సింగూరు సమస్య ఒకటి..' అని సీఎం చెప్పారు.

శ్రీనివాస్‌రెడ్డి ఎన్నో దీక్షలు చేశారు..

'సింగూరు నీళ్ల కోసం పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నోసార్లు దీక్షలు చేశారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అప్పట్లో బోధన్ సబ్ కలెక్టర్‌గా ఉన్నారు. ఆయన బాన్సువాడ మీదుగా వెళ్తుంటే బతికున్నపుడు మంచినీళ్లు ఇచ్చి, గంజి పోసైనా సరే బతకనియ్యండి గానీ, చచ్చిపోయాక బిర్యానీ పెట్టినా లాభం లేదు అని పోచారం చెప్పారు. ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి నాతో కలిసి ఉద్యమంలోకి వచ్చాక, ఉప ఎన్నికల ప్రచారం కోసం వెళుతుంటే రోడ్డు మీద కలిసిన లంబాడా బిడ్డలు పోచారం సార్ గెలుస్తాడని ముందే చెప్పారు. పోచారం అంటే ఈ ప్రాంత ప్రజలకు అంత అభిమానం.

నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారు

ఇక్కడి మంచి చెడులు తెలిసిన వ్యక్తిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి నియోజక వర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ఈ వయసులో హోదాను సైతం పక్కన బెట్టి నియోజకవర్గంలో చిన్న పిల్లవాడిలా తిరుగుతూ ప్రజల కష్ట సుఖాల్లో భాగమవుతున్నారు. బాన్సువాడ మెటర్నిటీ ఆస్పత్రికి జాతీయ స్థాయి గుర్తింపు వచ్చిందంటే దానిపై పోచారం పర్యవేక్షణ ఎంత ఉందో అర్థమవుతోంది..'అని కేసీఆర్ అన్నారు.

ఈ ప్రాంతం సుభిక్షంగా వర్ధిల్లాలని కోరుకున్నా..

బాన్సువాడ ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందంటూ.. తన ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి నియోజకవర్గానికి రూ.50 కోట్లు, ఆలయానికి రూ.7 కోట్లు మంజూరు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. శ్రీనివాస్‌రెడ్డి తన మిత్రులతో కలిసి ఈ ఆలయాన్ని గొప్పగా అభివృద్ధి చేశారంటూ అభినందించారు. స్వామి కరుణ, దయ యావత్ తెలంగాణ ప్రజల మీద ఉండాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. పచ్చని పంటలతో ఈ ప్రాంతమంతా సుభిక్షంగా వర్ధిల్లాలని వేడుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు బీబీ పాటిల్, సురేశ్‌రెడ్డి, సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానం సముదాయాన్ని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి తదితరులు

నేను కూడా ముసలోణ్ణి అవుతున్నా..

'నేను కూడా ముసలోణ్ణి అవుతున్నా. 69 ఏళ్లు వచ్చినయి. నా కన్నా వయస్సులో పెద్దవాడైనా నేనున్నన్ని రోజులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ ప్రజలకు సేవ చేస్తాడు. ఆయన మాటే బ్రహ్మాస్త్రం. శ్రీనివాస్‌రెడ్డి ఫోన్ చేస్తే చీఫ్ సెక్రెటరీ అయినా, సీఎం అయినా మాట్లాడతారు. ఏ పని అయినా అవుతది..' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణలో అంతా వివక్షే

- మహిళలు, విద్యార్థులకు రక్షణలేదు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌ఛుగ్ ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: దళితులు, ఓబీసీలు, విద్యార్థులు సహా అందరిపై వివక్ష, ద్వేషం కేసీఆర్ కుటుంబం గుండెల్లో నిండుగా ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్ ఆరోపించారు. ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులంతా కేసీఆర్ కుటుంబాన్ని ప్రసన్నం చేసుకొనే పనిలో నిమగ్నమై ఉన్నారని ధ్వజమెత్తారు. ఒకవైపు రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి మరింత దిగజారగా మరోవైపు ముఖ్యమంత్రి కేసీఆర్ పొలిటికల్ టూర్లలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు.. కేసీఆర్ ప్రభుత్వ అవినీతి పాలనతో సామాన్య ప్రజానీకం విసిగిపోయిందన్న తరుణ్‌ఛుగ్.. కల్వకుంట్ల కుటుంబం అవినీతి, అహంకారం, కుటుంబ పాలనకు స్వస్తి పలికేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో తరుణ్‌ఛుగ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. గత మూడేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పంపిణీ చేయడం మరిచిపోయిందని, ఈ కారణంగా 18 లక్షల మంది విద్యా ర్థుల భవిష్యత్తును రాష్ట్ర ప్రభుత్వం అంధకారంలోకి నెట్టేసిందని తరుణ్‌ఛుగ్ విమర్శించారు. ముఖ్యంగా ఎస్సీ విద్యార్థుల కోసం కేటాయించిన నిధుల్లో 50 శాతంలోపే ఖర్చు చేసిందని మండిపడ్డారు.

ర్యాగింగ్‌పై చర్యలేవీ?

కళాశాలల్లో ర్యాగింగ్ ఘటనలపై బాధితులు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తరుణ్‌ఛుగ్ విమర్శించారు. వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినతీరు.. రాష్ట్రం విద్యార్థులకు, మహిళలకు సురక్షితం కాదనే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. వరంగల్ వైద్య విద్యార్థిని ప్రీతి కుటుంబానికి న్యాయం చేసేందుకు బీజేపీ అన్ని విధాలా కృషి చేస్తుందని తరుణ్ ఛుగ్ తెలిపారు.



మహిళా మోర్చా సమావేశంలో బండి సంజయ్, చింతల తదితరులు

అత్యాచార నిందితుల ఇళ్లు కూల్చేస్తాం

- రాష్ట్రంలో అధికారంలోకి వస్తే యూపీ తరహాలో చర్యలు
- మహిళా మోర్చా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలపై అత్యాచారాలు చేసే లుచ్చాగాళ్ల అంతుచూస్తామని, యూపీ తరహాలో బుల్డోజర్లతో వాళ్ల ఇళ్లు కూల్చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హెచ్చరించారు. బుధవారం మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంజయ్ మాట్లాడుతూ అమ్మాయిల విషయంలో తప్పుచేస్తే గుడ్లు పీకేస్తానని గతంలో సీఎం కేసీఆర్ చేసిన హెచ్చరికలన్నీ ఉత్తమాటలేనని విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిని చేయడంతోపాటు మహిళలకు ఉన్నత పదవులిచ్చి గౌరవిస్తుంటే రాష్ట్రంలో మాత్రం ఎస్సీ, ఎస్టీ మహిళలు, బాలికలకు చితి పేర్చే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వెలిబుచ్చారు. 'కేసీఆర్ చేతగానితనం వల్ల మెడికో ప్రీతి మరణిస్తే మహిళా మోర్చా దమ్ము చూపించింది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే. సీఎంవో నుంచి వచ్చిన ఫోన్‌తో ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం చేస్తున్నారు' అని ఆరోపించారు.

షర్మిలను బూతులు తిట్టడం దారుణం..

'నేను ఈ రోజు ఈస్థాయిలో ఉన్నానంటే నా శ్రీమతి గొప్పతనమే. వైఎస్ షర్మిలసహా పలువురు మహిళలను బీఆర్ఎస్ వారు దారుణంగా కించపరుస్తున్నారు. ఆమె ఏ పార్టీ అయినప్పటికీ మహిళలను దూషించడం దారుణం'అని సంజయ్ అన్నారు. 'జూబ్లీహిల్స్ ఘటన నుంచి ప్రీతి ఉదంతం వరకు అనేక అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా కేసీఆర్ స్పందించరు. హోంమంత్రి ఉన్నారా లేరా? అనే అనుమానం కలుగుతోంది. తెలంగాణలో మహిళలంటే కవిత మాత్రమేనా? నిధులు, దందాలన్నీ ఆమెకేనా?'అని సంజయ్ ప్రశ్నించారు.

గెలిచే అవకాశం ఉన్న మహిళా నేతలకు టికెట్లు..

'గెలిచే అవకాశమున్న మహిళా నేతలకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇచ్చే బాధ్యత నాది. ఈసారి ఎక్కువ మంది మహిళా మోర్చా నేతలు ఎమ్మెల్యేలు కావాలని కోరుకుంటున్నా. ప్రజల తరఫున కొట్లాడండి' అని పిలుపునిచ్చారు. బీజేపీ సింహంలాగా ఒంటరిగానే పోటీచేసి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి ప్రసంగించగా నేతలు చింతల రామచంద్రారెడ్డి, పద్మజా మీనన్, నళిని, ఆకుల విజయ పాల్గొన్నారు.

వచ్చేవి కాంగ్రెస్ ప్రభుత్వాలే..

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే
- కోదాడలో 'గడప గడపకు కాంగ్రెస్' కార్యక్రమం ప్రారంభం

కోదాడ: అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని, అందువల్ల వచ్చే ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రాబోతున్నాయని, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే అన్నారు. ప్రజలను అక్కున చేర్చుకొని ముందుకుపోవడానికి నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడలో నిర్వహించిన 'గడప గడపకు కాంగ్రెస్'కార్యక్రమంలో, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గడపకు రాహుల్‌గాంధీ సందేశం తీసుకెళ్లాలని, దీనిలో ప్రతి నాయకుడు, కార్యకర్త పాల్గొనాలని స్పష్టం చేశారు.

గడప గడపకు పార్టీని తీసుకెళ్లాలి

బీజేపీ నుంచి దేశాన్ని కాపాడటానికి రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్ర సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నిర్వహిస్తున్న గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాణిక్‌రావు ఠాక్రే పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం పెరగడానికి కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలే కారణమని మండిపడ్డారు. దేశాన్ని అదానీకి దోచిపెట్టారని, అదానీ చేసిన ఆర్థిక కుంభకోణంలో బీజేపీ పాత్ర ఉందని ఆరోపించారు. ఆయన వెంట ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నేతలు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి, బోసరాజు, నిరంజన్, పటేల్ రమేష్‌రెడ్డి తదితరులున్నారు.

దామోదర్‌రెడ్డి వర్సెస్ పటేల్ రమేష్‌రెడ్డి

కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో సాక్షాత్తు మాణిక్‌రావు ఠాక్రే ఎదుటే సూర్యాపేట నియోజకవర్గ నేతలు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. సూర్యాపేట కాంగ్రెస్ కంచుకోట అని, నేడు దానికి బీటలు వారడానికి కారణం ఎవరో చెప్పాలని, తమను కనీసం సమావేశానికి ఆహ్వానించలేదని రమేష్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సమయంలో దామోదర్‌రెడ్డి కల్పించుకొని.. టీడీపీ నుంచి వచ్చిన వారికి అంత ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం లేదనడంతో గొడవ మొదలైంది. దీంతో ఠాక్రే, ఉత్తమ్ జోక్యం చేసుకుని ఇరువర్గాలను సముదాయించారు.



కోదాడలో జరిగిన గడప గడపకు కాంగ్రెస్‌లో పాల్గొన్న మాణిక్‌రావు ఠాక్రే, ఉత్తమ్ తదితరులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటున్నాయి

- హుజూరాబాద్ సభలో రేవంత్‌రెడ్డి
- మోదీ తెలంగాణకు చేసిందేమీ లేదు
- 24 గంటల కరెంటు నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగం

హుజూరాబాద్/ హుజూరాబాద్ రూరల్: మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 60 ఏళ్ల తెలంగాణ ఆకాంక్షను నెరవేరుస్తామని కరీంనగర్ గడ్డమీద సోనియా మాట ఇచ్చారని, పార్టీ నష్టపోయినా మాట తప్పక.. మడమ తిప్పక తెలంగాణ ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. వచ్చిన తెలంగాణలో 60 ఏళ్ల ఆకాంక్షలు నెరవేరాయో లేదో ప్రజలు ఆలోచించాలని అన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, నిజామాబాద్ ఎంపీ అరవింద్ తెలంగాణ కోసం కొట్లాడలేదని, సుష్మాస్వరాజ్‌ను కలిసి ఒప్పించలేదని విమర్శించారు. ఆనాడు తెలంగాణ ప్రజల బాధను చెప్పి, సుష్మాస్వరాజ్ కాళ్లకు దండం పెట్టి ఆమెను ఒప్పించింది పొన్నం ప్రభాకర్ అని అన్నారు. రేవంత్ హాథ్ సే హాథ్ జోడో యాత్ర బుధవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చేరింది. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండూ ఒక్కటే

ప్రధాని మోదీ తెలంగాణకు చేసిందేమీ లేదని రేవంత్ విమర్శించారు. అధికారంలోకి వస్తే స్విస్ బ్యాంకుల్లోని నల్లధనం తీసుకొచ్చి ప్రతి ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తామని తొమ్మిదేళ్లు అయినా 15 పైసలు కూడా వేయలేదని రేవంత్ ఎద్దేవా చేశారు. మోదీ వచ్చాక రూ.400 సిలిండర్ రూ.1,250, రూ.50 ఉన్న డీజిల్ రూ.100 అయ్యిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ అవినీతిపై విచారణకు ఆదేశించాల్సిందిగా ఈటల రాజేందర్ ఇప్పటివరకు ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. కేసీఆర్ అవినీతిపై ఎప్పటిలోగా విచారణ చేయించి కేసీఆర్, కేటీఆర్‌ను జైల్లో పెడతారో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని.. కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చేందుకే వేరుగా ఉన్నట్లు నటిస్తున్నారని విమర్శించారు. 24 గంటలపాటు కరెంట్ ఇస్తున్నట్లు టీఆర్ఎస్ నాయకులు నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో తాము ఓట్లు అడగమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలు ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, పేదలకు ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల వరకు వైద్యం ఖర్చు ప్రభుత్వమే చెల్లిస్తుందని, ఆడబిడ్డలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు.



జమ్మికుంట మండలంలోని తనుగుల మానేరు ఇసుక క్వారీ వద్ద రేవంత్ రెడ్డి

బూత్ స్థాయిలో బలపడటమే లక్ష్యంగా..

12 నుంచి 'బూత్ సశక్తీకరణ్ అభియాన్'కు కమలదళం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోలింగ్ బూత్ స్థాయిలో బలపడటమే లక్ష్యంగా ఈ నెల 12 నుంచి 20 దాకా 'బూత్ సశక్తీకరణ్ అభియాన్'కు బీజేపీ సిద్ధమవుతోంది. ఇందులో పాల్గొనే కార్యకర్తల కోసం ఈ నెల 4 నుంచి 6 దాకా అసెంబ్లీ స్థానాల వారీగా వర్క్‌షాప్, 9 నుంచి 11 దాకా శక్తి కేంద్రాల (3–4 పోలింగ్ బూత్‌లు కలిపి ఓ కేంద్రం) వారీగా సమావేశాలు నిర్వహించనుంది. బుధవారం బూత్ సశక్తికరణ్‌పై పార్టీ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శ్రుతి, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ తదితరులతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్న విషయం పాదయాత్ర, స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో వెల్లడైన నేపథ్యంలో బూత్‌లవారీగా పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలింగ్ బూత్‌లవారీగా పటిష్టం చేసే అంశంపై కమిటీల ఏర్పాటుతోపాటు వర్క్‌షాప్‌లు, శక్తి కేంద్రాలవారీగా సమావేశాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ బాధ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహా కమిటీ సభ్యులను బండి సంజయ్, వనతి శ్రీనివాసన్ సన్మానించారు.



మీరు చేస్తున్న చర్య మంచిదో, కాదో అని
మీకు సందేహం ఉంటే, దాన్ని చేయకుండా ఉండండి.
- జరాతుష్ట్ర

సాక్షి
గురువారం, మార్చి, 2

తవ్వి తలకు పోసుకుందామా?

పిచ్చి కుదిరింది... తలకు రోకలి చుట్టమన్నాడట! చరిత్ర పేరుచెప్పి, దేశంలో ప్రతి ఊరి పేరు, వీధి పేరు, స్థలం పేరూ మార్చేయాలని చూస్తున్న వేలంవెర్రిని గమనిస్తే, ఆ నానుడి గుర్తుకొస్తుంది. సర్వోన్నత న్యాయస్థానానికి సైతం అదే గుర్తొచ్చింది. ఆ మాటనే పస లేని పిటిషన్‌తో వచ్చిన ఫిర్యాదీతో సహా పదుగురికీ మరో పద్ధతిలో గుర్తు చేసింది. 'ఆటవిక విదేశీ దురాక్రమణదారులు మార్చిన' చారిత్రక ప్రదేశాల 'అసలు' పేర్లను పునరుద్ధరించడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ బీజేపీ నేత అశ్వినీ ఉపాధ్యాయ్ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సోమవారం సుప్రీమ్ కోర్ట్ కొట్టేసింది. జస్టిస్ జోసెఫ్, నాగరత్నల ధర్మాసనం పిటిషనర్ అత్యుత్సాహాన్ని తప్పుబట్టింది. భారత్ పదేపదే దాడులకు గురైంది నిజమే. విదేశీయులు మనల్ని పాలించినదీ నిజమే. దాన్ని గుర్తిస్తూనే, 'సమాజంలో విభేదాల' సృష్టికి 'చరిత్రను కొంతమేరకే తవ్వి తలకుపోస్తున్న' ప్రయత్నాలను సుప్రీమ్ నిరసించడం సరైన సమయంలో వెలువడింది.

చరిత్ర పట్ల ఏదో నిర్ణీత దృక్పథం పెట్టుకొని, తదనుగుణంగా ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర దేశాన్ని గత చరిత్రలో బందీని చేయరాదంటూ పిటిషనర్‌కు కోర్ట్ హితవు చెప్పాల్సి వచ్చింది. వర్తమాన భారతావనిలో పరిష్కరించాల్సిన అనేక అంశాలుండగా, ఈ పేర్ల మార్పిడినే అజెండాగా పాలకులు, వారి భావజాల దాసులు తలకెత్తుకోవడం విచిత్రం. తాజాగా మహారాష్ట్రలో మొఘల్ పాలకులు ఔరంగజేబ్, మీర్ ఉస్మాన్ అలీఖాన్ పేర్ల మీద వెలసిన నగరాలైన ఔరంగాబాద్‌ను ఛత్రపతి శంభాజీ నగర్‌గా, ఉస్మానాబాద్‌ను ధారాశివ్‌గా ఆ రాష్ట్ర పాలకులు మార్చేశారు. గత వారమే కేంద్రం దానికి రాజముద్రా వేసింది. ఇప్పుడిక అహ్మద్‌నగర్‌ను రాణి అహిల్యాదేవి హోల్కర్ పేరిట మార్చాలన్న డిమాండ్ ఊపందుకుంది. సరిగ్గా అదే రోజున పేర్ల మార్పిడిపై సుప్రీమ్ చేసిన ఈ వ్యాఖ్యలు కళ్ళు తెరిపించేలా ఉన్నాయి. ఆత్మశోధనకు ప్రేరేపిస్తున్నాయి.

పేరులో ఏముంది పెన్నిధి అన్నారు పెద్దలు. కానీ, పేరులోనే అంతా ఉంది, ఒక వర్గం పాలకులు వచ్చి మన పేర్లు మార్చేశారంటూ రాగద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రచారం చేయడం నేటి వికృత ధోరణి. పాత పేర్లను మార్చడం ద్వారా సమాజంలో ఒక వర్గం ఏకీకృతమై, తమ వైపు మొగ్గేలా చేసుకోవాలన్న వ్యూహం దేశ రాజకీయాల్లో ఇటీవల ప్రబలుతోంది. ఇది ప్రమాదకరం. ఈ నేపథ్యంలో 'నేను క్రైస్తవుణ్ణి. అయితేనేం, నాకు హిందూయిజమూ ఇష్టం. ఎంతో గొప్పదైన హిందూ ధర్మాన్ని తక్కువ చేయకూడదు' అని జస్టిస్ జోసెఫ్ వ్యాఖ్యానించడం విశేషం. మన దేశానికి పునాదులుగా నిలిచిన సహనం, సౌభ్రాతృత్వం, భిన్నత్వం, సమ్మిళితత్వాలకు ఒక రకంగా ఇది పునరుద్ఘాటన.

భిన్నత్వంలో ఏకత్వానికి ఘనత వహించిన గడ్డపై ఒక విధమైన భావజాలమే ఉండాలనీ, ఈ దేశాన్ని పాలించిన విభిన్న వర్గీయులంతా వట్టి 'దురాక్రమణదారులు, విదేశీ దోపిడీదారులు' అనీ ప్రచారం చేస్తే మూర్ఖత్వమే. అన్ని పేర్లూ మార్చి, అన్ని ముఖాలకూ సున్నం కొట్టి ఒకే ఉనికిని ధ్రువపరచాలనుకోవడం సాంస్కృతిక, భావజాల సామ్రాజ్యవాదమే తప్ప సమానత్వం కానేరదు. గద్దె మీది పెద్దలైనా, సమాజంలోని ఇతరులైనా ఈ ఉన్మాదాన్ని పెంచిపోషిస్తే, సామరస్యం దెబ్బతింటుంది. ఎవరైనా చేయాల్సింది మెరుగైన ప్రజాజీవనానికి తోడ్పడేలా విధానపరమైన మార్పులు తప్ప, ఒకరిపై మరొకరిని ఉసిగొలిపే పేరు మార్పులు కాదు. పాత గాయాలను కెలికి, ప్రజల్లో విభేదాలు సృష్టించే ఇలాంటి చర్యలను న్యాయవ్యవస్థే కాదు... బుద్ధిజీవులతో పాటు రాజకీయ సారథులూ నిర్ద్వంద్వంగా ఖండించాలి.

అయితే, అధికారం చేపట్టిన ప్రతి పార్టీ ఇదే పేర్ల మార్పిడి తప్పు చేస్తోంది. గతంలో కాంగ్రెస్ దేశ రాజధానిలోని ప్రసిద్ధ కన్నాట్ ప్లేస్‌ను రాజీవ్ చౌక్‌గా, కన్నాట్ సర్కిల్‌ను ఇందిరా చౌక్‌గా పేర్లు మార్చింది. రెండు తడవలుగా కేంద్రంలో చక్రం తిప్పుతున్న బీజేపీ గడచిన కొన్ని నెలల్లో ఎన్ని పేర్లు మార్చిందో లెక్కే లేదు. బ్రిటీషు, మొఘల్ పాలకుల గతాన్ని వదిలించుకోవడానికంటూ కొత్త పేర్ల కథను సమర్థించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. వర్తమానమే వివాదాలమయం అయినప్పుడు గతం అందుకు భిన్నంగా ఉండే అవకాశం లేదు. వివాదాలు నిండిన ఆ గతాన్ని పట్టుకొని వేలాడి, ఆగతాన్ని వదిలేసి, నవ నామీకరణలకు దిగితే... కాలహరణమే తప్ప ప్రజానీకానికి పైసా ప్రయోజనం లేదు. దాని బదులు పాలనపై శ్రద్ధపెట్టి, అందమైన భవిష్యత్తు దిశగా అడుగులు వేయడం ఇప్పుడు ముఖ్యం.

ప్రస్తుత పాలకులు రాజ్‌పథ్‌ను కర్తవ్యపథ్ అన్నా, మొఘల్ గార్డెన్స్‌ను అమృతోద్యానంగా మార్చినా, ఢిల్లీలోని ఔరంగ్‌జేబ్ రోడ్, యూపీలోని అలహాబాద్, మొఘల్ సరాయ్‌లకు కొత్త పేర్లు పెట్టినా సామాన్యుల జీవితమేమైనా మారిందా? చరిత్రను భూతంగా, ఒక వర్గం పాలకులనంతా పీడకులుగా, హిందువులు తప్ప మిగతా అందరూ 'బయటివాళ్ళు', 'దోపిడీదొంగలు'గా అసత్య చిత్రణ వల్ల లాభం ఎవరికి? ఈ మిడిమిడి వాట్సప్ జ్ఞానంతో, మధ్యతరగతిని రెచ్చగొట్టే భావోద్వేగ రాజకీయ విన్యాసంతో ఓట్లు, సీట్ల లెక్కల్లో తాత్కాలిక ప్రయోజనం సిద్ధించవచ్చు. కానీ, స్వార్థంతో నాటుతున్న నేటి ఈ విషబీజాలు రేపటి సమాజాన్ని చీలుస్తుంటే ఆ శాశ్వత ప్రమాదానికి బాధ్యులెవరు? కులమత విభేదాలకు అతీతమైన నవ భారత నిర్మాణాన్ని నిజంగా స్వప్నించేవారెవరూ ఈ పని చేయరు. పాలకుల స్వప్రయోజనాలతో రోజుకో రకం చరిత్ర చదివితే, అసలు కథ మరుగునపడే దుఃస్థితి దేశానికి దాపురిస్తుంది. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడడమంటే ఇదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** తిథి శు.దశమి ఉ.8.03 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఆరుద్ర ప.2.04 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.3.15 నుండి 5.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.14 నుండి 11.02 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, **అమృతఘడియలు:** లేవు

సూర్యోదయం: 6.23
సూర్యాస్తమయం: 6.02
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

మంచిదేదో జంకు లేకుండా చెప్పాలి!

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

జంక్ ఫుడ్‌తో వచ్చే అనారోగ్యంపై ప్రజలను హెచ్చరించాలనుకుంటే ఆ హెచ్చరిక ఓ గుర్తు రూపంలో ఉండాలి. ప్యాకేజీ ముందువైపున ముద్రించాలి. వేర్వేరు రంగుల సాయంతో అనారోగ్య స్థాయిని కూడా సూచించగలిగితే ప్రజలు ఓ మోస్తరు ఆరోగ్యాన్నిచ్చే ఆహారాన్ని లేదా అనారోగ్య కారక ఆహారాన్ని వేర్వేరుగా గుర్తించి నిర్ణయాలు తీసుకునే వీలు ఏర్పడుతుంది. ఇలా గుర్తించడం విజయవంతం కావాలంటే జాతీయ స్థాయిలో పౌష్టికతపై ఓనమాలు దిద్దించాలి. ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. లేదంటే, జంక్ ఫుడ్ తయారీదారులు తమ మార్కెటింగ్ బలం, నియంత్రణ సంస్థల చెలిమి సాయంతో చిరుధాన్యాలు, ఇతర ఆరోగ్యకరమైన ఆహారాలను కూడా హైజాక్ చేసే ప్రమాదం ఉంది.

ఐక్యరాజ్య సమితి ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో భారతదేశాన్ని చిరుధాన్యాల ఎగుమతి కేంద్రంగా ప్రపంచానికి పరిచయం చేసేందుకు ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఈ సిరి ధాన్యాలు మానవ ఆరోగ్యానికి మాత్రమే కాదు, పర్యావరణానికీ మేలు చేసేవి. క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ పండించగలగడం ఇందుకు కారణం. నిజానికి చిరుధాన్యాలు వందల ఏళ్లుగా భారతీయ ఆహారంలో భాగంగానే ఉన్నాయి. జొన్న, సజ్జ, రాగి వంటివి 1960వ సంవత్సరం వరకూ నలుగురిలో ఒకరు తినేవారు. కానీ, హరిత విప్లవం తరువాత చిరుధాన్యాల వాడకం క్రమేపీ తగ్గిపోయింది. అయితే ఇటీవలి కాలంలో ఈ చిరుధాన్యాలపై ఆసక్తి మళ్లీ పెరుగుతోంది. వాతావరణ మార్పుల ప్రమాదం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో చిరుధాన్యాలను మళ్లీ మన ఆహారంలో భాగం చేసుకోవడం మంచిదని నిపుణులు కొంత కాలంగా సూచిస్తున్న విషయం తెలిసిందే.

చిరుధాన్యాల ఉత్పత్తి, వినియోగం తగ్గుతున్న క్రమంలోనే దేశంలో ఆహారపు అలవాట్లూ మారిపోయాయి. శుద్ధి చేసిన ప్యాకేజ్డ్, 'రెడీ టు ఈట్' ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం మొదలైంది. అప్పట్లో వ్యవసాయ ఉత్పత్తులు పాడవకుండా ఉండేందుకు, ఆహార వృథాను అరికట్టేందుకు ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించారన్నది మరువరాదు. ఆర్థిక సరళీకరణ విధానాల అమలు ప్యాకేజ్డ్ ఫుడ్ వాడకం మరింత ఎక్కువయ్యేందుకు కారణమైంది. 1991 తరువాత చక్కెర లతో నిండిన పానీయాలు దేశీ మార్కెట్లను ముంచెత్తాయి. అలాగే జంక్ ఫుడ్ అని ఇప్పుడు మనం పిలిచే రకరకాల ఆహార పదార్థాలూ అందుబాటులోకి వచ్చాయి. చక్కెరలు, ఉప్పు, కొవ్వులు ఎక్కువగా ఉన్న అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ కాస్తా ఊబకాయం, అసాంక్రమిక వ్యాధులు ఎక్కువయ్యేందుకు కారణమయ్యాయి.

ఈ పరిస్థితుల్లో చిరుధాన్యాలను మళ్లీ ప్రధాన ఆహారంగా మార్చడం పెద్ద సవాలే. ఒక పక్క రైతులు తమ పంటలు, పద్ధతులు మార్చుకునేందుకు తగిన ప్రోత్సాహాలు అందించడం... ఇంకోవైపు వినియోగదారులను చైతన్యపరచడం, వారి ఆహారపు అలవాట్లను మార్చడం ఆషామాషీ వ్యవహారమేమీ కాదు. భయం ఏమిటంటే... ఎక్కడ ఈ జంక్ ఫుడ్ పరిశ్రమ చిరుధాన్యాలపై ప్రస్తుతమున్న ఆసక్తిని తమకు అనుకూలంగా మార్చుకుంటుందో అని! అసాంక్రమిక వ్యాధులు ప్రబలేందుకు జంక్ ఫుడ్ ఒక కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎప్పుడైతే స్పష్టం చేసిందో, వీటిని పిల్లలకు అందించేందుకు చేస్తున్న ప్రయత్నాల నియంత్రణకు సూచనలు జారీ చేసిందో... అప్పటినుంచీ జంక్ ఫుడ్ పరిశ్రమ తమ ఉత్పత్తులను ఆరోగ్యకరమైనవనీ, సహజమైనవనీ చెప్పుకొనేందుకు గట్టిగా ప్రయత్నిస్తోంది.



మల్టీ గ్రెయిన్ కుకీలు, చక్కెర తక్కువగా ఉన్న శీతల పానీయాలు, హృదయానికి దోస్తుల్లాటివని చెప్పే వంటనూనెలు, 'పండ్ల' రసాలు అని పేర్లు పెట్టి... ఇంట్లో వండుకునే ఆహారానికీ, పండ్లు, కాయగూరలకూ వీటిని ప్రత్యామ్నాయాలుగా చూపే ప్రయత్నం మొదలైంది. చిరుధాన్యాల ద్వారా కూడా ఈ మాయ చేసేందుకు కంపెనీలు కొన్ని ఇప్పటికే హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ -నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ వైపు పరుగులు పెడుతున్నాయి కూడా.

జంక్ ఫుడ్ తయారీదారులు తమ ఉత్పత్తుల ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గొప్పగా చెప్పుకొంటూనే కీలక సమాచారాన్ని వినియోగదారుల కంటపడకుండా చూస్తాయి. ఆహారంలోని పదార్థాలు, హానికారక 'అడిటివ్స్'(కలిపినవి) వివరాలు కనిపించకుండా చేస్తాయి. దేశ నియమ నిబంధనల ప్రకారం ఫుడ్ ప్యాకెట్స్‌పై 'పోషక సమాచారం' తప్పనిసరిగా నిర్దిష్ట పద్ధతిలో ప్రచురించాలి. కొవ్వులు, చక్కెర, పిండిపదార్థాలు ఎంత మోతాదుల్లో ఉన్నాయో తెలపాల్సి ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒత్తిడి పుణ్యమా అని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఇప్పుడు 'ఫ్రంట్ ఆఫ్ ప్యాక్ న్యూట్రిషన్ లేబలింగ్'ను ప్రతిపాదించింది. సాధారణంగా ప్యాకెట్ వెనుకభాగంలో ఉండే సమాచారాన్ని ముందు కూడా ప్రచురించాలని ఈ ప్రతిపాదన ఉద్దేశం. దీనివల్ల వినియోగదారులకు మరింత సమాచారం అంది ఆరోగ్యకరమైన అల వాట్లు చేసుకుంటారని అంచనా. శాకాహార, మాంసాహార ఉత్పత్తు లను వేరు చేసేందుకు వాడినట్లు ఇవి కూడా గుర్తుల రూపంలో ఉంటాయి.

జంక్ ఫుడ్ కంపెనీలు, ఎఫ్ఎస్ఎస్ఏఐ కావాలని కోరుకుంటున్న స్టార్ రేటింగ్‌ల విషయంలో ఒక విషయాన్ని ప్రస్తావించాలి. అంత ఆరోగ్యకరం కాదని సూచించేందుకు రెండు స్టార్లను ఇచ్చినప్పుడు కూడా వినియోగదారులు వీటిని తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నట్లు అధ్యయనాల ద్వారా తెలిసింది. పైగా ఈ స్టార్ రేటింగులు కొన్ని నియమ నిబంధనలకు లోబడి ఇచ్చేవి కాబట్టి వాటిని పరిశ్రమ వర్గాలు తమకు అనుకూలంగా మర్చుకునే అవకాశముందని అంచనా. వీటికి భిన్నంగా వార్నింగ్ లేబుల్స్(హెచ్చరికలు) మాత్రం అందులో ఉన్న పదార్థాల ఆధారంగా తయారవుతాయి. కుకీలు, పాస్తా, నూడుల్స్ వంటివాటిల్లో కొంత మోతాదులో జొన్నలు, సజ్జలు కలిపినంత మాత్రాన వాటికి ఆరోగ్యకరమైనవన్న ట్యాగ్ తగిలించాల్సిన అవసరమేమీ లేదు కదా!

మరి పోషకాలపై మనకున్న అవగాహన ఎంత? హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) అంచనా ప్రకారం అది చాలా తక్కువ. ఫుడ్ లేబుల్‌లోని సమాచారం అప్పు డప్పుడూ చదువుతాము కానీ... కొనుగోళ్ల సమయంలో ఎక్కువగా తయారీ, ఎక్స్‌పైరీ డేట్లనే చూస్తుంటామని ఎన్ఐఎన్ నిర్వహించిన ఒక అధ్యయనంలో అధికులు తెలపడం ఇక్కడ ప్రస్తావనార్హం. ఇదే సమయంలో శాకాహార, మాంసాహారాలను వేరు చేసేందుకు ఉపయోగించే గుర్తులు మాత్రం బాగా ఉపయోగపడుతున్నట్లు వారు ఒప్పుకొంటున్నారు.

ఈ నేపథ్యంలో ఆహారపు అనారోగ్యతను సూచించేందుకు ట్రాఫిక్ సిగ్నళ్ల మాదిరి గుర్తులను వాడాలని కొంతమంది సూచిస్తున్నారు. కానీ కంపెనీలు మాత్రం 'హెల్త్ స్టార్ రేటింగ్' ఉంటే మేలు అంటున్నాయి. అయితే స్టార్ గుర్తు సానుకూలతను సూచిస్తుంది. ఒకట్రెండు అధ్యయనాల ప్రకారం కొందరు బాగా శుద్ధి చేసిన ఆహారం ప్యాకెట్లపై ఎర్రటి గుర్తు పెట్టడం మేలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాజాగా జాతీయ పోషకాహార సంస్థ కూడా ప్యాకేజీల ముందువైపు సమాచారం ఇవ్వడం మంచిదేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

అంటే జంక్‌ఫుడ్‌తో వచ్చే అనారోగ్యంపై ప్రజలను హెచ్చరించాలనుకుంటే ఆ హెచ్చరిక ఓ గుర్తు రూపంలో ఉండాలి. ప్యాకేజీ ముందువైపున ముద్రించాలి. వేర్వేరు రంగుల సాయంతో అనారోగ్య స్థాయిని కూడా సూచించగలిగితే ప్రజలు ఓ మోస్తరు ఆరోగ్యాన్నిచ్చే ఆహారాన్ని లేదా అనారోగ్య కారక ఆహారాన్ని వేర్వేరుగా గుర్తించి నిర్ణయాలు తీసుకునే వీలు ఏర్పడుతుంది. ఈ లేబలింగ్ విజయవంతం కావాలంటే జాతీయ స్థాయిలో పౌష్టికతపై ఓనమాలు దిద్దించాలి. ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. లేదంటే జంక్ ఫుడ్ తయారీదారులు తమ మార్కెటింగ్ బలం, నియంత్రణ సంస్థల చెలిమి సాయంతో చిరుధాన్యాలు, ఇతర ఆరోగ్యకరమైన ఆహారాలను కూడా హైజాక్ చేసే ప్రమాదం ఉంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదే సమస్య



మీడియాతో నా సమస్య ఏమిటంటే, వాళ్లు అబద్ధాలు చెబుతారని కాదు. మొత్తం కథనం కాకుండా, నేను తెలుసుకోవాలనుకునే వాళ్ల తరఫు కథనం మాత్రమే చెబుతారు.

– బిల్ మాహెర్, కమెడియన్

నమ్మొద్దు



కోవిడ్ ప్రయోగశాలలో నుంచి వచ్చే అవకాశమే లేదు. ఇది మనకు ఎలా తెలుసంటే, ఫ్యాక్ట్ చెకర్స్ వల్ల. అంతేగా... వాళ్లు అన్ని వాస్తవాలను తరచి చూస్తారు కదా! (వ్యంగ్యం)

– ఆడమ్ కరోలా, హోస్ట్

ద్వేషపూరితం



ఆర్మేనియన్ల పట్ల ద్వేషాన్ని రాజ్య స్థాయిలో ప్రచారం చేస్తూ, నిద్రిస్తున్న ఆర్మేనియన్‌ను చంపడం ఒక వీరోచిత చర్యగా చూసే దేశం నుంచి శాంతిని ఊహించడం అసంగతంగా ఉంటుంది. అజర్‌బైజాన్ తన దురాక్రమణను ఆపాలి.

– స్యుజానా అవెతిస్యాన్, ఆర్మేనియా నాయకురాలు

చెట్లకు కాస్తున్నాయా?



బలహీనమైన అమెరికా చెడ్డవాళ్లకు చెల్లింపులు జరుపుతోంది: పాకిస్తాన్, ఇరాక్, జింబాబ్వేలకు గత ఏడాదే వందల మిలియన్ల డాలర్లను చెల్లించింది. బలమైన అమెరికా ఇక ప్రపంచానికి ఎంతమాత్రం ఏటీఎం కాబోదు.

– నిక్కీ హేలీ, అమెరికా అధ్యక్ష అభ్యర్థి

ఆయనేం సాధువా?



అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా – అత్యున్నత జీవన ప్రమాణాలు కలిగిన లిబియాను యుద్ధంలో ఛితికిపోయిన దేశంగా మార్చాడు. సిరియాలో ఎన్ని బాంబులు వేశాడంటే, ఇంక వేయడానికి బాంబుల కొరత ఏర్పడేట్టుగా. అయినా ఆయన్ని ఇప్పటికీ కొందరు సాధువులా చిత్రిస్తారు.

– సారా అబ్దుల్లా, లెబనాన్ కామెంటేటర్

ప్రేమించడం తెలియదు



పురుషులు స్త్రీలను ప్రేమించరు. వాళ్లు స్త్రీ అనే 'భావన'ను ప్రేమిస్తారు. స్త్రీల 'ఎముకలు, మాంసం, ఒంపుల'ను ప్రేమిస్తారు. కానీ స్త్రీ సంపర్కంలో ఉండే ఉద్వేగాలు, పోషణ, జాగ్రత్తగా చూసుకోవడం, సానుభూతి సంబంధిత విషయాలకు వచ్చేసరికి– వాళ్లు స్త్రీలను బలహీనులుగా, పిచ్చివాళ్లుగా, మరీ పట్టుకొని వేలాడేవాళ్లుగా చూస్తారు.

– హుడా భంగ్రీ, స్త్రీవాది

ద్రోహం



ముఖ్యంగా గర్ల్ ఫ్రెండ్స్ వల్ల తప్పుడు అత్యాచార కేసుల్లో ఇరికామనే పురుషులు పదేపదే చెబుతున్నది ఇదీ: పోలీసులు ఈ మగవాళ్ల ఫోన్లను స్వాధీనం చేసుకుంటారు. అది పరస్పర అంగీకార సంబంధం అని వెల్లడయ్యే అన్ని ఛాట్స్‌ను, ఫొటోలను డిలీట్ చేస్తారు. ఇంక బెయిల్‌కూ, ఉపశమనానికీ ఏ రుజువూ ఉండదు. ఇది భయానకం.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

ఇన్‌బాక్స్

సిద్దిపేట స్వరూపం

ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో, గతంలో ఉమ్మడి రాష్ట్రం పేరు మీద ఉన్న సంస్థలన్నీ ఇప్పుడు తెలంగాణ పేరు మీద స్థిరపడ్డాయి. 2015 ఆగస్టు 30 వరకు ఉన్న 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' 'తెలంగాణ సారస్వత పరిషత్తు'గా మారింది. ఈ సంస్థ ఈ మధ్య ఆయా జిల్లాల సమగ్ర స్వరూపాన్ని అది పుస్తక రూపంలో వెలువరిస్తున్నది. విలువలతో కూడిన సాంస్కృతిక దృక్పథాన్ని సాహిత్యం ద్వారా అందజేయాలని, ఒక జిల్లాకు సంబంధించిన వారు వేరొకరి గురించి చెప్పడం కంటే, ఆయా



జిల్లాలకు చెందిన సాహిత్య కారులే తమ జిల్లా గురించి సమగ్ర చరిత్ర రూపొందించుకునే విధంగా 33 జిల్లాల్లో ఏర్పాట్లు చేసింది.

ఇందులో భాగంగా 'సిద్దిపేట జిల్లా సమగ్ర స్వరూపం' రూపుదిద్దుకుంది. సిద్దిపేటకు చెందిన ప్రముఖ రచయిత కొండి మల్లారెడ్డి కన్వీనర్‌గా తొమ్మిది మంది సభ్యులతో కోర్ కమిటీ... జిల్లా భూభాగాన్ని పరిధిగా నిర్ణయించుకుని, ఆ పరిధిలోని చరిత్ర, సంస్కృతి, సాహిత్యంలోని భిన్న ప్రక్రియలు, కళలు, సాహిత్య కళారూపాలు, పర్యాటక ప్రదేశాలు, జాతరలు, ఉద్యమాలు, త్యాగమూర్తులు, విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపార రంగాల ప్రగతి, సాగునీటి వ్యవస్థ, ప్రాజెక్టులు, తదితర అంశాలపై పరిశోధనాత్మక వ్యాసాలను పొందు పరిచిన పుస్తకం ఇది. రంగధాంపల్లి అమరవీరుల స్థూపం ముఖ చిత్రంగా ఉన్న ఈ పుస్తకం నేడు సాయంత్రం 7 గంటలకు సిద్దిపేట విపంచి కళా నిలయంలో... తెలంగాణ వైద్య, ఆరోగ్య; ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా ఆవిష్కృతం అవుతుంది. ఈ గ్రంథం పరిశోధకులకు, పోటీ పరీక్షార్థులకు, విద్యార్థు లకు, ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

– చిటుకుల మైసారెడ్డి, సిద్దిపేట
(నేడు సిద్దిపేటలో 'సిద్దిపేట జిల్లా సమగ్ర స్వరూపం' ఆవిష్కరణ)

చింత సచ్చినా పులుపు చావలే!

అభిప్రాయం



డా॥ సంగని మల్లేశ్వర్

నాలుగు దశాబ్దాల కిందట తెలుగుదేశం పార్టీని వెన్ను పోటు రాజకీయాలతో కబ్జా చేసి అధికారం ఏ క్షణాన చేపట్టారో కానీ... అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే ఏతులు! సందు దొరికితే చాలు సచ్చిపోయిన బర్రెకు పగిలిపోయిన బుడ్డెడు పాలి చ్చేదనీ, సెల్ఫ్ డంబాచారం! ఈ ఏడు పదుల వయసులో కూడా వంతన, పొంతన లేని గప్పాలు కొట్టుతూనే ఉంటారు. అపకీర్తికి కష్టపడుతూనేఉంటారు.

తెలంగాణకు అన్నం చూపెట్టింది నేనే అనడం సిగ్గుమాలిన పని కాకపోతే ఏంటి? తెలుగు దేశం పుట్టక మునుపు పుట్టిన మా తాతలు, ముత్తాతలు బతకలేదా? మట్టిని నమ్ముకొని ఆరుగాలం కష్టపడ్డ బతుకులు మావి. కరెంట్ మోటార్ లేదేమో కానీ, మోటలు కొట్టి ఎప్పటి నుండో ఎర్రగాలు పండిచ్చినోళ్లకు చంద్రబాబు అన్నం దిన నేర్పినమనుడు ఏమాత్రం బాగా లేదు. అయినా మేం జొన్నలు, సజ్జలు కూడా పండించేది. గట్క తిని అంబలి తాగిన చరిత్ర ఉన్న కష్టజీవులకు నామోషీ ఎందుకు? ఇప్పుడు అందరు తినేది ఆరోగ్యానికి అదే జొన్న, సజ్జలే కదా? పైగా చంద్రబాబు దగ్గర ఉన్న మరో గొప్ప గుణం ఏమిటంటే గెలుపు వచ్చే వరకు ఓటమిని అంగీకరించరు. తప్పులు సరిదిద్దుకోకుండా అబద్ధాలు చెప్పి ఓటమితో పోరాటం సాగిస్తూనే ఉంటారు.

కేసీఆర్ మార్గదర్శకత్వంలో కేటీఆర్ సారథ్యంలో తెలంగాణ ఐటీ సంస్థల స్థాపనకు అనువైన ప్రదేశంగా రూపుదిద్దుకుంది. శాంతి భద్రతలను మెరుగు పరిచి పెట్టుబడుల ప్రవాహానికి ద్వారాలు తెరిచారు. ఫలితంగా ఎగుమతులు పెరిగి ఆదాయం పెరిగింది. దేశంలోనే ఐటీ రంగంలో రెండవ స్థానంలో



మన రాజధాని హైదరాబాద్ నిలవడానికి ప్రస్తుత ప్రభుత్వమే కారణం అనడంలో అతిశయోక్తి లేదు. ప్రపంచంలో అప్పుడప్పుడే ఐటీ అభివృద్ధి చెందడం మూలానా... ఐటీకి భవిష్యత్ ఉందని గుర్తించి ఉమ్మడి ఏపీ రాజధాని హైదరాబాద్‌కు ఐటీని తీసుకు వచ్చానని పదే, పదే చెపుతున్న చంద్రబాబు... కర్ణాటక సీఎం కృష్ణ తర్వాతనే అనేది మర్చిపోయారు. అందుకే ఐటీ విధానం నేనే తీసుకొచ్చాననీ, సైబరాబాద్ నిర్మాణం చేసినా అనీ, దానితో రాష్ట్ర ఐటీ రంగ రూపురేఖలనే మార్చినా అనీ అంటారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఐటీ రంగంలో మంచి ప్రావీణ్యం సాధించారనడానికి తెలంగాణ ఐటీ రంగంలో వెల్లువలా వస్తున్న పెట్టు బడులే నిదర్శనం. మనం ప్రవేశపెట్టిన విధానాల వల్ల తరతరాలకు మేలు జరిగితే... చరిత్రను నెమరు వేసుకుంటారు.

చంద్రబాబు తెలంగాణ ప్రజలను కించపర్చేలా అన్నం తిన నేర్పిన అనీ, ఐటీని అభివృద్ధి చేసిన అనీ... చేస్తున్న ఊక దంపుడు ఉపన్యాసాలు భరించలేకనే 2018లో కర్రు కాల్చి వాత పెట్టినారు ప్రజలు. గీ ముచ్చట్లకు ఆంధ్రలోనూ అధికారం పోయింది. ఆయన మాటలు వింటే 'అమ్మకు అన్నం పెట్టనోడు... చిన్నమ్మకు బంగారు గాజులు చేపిస్తా నన్నట్టు' ఉంది.

మళ్లీ 2023లో లబ్ధి పొందేందుకు ఎకసెక్కాలకు పూనుకుంది టీడీపీ. ఆత్మగౌరవం దెబ్బతినేలా అహంకారంతో మాట్లాడితే తెలంగాణ ప్రజలు ఊరుకుంటారా? కేసీఆర్ తెలంగాణను దేశపటంలో అగ్రస్థానంలో నిలపడానికి చేస్తున్న కృషి దేశమంతా గమనిస్తోంది. మీ మాట ఎన్నటికీ ఎవరూ నమ్మరు.

వ్యాసకర్త విభాగాధిపతి, జర్నలిజం శాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం
మొబైల్: 98662 55355

అల్లుడి ప్రతాపం

కురుక్షేత్ర యుద్ధం మొదలయి పదహారు దినాలు గడిచాయి. భీష్ముడు నేలకొరిగాడు. ద్రోణుడు ప్రాణాలు వదిలాడు. కర్ణుడు, కౌరవ సేనాపతి అయినాడు. శల్యుడిని తనకు రథ సారథిగా నియమించమని దుర్యోధనుడిని అడిగాడు. శల్యుడు ముందు ఒప్పుకోలేదు. దుర్యోధనుడు ఎంతగానో బతిమాలిన పిదప ఒప్పుకొన్నాడు.

శల్యుడు సారథిగా యుద్ధ భూమిలో అడుగు పెట్టిన కర్ణుడు తన నుండి అర్జునుని దేవతలు కూడా రక్షించలేరని ప్రగల్భాలు పలుకుతాడు. నీవు అర్జునునితో సరితూగలేవని శల్యుడు, కర్ణుని మాటలను తిరస్కరించి హేళన చేస్తాడు. ఆ సందర్భంలోనే కర్ణుని నిరుత్సాహపరుస్తూ ఒక కథ చెబుతాడు శల్యుడు. ఆ కథ ఆంధ్ర మహాభారతం కర్ణ పర్వం ద్వితీయా శ్వాసంలో ఉన్నది.

సముద్రం దరిదాపుల్లో ఒక ఊరు. ఆ ఊరిలో ఒక సంపన్న గృహస్తు. ఆ గృహస్తుకు పదుగురు కుమారులు. ఒక కాకి వీరు విదిల్చే ఎంగిలి మెతుకులు తిని బాగా బలిసింది. ఆ



జ్యోతిర్మయం

బలుపుతో పక్షులన్నింటినీ అకారణంగా అవమానిస్తుండేది.

ఇలా ఉండగా ఒకసారి మానస సరోవరం నుండి కొన్ని హంసలు ఆ ప్రాంతానికి ఎగురుకొంటూ వచ్చినాయి. ఈ కాకికి ఆ హంసల గొప్పదనం తెలియదు. వాటి వద్దకు వెళ్లి తనతో ఎగరటంలో పోటీకి రమ్మని అడిగింది. హంసలు నవ్వి తమకున్న శక్తి సామర్థ్యాలు ఉన్నవి ఉన్నట్లుగా చెప్పినాయి. అయినా కాకి వినలేదు. తాను ఎన్నో విధాలుగా ఆకాశంలో ఎగుర గలననీ, అలా హంసలు ఎగురలేవనీ ప్రగల్భాలు పలికింది. అలా పలికి హంసలను తనతో పోటీకి రమ్మని మళ్ళీ పిలిచింది. అప్పుడు ఆ హంసల్లో ఒక హంస, కాకి కోరినట్లుగా పోటీకి సిద్ధమైంది. ఆ రెండు పక్షులు సముద్రం వైపు ఎగురుకొంటూ వెళ్ళాయి. సముద్రం మీద ఎంత దూరం వెళ్లినా హంసకు అలసట కలగలేదు. కాకి కాసేపటికే అలిసిపోయింది. క్రిందికి దిగి సేదదీరుదామంటే కింద అంతా అపార సముద్ర జలం. కాకికి ఎటూ పాలుపోలేదు. బలం క్షీణించి నీళ్ళలో పడిపోయే సమయం ఆసన్నమైంది. అప్పుడిక చేసేది లేక హంసను వేడుకొంటుంది తనను రక్షించమని. హంసచేత రక్షించబడిన కాకి, అప్పటి నుండి తన దురహంకారాన్ని విడిచిపెట్టి శాంత చిత్తంతో జీవించటం నేర్చుకొంది. ఈ కథ చెప్పిన శల్యుడు కర్ణుని ఆ కాకితో పోలుస్తాడు.

ఈ కథ అనేక నీతులతో కూడుకొని ఉన్నది. ప్రత్యర్థిని ఎదిరించే ముందు తన పరిమితులను తాను ఎరిగి ఉండాలి. కథలో కాకి అలా చేయక ప్రాణం మీదకు తెచ్చుకొంది. గొప్ప వారు తమ గొప్పతనాన్ని తామే చాటుకోరు. హంసలు ఆ ఉదాత్త గుణాన్ని ప్రదర్శించినాయి. అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను, సజ్జనుండు పల్కు చల్లగాను అనే నీతి పద్యానికి ఈ కథ చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది.

– దీవి సుబ్బారావు

దరఖాస్తు చేసుకున్న రోజే 'లెక్క'

- జీవో 59 కింద క్రమబద్ధీకరణ కోసం భూమి విలువ లెక్కింపు విషయంలో ప్రభుత్వం స్పష్టత
- గతంలో ఉన్న తేదీని మార్పు చేస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ

సాక్షి, హైదరాబాద్: జీవో నం.59 కింద ప్రభుత్వ భూముల్లోని నివాసాల క్రమబద్ధీకరణ విషయంలో భూముల విలువ లెక్కింపుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఈ జీవో కింద రెగ్యులరైజేషన్ కోసం చెల్లించాల్సిన ఫీజుకు సంబంధించి జూన్ 02, 2014 నాటి ప్రభుత్వ భూముల విలువల ఆధారంగా నోటీసులు జారీ చేయాలని గత జీవోలో ఉంది. అయితే, తాజాగా క్రమబద్ధీకరించిన భూములకు ప్రస్తుత ప్రభుత్వ విలువల ఆధారంగా తహశీల్దార్లు నోటీసులు జారీ చేసి ఆ మేరకు లబ్ధిదారుల నుంచి ఫీజు కట్టించుకున్నారు. దీంతో లబ్ధిదారుల్లో కొంత అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు కొందరు ఫీజు విషయంలో కోర్టులకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో జీవోనం.59కి సవరణ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం జీవో నం.22 జారీ చేశారు. ఈ జీవో ప్రకారం ఫలానా తేదీ (జూన్2,0214) కాకుండా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న రోజున ఉన్న ప్రభుత్వ విలువ ఆధారంగా క్రమబద్ధీకరణ ఫీజును నిర్ధారించనున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్ విగ్రహం కూల్చివేత

- మంత్రి ఎర్రబెల్లి దీనికి బాధ్యత వహించాలని వైఎస్సార్‌టీపీ డిమాండ్



కూల్చివేతకు గురైన వైఎస్సార్ విగ్రహం

పెద్దవంగర: మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం అవుతాపురంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారు. గత నెల 16న వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రజా ప్రస్థానం యాత్రలో భాగంగా 3,600 కి.మీ పూర్తి చేసుకున్న సందర్భంగా అవుతాపురంలో స్థానికులు ఏర్పాటుచేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. విగ్రహ ఏర్పాటు సమయంలో బీఆర్ఎస్ నాయకులకు, స్థానిక వైఎస్సార్‌టీపీ నాయకులు, మహిళల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే విగ్రహాన్ని జేసీబీతో కూల్చివేసినట్లు స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌టీపీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు సుజాత మంగీలాల్, జనగామ జిల్లా అధ్యక్షుడు గౌరవబోయిన సమ్మయ్య బుధవారం అవుతాపురం చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించగా..వీరికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలోనే వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చారని, దీనికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మీనారాయణ, వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్, నాయకులు రామిరెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహానేత వైఎస్ విగ్రహాన్ని కూలుస్తారా?

- వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆగ్రహం


సాక్షి, హైదరాబాద్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని కూల్చడం నీచమైన చర్య అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకుర్తిలో తన పాదయాత్ర మైలురాయి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చివేయడం పిరికిపందల అనాగరిక చర్యగా ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనను బుధవారం ఆమె ఖండించారు. మంగళవారం అర్ధరాత్రి బీఆర్ఎస్ గూండాలు చేసిన పనే ఇదని ఆరోపించారు. ఒక్క విగ్రహాన్ని అపవిత్రం చేస్తే.. పాలకుర్తిలో వెయ్యి విగ్రహాలు వెలుస్తాయని హెచ్చరించారు. ఈ విగ్రహాన్ని స్థానిక మహిళలే స్వయంగా నెలకొల్పారని, దయలేని దయాకర్ రావు దగ్గరుండి మరీ చేయించిన ఘాతుకం ఈ ఘటన అని విమర్శించారు. విగ్రహాన్ని పడగొట్టిన గూండాలకు నాయకుడు ఎర్రబెల్లేనని ఆరోపించారు. దయాకరరావుకు మనస్సాక్షి ఉంటే వెంటనే వైఎస్సార్ విగ్రహాన్ని పునఃస్థాపించాలని డిమాండ్ చేశారు.

ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ నుంచి గానుగ నూనె

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆయిల్ ఫెడ్ నుంచి వంటకు స్వచ్ఛమైన గానుగనూనెను అందుబాటులోకి తెచ్చారు. కల్తీకి ఆస్కారం లేకుండా తయారు చేయడంతో పాటు కెమికల్స్ కలపకుండా ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో ఈ గానుగనూనె తయారు అవుతుంది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో మంత్రి జగదీశ్‌రెడ్డి ఈ గానుగనూనెను అధికారికంగా విడుదల చేశారు.

అయితే హింస.. లేదంటే కుంగుబాటు!

యువతలో పెరిగిపోతున్న విపరీత మనస్తత్వం..



- ప్రేమ కోసమంటూ హత్యలకూ వెరవని వైనం
- సమస్యలు చుట్టుముడితే ఆత్మహత్యలకు పాల్పడుతున్న దైన్యం
- జీవితంలో ఆటుపోట్లను యువత అంగీకరించేలా చూడాలంటున్న నిపుణులు
- వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించే చర్యలు చేపట్టాలని సూచన

తాను ప్రేమించిన యువతిని ప్రేమిస్తున్నాడనే కక్షతో హైదరాబాద్‌లో ఓ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి తన స్నేహితుడిని ఇటీవల అత్యంత కిరాతకంగా హత మార్చాడు... సీనియర్ పీజీ వైద్య విద్యార్థి వేధింపులు, ర్యాగింగ్‌ను తాళలేక, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తగిన స్పందన రాక తాజాగా ఓ పీజీ వైద్య విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ తరహా ఘటనలు ఇటీవల కాలంలో తరచూ చోటుచేసుకుంటుండటం దేనికి సంకేతం? ఇందుకు కారణం ఏమిటి?

సాక్షి, హైదరాబాద్

నేటి ఉరుకుల పరుగుల జీవనంలో విద్యార్థులపై చదువుల ఒత్తిడి పెరగడం, వారి సమస్యలు ఏమిటో ఎవరూ అడిగి తెలుసుకొనే పరిస్థితి లేకపోవడం, సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్టే ప్రపంచంగా మారడం, మద్యం, డ్రగ్స్ వాడకం తదితర కారణాలతో కొంత మంది చెడుదారుల్లో పయనిస్తున్నారు. ఫలితంగా చిన్నచిన్న కారణాలు, సమస్యలనే తట్టుకోలేని పరిస్థితికి చేరుకుని విపరీతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు.

సమాజంలో నెలకొన్న పరిస్థితులు, వాటి వల్ల ఎదురుకాబోయే పరిణామాలపై విద్యార్థులకు శాస్త్రీయంగా అవగాహన కల్పించాలని మానసిక శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వారు మానసికంగా కుంగిపోకుండా ఆత్మవిశ్వాసం, మనోధైర్యం పెంపొందించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏం చేయాలి?

వివిధ పరిస్థితులు, జీవితంపై పడబోయే ప్రభావాలను తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలని చెబుతున్నారు. ఏదో జరిగిపోతుందనే భయం కంటే భవిష్యత్తులో ఎలాంటి ఆటుపోట్లనైనా ఎదుర్కొగలిగే మనోస్థైర్యాన్ని, విశ్వాసాన్ని వారిలో కలిగించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఇంటర్నెట్ ప్రపంచంలో మునిగితేలకుండా ఇతర సామాజిక అంశాలపై వారికి అవగాహన కల్పించాలని చెబుతున్నారు.

ఇన్‌స్టంట్ పరిష్కారాలే అసలు సమస్య..

ఇప్పుడు యువత ఇన్ స్టంట్ పరిష్కారాలు కోరుకుంటోంది. ఏవైనా సవాళ్లు ఎదురైనప్పుడు ఒత్తిళ్లను తట్టుకొనే శక్తి కొరవడటం, సంయమనం పాటించలేకపోవడం వారిలో సమస్యగా మారింది. ఓపికతో వ్యవహరించలేకపోవడం వల్ల సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఇవే హత్యలు, ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. పశ్చిమ దేశాల్లో పిల్లలకు లైఫ్‌స్కిల్ ట్రెనింగ్‌లో వీటన్నింటిపై అవగాహన కల్పిస్తారు. మన దేశంలోనూ అలాంటి శిక్షణనివ్వాలి. ఒంటరిగా డిజిటల్ పరికరాలతో ఎక్కువ సమయం గడిపే బదులు మిత్రులతో ఆటపాటలు, మాటల వల్ల సోషల్ స్కిల్స్ పెరుగుతాయి.



– డాక్టర్ నిషాంత్ వేమన, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, సన్ షైన్, చేతన హాస్పిటల్స్

వ్యక్తిత్వ లోపాలతోనే అలాంటి నిర్ణయాలు..

ప్రేమికుల్లో లేదా యువతలో క్రూరమైన ఆలోచనలు, కిరాతకంగా హత్యలకు పాల్పడాలనే ధోరణులు ఉత్పన్నమయ్యాయంటే వారిలో 'సైకో పాథాలజీ' లక్షణాలున్నట్లుగానే భావించాలి.వ్యక్తిత్వ లోపాలు ఉండటం వల్లే వారు అలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇళ్లలోనూ పిల్లలకు సమస్యలపై సరైన అవగాహన కల్పించకపోవడం కూడా ప్రస్తుత పరిస్థితులకు కారణం. ఇలాంటి వారికి ఎమోషనల్ అవేర్‌నెస్ కల్పించాలి. ప్రభుత్వాలు, యూనివర్సిటీలు, విద్యాసంస్థలు ప్రతి కాలేజీలో కమ్యూనికేషన్, కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. భావోద్వేగాలను ఎలా నియంత్రించుకోవాలి, ప్రతికూల భావోద్వేగాలను ఎలా అధిగమించాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. చిన్నప్పటి నుంచే బోధన పద్ధతుల్లో వాటిని భాగం చేయాలి.



– సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్

ఒత్తిడిని దూరం చేసుకోవాలిలా

- → ఏవైనా సంక్షోభ పరిస్థితులు ఎదురైతే మానసిక ప్రశాంతతను పాటిస్తూ ఒత్తిళ్లను దరిచేరనీయరాదు.
- → కష్టకాలంలో మనకు చేదోడువాదోడుగా నిలుస్తారనే విశ్వాసం, నమ్మకం ఉన్న వారితో మాట్లాడుతుండాలి.
- → మనకు ఆప్తులుగా ఉన్నవారితో మనలోని భావాలు పంచుకుంటూ రోజువారీ జీవితం ఆహ్లాదంగా గడిపేలా చూసుకోవాలి.



విద్యార్థుల మెస్ చార్జీల పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ నిర్ణయించారు. తరగతులవారీగా పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు మంత్రులు తెలిపారు. ముఖ్యమంత్రి పరిశీలన అనంతరం ఫైలుకు ఆమోదం లభిస్తుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి పెరగనున్న ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మరింత మెరుగ్గా...

కోవిడ్ తర్వాత నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. అయితే పెరిగిన ధరలకు అనుగుణంగా వసతిగృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు భోజన సదుపాయాలు కల్పించడం భారంగా మారింది. 2017లో ఖరారు చేసిన ధరల ప్రకారం పిల్లలకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనాన్ని అందించడం సాధ్యంకావట్లేదని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో స్పందించిన ప్రభుత్వం.. సంక్షేమ శాఖల మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. పలుమార్లు సమావేశమైన ఉపసంఘం మెస్ చార్జీల పెంపు కోసం మూడు ప్రతిపాదనలు తయారు చేసింది. అలాగే చార్జీల పెంపు వల్ల ప్రభుత్వంపై పడనున్న అదనపు భారాన్ని సైతం సమీక్షించింది. 10 శాతం, 20 శాతం, 30 శాతం మేర పెంచితే తలెత్తే అంశాలను చర్చించిన మంత్రులు 25 శాతం మేర పెంపుదలకు మొగ్గు చూపారు. దీంతో సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులతోపాటు విద్యాశాఖ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా మెస్‌చార్జీలు పెరగనున్నాయి. అదేవిధంగా డే స్కాలర్ విధానంలో చదువుతున్న పోస్టుమెట్రిక్ విద్యార్థుల డైట్ చార్జీలు సైతం 25 శాతం మేర పెరగనున్నాయి. ఏటా సగటున రాష్ట్రవ్యాప్తంగా 12.5 లక్షల మంది పోస్టుమెట్రిక్ విద్యార్థులు, 5.5 లక్షల మంది ప్రీ మెట్రిక్ విద్యార్థులు ఈ పథకాల కింద నమోదు చేసుకుంటున్నట్లు అంచనా.

ఏటా రూ.302 కోట్లు అదనం

ప్రస్తుతం 25 శాతం డైట్ చార్జీలు పెంచడం వల్ల ఏటా రూ.302 కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని డైట్ చార్జీల కంటే ఇవి చాలా ఎక్కువని వివరించింది. మొత్తం 8,58,959 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించింది. ఈ చార్జీల పెరుగుదల సీఎం ఆమోదం తరువాత అమలులోకి వస్తుంది.

ప్రస్తుత మెస్ చార్జీలు, పెంపు ప్రతిపాదనలు (రూ.లలో)

తరగతి	ప్రస్తుతం	ప్రతిపాదన
3 నుంచి 7 వరకు	950	1,200
8 నుంచి 10 వరకు	1,100	1,400
ఇంటర్ నుంచి పీజీ	1,500	1,875

హాస్టళ్లను తరచూ తనిఖీ చేయాలి



2012 తర్వాత 2017లో డైట్ చార్జీలను పెంచారని ఐదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 2023లో కొత్తగా డైట్ చార్జీలను పెంచాలనే నిర్ణ యం ప్రభుత్వం తీసుకుంది. సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనంతో పాటు మంచి వసతిని కల్పిస్తున్నాం. మెరుగైన వసతుల కల్పన లక్ష్యంతో పది కంటే తక్కువ సంఖ్యలో ఉన్న హాస్టళ్లను వాటికి సమీపంలోని అదే శాఖ నిర్వహిస్తున్న సంక్షేమ గురుకులాలలో కలిపే అవకాశాన్ని పరిశీలించాలని ఆదేశించాం. నెలలో తరచుగా జిల్లా కలెక్టర్ మొదలు తాలుకా స్థాయి యంత్రాంగం సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలను తనిఖీ చేస్తూ విద్యార్థులతో కలిసి భోజనం చేసి అక్కడే నిద్రించాలి. – ఆర్థిక మంత్రి హరీశ్‌రావు

సైఫ్ వేధించింది నిజమే..

ప్రీతి ఘటనపై యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ధారణ



సమావేశమైన యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు

ఎంజీఎం (వరంగల్): పీజీ మెడికల్ విద్యార్థిని ప్రీతిని సీనియర్ విద్యార్థి సైఫ్ వేధించినట్లు కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ధారించింది. ప్రీతిని సైఫ్ వేధించడంతోనే ఆత్మహత్యకు పాల్పడిన ఆమె.. నిమ్స్‌లో చికిత్సపొందుతూ చనిపోయిన విషయం తెలిసిందే. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ ఆదేశాల నేపథ్యంలో వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ బుధవారం కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. 13 మంది సభ్యులతో కూడిన కమిటీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సమావేశం జరిగింది. ప్రీతి ఆత్మహత్యకు యత్నించక ముందు నిర్వహించిన హెచ్‌ఓడీ డాక్టర్ నాగార్జునరెడ్డి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఏం జరిగింది.. కౌన్సెలింగ్ చేసిన వైద్యులు ఎవరు.. సైఫ్‌తో కలిసి ప్రీతి ఎన్నిసార్లు విధులు నిర్వర్తించింది తదితర అంశాలపై కమిటీ పూర్తిస్థాయిలో చర్చించింది. గత నవంబర్ 18న కళాశాలలో అడ్మిషన్ పొందిన ప్రీతికి, సైఫ్‌కు మధ్య పూర్తిస్థాయిలో భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయని, ఈ క్రమంలో ప్రీతిపై సైఫ్ పీజీ వాట్సాప్ గ్రూపుల్లో హేళన చేస్తూ సందేశాలు పెట్టినట్లు కమిటీ నిర్ధారించింది. సైఫ్ తనను టార్గెట్ చేస్తూ వేధిస్తున్నాడని కౌన్సెలింగ్‌లో ప్రీతి స్పష్టంగా చెప్పినట్లు హెచ్‌ఓడీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. కౌన్సెలింగ్ సమయంలో ప్రీతి ఒకానొక దశలో రోదిస్తూ తన ఆవేదనను వెలిబుచ్చినట్లు వైద్యులు సైతం చెప్పారు. ప్రీతి తనకు అండగా ఎవరూ లేరంటూ నిస్సహాయత వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా, కమిటీ నివేదికను యూజీసీ, జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)లకు ప్రిన్సిపల్ సమర్పించనున్నారు.

తన ప్రేమికురాలితో చనువుగా ఉంటున్నాడని.. స్నేహితుడి హత్య

- ఏడాదిన్నర తర్వాత విషయం వెలుగులోకి..
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



కార్తీక్ (ఫైల్)

మాక్లూర్: తాను ప్రేమించిన యువతితో సన్నిహితంగా ఉంటున్నాడని స్నేహితుడినే హతమార్చిన ఘటన ఏడాదిన్నర తర్వాత వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఆంధ్రనగర్ వెంకటేశ్వర కాలనీకి చెందిన బాపట్లరాజు, అతని తమ్ముడు హరీశ్, స్నేహితుడు ఎస్ కార్తీక్ కలిసిమెలిసి ఉండేవారు. ఆంధ్ర ప్రాంతం నుంచి 30 ఏళ్ల క్రితం వలస వచ్చిన వీరందరూ దినసరి కూలీ చేసుకుంటూ జీవనం సాగించే వారే. కాగా తను ప్రేమించిన యువతితో కార్తీక్ సన్నిహితంగా ఉండటాన్ని బాపట్ల రాజు సహించలేక పోయాడు. మట్టుపెట్టాలని భావించాడు. అతని తమ్ముడు హరీశ్‌తో కలిసి 2021 సెప్టెంబర్ 20న నందిపేట శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద మద్యం తాగించారు. అక్కడి నుంచి సమీపంలోని విజయనగరం గుట్ట వద్దకు తీసుకెళ్లి కార్తీక్‌ను కర్రలు, రాళ్లతో కొట్టి చంపేశారు. అక్కడే రాళ్ల మధ్య పూడ్చిపెట్టారు. కార్తీక్ తల్లిదండ్రులు తమ కుమారుడు ఆంధ్ర ప్రాంతానికి వెళ్లి ఉంటాడని ఇంతకాలం భావించారు. కాగా రెండ్రోజుల క్రితం తోటి కూలీలు అతని మృతిపై తల్లి చిన్న వెంకటమ్మ వద్ద అనుమానం వ్యక్తం చేశారు. దీంతో బుధవారం ఆమె నందిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు బాపట్లరాజు, అతని తమ్ముడు హరీశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. ఫోరెన్సిక్ నిపుణులు ప్రొఫెసర్ నాగమోహన్ ఆధ్వర్యంలో పూడ్చిపెట్టిన కార్తీక్ శవాన్ని వెలికి తీయించగా అస్థిపంజరం బయటపడింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఆ 15 నిమిషాల్లో ఏం జరిగింది?

- ప్రీతి ఆత్మహత్య ఘటనపై తొలగని అనుమానాలు
- కౌన్సెలింగ్‌కు ముందు సహచరులను మద్దతు అడిగినా ఎందుకివ్వలేదు?
- అప్పుడు సైఫ్‌కు ఎందుకు మద్దతిచ్చారు?
- కౌన్సెలింగ్‌లో తప్పు ఒప్పుకున్న సైఫ్‌ను ఎందుకు వెనకేసుకొచ్చారు?
- కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో కీలకాంశాలు



సాక్షి, వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య ఘటనపై ఇంకా అనుమానాలు తొలగిపోలేదు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి 7.15 గంటల మధ్య అంటే కేవలం 15 నిమిషాల వ్యవధిలో ఏం జరిగిందనే మిస్టరీని ఛేదించాల్సి ఉంది. ఆ సమయంలోనే ప్రీతి కుప్పకూలి ఉందని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అప్పుడు అక్కడ ఎవరెవరున్నారనేది పోలీసుల విచారణలో తేలినా సాంకేతిక దర్యాప్తులోనూ అనుమానమున్న వ్యక్తులు అక్కడేమైనా ఉన్నారా అన్నదానిపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఈ నెల 24న నిందితుడైన సెకండియర్ విద్యార్థి సైఫ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన సమయంలో సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఉన్న వివరాలు ఎన్నో అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది.

రిమాండ్ రిపోర్టులో ఏముందంటే...

- గత డిసెంబర్‌లో ఓ ప్రమాద కేసులో రోగి గైడ్ వైర్ విషయంలో సైఫ్ ప్రీతిని వేధించాడు. ఫిబ్రవరిలో హనుమకొండలోని మెటర్నిటీ ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్నప్పుడు ప్రిలిమినరీ అనస్తీషియా రిపోర్ట్స్ (పీఏసీ) రాయమన్నాడు. దాన్ని ప్రీతి రాశాక, వాట్సాప్ గ్రూప్‌లో ఆ నివేదికను పోస్టు చేసి ఇది ఎవరు రాశారంటూ హేళన చేస్తూ వ్యాఖ్యలు చేశాడు. దీనికి ప్రీతి స్పందిస్తూ 'నాతో ఏమైనా సమస్య ఉంటే హెచ్‌ఓడీ లేదంటే జీఎంహెచ్ ఇన్‌చార్జికి ఫిర్యాదు చేయ్' అని సైఫ్‌కు పర్సనల్ వాట్సాప్ మెసేజ్ పెట్టింది. లేదంటే ఇదే విషయాన్ని హెచ్‌ఓడీకి చెబుతాననడంతో కోపోద్రిక్తుడైన సైఫ్ ఆమెను మరింత వేధించాలనుకున్నాడు.
- హెచ్‌ఓడీకి సైఫ్‌పై ఫిర్యాదు చేసేందుకు మద్దతివ్వాలని స్నేహితులు, సహచరులను ప్రీతి కోరింది. తన ప్రవర్తన మారకపోతే అందరినీ వేధిస్తాడని చెప్పింది.
- ఈ నెల 21న అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ నాగార్జునకు వేధింపులపై వచ్చిన సమాచారంతో అదేరోజు 11 గంటలకు సైఫ్‌ను పిలిపించి మాట్లాడారు. ప్రీతిని ఎందుకు వేధిస్తున్నావు, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఆ తర్వాత ప్రీతిని పిలిచి ఇద్దరూ ఒకేచోట డ్యూటీ చేయొద్దన్నారు. ఎంజీఎం కాకుండా అంతకుముందు డ్యూటీ వేసిన ఆస్పత్రిలోనూ చేసుకోవచ్చన్నారు.
- ప్రీతి అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఎంజీఎంలో విధులకు హాజరైంది. స్టాఫ్ నర్సు మండె విజయలక్ష్మి, సెకండియర్ స్టూడెంట్ డాక్టర్ భీమని మనీశ్, థర్డ్ ఇయర్ హౌస్ సర్జన్ డాక్టర్ రూహితో కలిసి విధులు నిర్వర్తించింది. 22న ఉదయం 5 నుంచి 7 గంటల వరకు జరిగిన ఆపరేషన్‌లో పాల్గొంది. ఆ తర్వాత అనస్తీషియా పీజీ రూమ్ లోకి వెళ్లింది. 7.15 నిమిషాలకు స్టాఫ్ నర్సు విజయలక్ష్మి అక్కడికెళ్లగా కిందపడి ఉన్న ప్రీతిని చూసింది. ప్రీతికి డాక్టర్ రూహి, డాక్టర్ భీమని మనీశ్ చికిత్స అందించారు.

తేలాల్సినవెన్నో...

- సైఫ్ వేధింపుల గురించి ప్రీతి క్లాస్‌మేట్స్, సీనియర్ విద్యార్థులకు తెలిసినా ఆమె సహాయం కోరినప్పుడు వారు ఎందుకు మద్దతివ్వలేదు. ప్రీతి క్లాస్‌మేట్ అనూషకు వాట్సాప్ ద్వారా ప్రీతికి సపోర్ట్ చేయొద్దంటూ సైఫ్ వ్యక్తిగతంగా పెట్టిన మెసేజ్ పోలీసులకు లభ్యమైంది. ప్రీతి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న సందర్భంలోనూ ఈ వైద్య విద్యార్థినులంతా సైఫ్‌కు అనుకూలంగా ఆందోళన చేయడం వివాదాస్పదమైంది. విద్యార్థులు సీనియర్‌లతో కలిసి పనిచేయాల్సి ఉంటుందని, తమ కెరీర్‌కు ఇబ్బంది అవుతుందని వెనకడుగు వేశారా అన్నది తేలాలి.
- ప్రీతి కార్డియాక్ అరెస్ట్ వల్ల కుప్పకూలిందని, పీఏసీ రిపోర్టు విషయంలోనే సైఫ్ గట్టిగా మాట్లాడాడని, వేధింపులు, ర్యాగింగ్ లేవని బుధవారం నాడే ఎంజీఎం, కేఎంసీ ఉన్నతాధికారులు ఎందుకు ప్రకటించారు? సైఫ్ ర్యాగింగ్, వేధింపులు చేశాడని కౌన్సెలింగ్‌లో ఒప్పుకున్నా ఈ మాటల్ని వీరెందుకు చెప్పలేదు?
- ట్యాక్సికాలజీ రిపోర్టు వెల్లడించినా ఆమె ఇంజక్షన్ తీసుకుందా అన్నది పోలీసులు తేల్చాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా...

రూ.6,828 కోట్లతో 70 శిక్షణ విమానాలు

కొనుగోలుకు కేబినెట్ కమిటీ ఆమోదం

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం(ఐఏఎఫ్) కోసం రూ.6,828 కోట్లతో 70 హెచ్‌టీటీ-40 బేసిక్ శిక్షణ విమానాల కొనుగోలుకు రంగం సిద్ధమైంది. ఈ విమానాలను కొనుగోలు చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ(సీసీఎస్) బుధవారం ఆమోదం తెలియజేసింది. రానున్న ఆరేళ్లలో ఈ విమానాలు ఐఏఎఫ్‌కు అందనున్నాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ట్విట్టర్‌లో వెల్లడించారు. హెచ్‌టీటీ-40 విమానాలను ప్రభుత్వ రంగంలోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) ఉత్పత్తి చేయనుందని భారత రక్షణ శాఖ తెలియజేసింది. తక్కువ వేగంతో నడిచే ఈ విమానాలతో వైమానిక దళం సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వొచ్చని పేర్కొంది. హెచ్‌టీటీ-40 విమానాల తయారీలో హెచ్ఏఎల్ సంస్థ ప్రైవేట్ పరిశ్రమలను కూడా భాగస్వాములను చేయనుంది. దీనివల్ల 100కుపైగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో 1,500 మందికి ప్రత్యక్షంగా, 3,000 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అంచనా.

ఆర్థిక నేరగాళ్లపై సమష్టి చర్యలు

జీ-20 భేటీలో భారత్ పిలుపు

గురుగ్రాం (హరియాణా): పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్లను రప్పించేందుకు ద్వైపాక్షిక సహకారం చాలదని, ఈ దిశగా దేశాలన్నీ ఉమ్మడిగా చర్యలు తీసుకుంటేనే ఫలితముంటుందని భారత్ పేర్కొంది. ఈ విషయంలో ప్రస్తుతమున్న సంక్లిష్ట నిబంధనలు తదితరాలను తక్షణం సరళీకరించుకోవాలంది. బుధవారం మొదలైన జీ-20 దేశాల అవినీతి వ్యతిరేక వర్కింగ్ గ్రూప్ రెండు రోజుల సదస్సులో కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ ఈ మేరకు సూచించారు. విజయ్ మాల్యా మొదలుకుని నీరవ్ మోదీ దాకా పలువురు ఆర్థిక నేరగాళ్లను రప్పించి చట్టం ముందు నిలబెట్టేందుకు భారత్ కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ సూచన ప్రాధాన్యం సంతరించుకుంది. "ఇలాంటి ఆర్థిక నేరగాళ్ల విదేశాలకు తరలించిన మొత్తాలు ఉగ్రవాదం మొదలుకుని మనుషుల అక్రమ రవాణా తదితరాలకు వనరులుగా మారుతున్నాయి. అక్రమ ఆయుధాల వ్యాప్తికి, ప్రజాస్వామిక ప్రభుత్వాలను బలహీనపరచడానికీ ఉపయోగపడుతున్నాయి" అంటూ మంత్రి ఆందోళన వెలిబుచ్చారు. "అందుకే ఆర్థిక నేరగాళ్ల ఆస్తులను వీలైనంత త్వరగా ప్రభుత్వాలు రికవర్ చేసుకోవాలి. ఆ దిశగా ప్రపంచ దేశాలన్నీ పని చేయాలి. జీ-20 దేశాలు ఇలాంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలి" అని సూచించారు.

చైనా యాప్ టిక్‌టాక్‌పై పెరుగుతున్న నిషేధం

పలు దేశాల్లో ప్రభుత్వ ఫోన్లలో టిక్‌టాక్ వాడకంపై నిషేధం..

భారత్‌లో ఇప్పటికే పూర్తిస్థాయిలో నిషేధం

తాజాగా ఆ జాబితాలోకి వచ్చిన కెనడా..

మన దేశంలో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరినీ అలరించిన మొబైల్ ఫోన్ అప్లికేషన్(యాప్) టిక్‌టాక్. యాప్‌లో స్వయంగా వీడియోలు రూపొందించి, సోషల్ మీడియాలో పోస్టుచేసి, లైక్‌లు కొట్టేయడం, కామెంట్లు చూసుకొని మురిసిపోవడం ఒక మధురానుభూతి, ఒక జ్ఞాపకం. చైనాకు చెందిన ఈ యాప్‌పై భారత ప్రభుత్వం నిషేధం విధించడంతో ఇప్పుడు ఎవరికీ అందుబాటులో లేకుండాపోయింది. ప్రపంచవ్యాప్తంగా టిక్‌టాక్‌ను నిషేధిస్తున్న దేశాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. అమెరికాలో సగానికిపైగా రాష్ట్రాల్లో ప్రభుత్వ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల్లో యాప్ వాడకాన్ని నిషేధించారు. అమెరికా సైనిక దళాల్లో యాప్‌పై నిషేధం అమలవుతోంది. తాజాగా ఈ జాబితాలో కెనడా చేరింది. జనానికి నచ్చిన టిక్‌టాక్‌ను ప్రభుత్వాలే వారి నుంచి దూరం చేస్తుండడానికి కారణాలు ఏమిటో తెలుసుకుందాం..

- సాక్షి, నేషనల్ డెస్క్



టిక్.. టిక్.. టిక్...


షేరింగ్‌కు సమయం లేదు మిత్రమా!


ఎందుకీ నిషేధం?

- టిక్‌టాక్‌ను నిషేధించడానికి ప్రభుత్వాలు చెబుతున్న ప్రధాన కారణం దేశ భద్రత.
- యూజర్ల డేటాతో పాటు బ్రౌజింగ్ హిస్టరీ, లొకేషన్ వంటి వివరాలు నేరుగా చైనా ప్రభుత్వానికి చేరే ప్రమాదం ఉందని వివిధ దేశాలు అనుమానిస్తున్నాయి.
- ఇతర దేశాలపై, అక్కడి ప్రభుత్వాలపై దుష్ప్రచారం చేయడానికి టిక్‌టాక్ యాప్ చైనా చేతిలో ఒక ఆయుధంగా మారు తుందని భావిస్తున్నాయి.
- తప్పుడు ప్రచారం సాగించి, ఎన్నికల ఫలితాలను సైతం ప్రభావితం చేసే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.
- టిక్‌టాక్ వల్ల యూజర్ల డేటాకు భద్రత లేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వాలు ఇచ్చే ఫోన్లలోనూ టిక్‌టాక్ వాడుతున్నారని, దానివల్ల జాతీయ భద్రత ప్రమాదంలో పడుతుందని అంటున్నారు.
- విదేశాల సమాచారం చైనా చేతుల్లోకి వెళ్తే అక్కడి కంపెనీలు దాన్ని ఒక అవకాశంగా వాడుకొని లబ్ధి పొందుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

ఏయే దేశాలు నిషేధించాయి?

- 2021 జనవరిలో భారత్ టిక్‌టాక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించింది. డేటా ప్రైవసీ, జాతీయ భద్రత కోసమంటూ చైనాకు చెందిన ఇతర యాప్‌లపైనా నిషేధం విధించింది.
- ఇండోనేషియా, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లో తాత్కాలిక నిషేధం విధించారు. నిర్ధారణ కాని, అనైతిక సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నందుకే ఈ చర్య తీసుకున్నట్లు అక్కడి ప్రభుత్వాలు వెల్లడించాయి.
- అమెరికా, కెనడా, యూరోపియన్ యూనియన్(ఈయూ)లో ప్రభుత్వం ఇచ్చిన అన్ని ఫోన్ల నుంచి టిక్‌టాక్‌ను తొలగించాలంటూ ఉద్యోగులకు ఇటీవలే ఆదేశాలు అందాయి.
- అమెరికాలో 50కిపైగా రాష్ట్రాల్లో ప్రభుత్వ ఎలక్ట్రానిక్ పరికరాల్లో టిక్‌టాక్‌ను బ్యాన్ చేశారు. కేవలం ప్రభుత్వ ఫోన్లలోనే కాదు, సాధారణ ప్రజలు సైతం టిక్‌టాక్ వాడకుండా పూర్తిగా నిషేధించాలని అమెరికాలో కొందరు పార్లమెంట్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.
- అమెరికా సైనిక దళాల్లో టిక్‌టాక్ వాడకాన్ని ఇప్పటికే నిషేధించారు.
- తైవాన్‌లో ప్రభుత్వ ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్ కంప్యూటర్లలో టిక్‌టాక్ యాప్ ఉపయోగించడాన్ని 2022 డిసెంబర్‌లో నిషేధించారు.





టిక్‌టాక్ వాదనేంటి?

- తమ యాప్ వల్ల డేటా భద్రత ఉండదన్న వాదనను టిక్‌టాక్ యాజమాన్యం ఖండించింది.
- యాప్ కారణంగా డేటా చౌర్యం జరుగుతోందని తేల్చడానికి ఎలాంటి ఆధారాల్లేవని స్పష్టం చేసింది.
- యూజర్ల వ్యక్తిగత సమాచారం ఇతరుల చేతుల్లోకి వెళ్లే అవకాశమే లేదని, యాప్‌ను నిశ్చింతగా వాడుకోవచ్చని భరోసా ఇచ్చింది.
- కొన్ని దేశాలు టిక్‌టాక్‌ను నిషేధించడం విచారకరమని పేర్కొంది. డేటా ప్రైవసీకి తాము అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించింది.
- యాప్‌ను నిషేధించడం యూజర్లను తప్పుదోవ పట్టించడమే అవుతుందని యాజమాన్యం ఆక్షేపించింది.
- నిషేధం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆరోపించింది.
- కొన్ని పాశ్చాత్య దేశాలు అభద్రతాభావంతో టిక్‌టాక్‌ను తొలగిస్తున్నాయని, అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని చైనా ప్రభుత్వం విమర్శిస్తోంది. యాప్‌పై నిషేధం విధించడం ఆయా దేశాల్లో వ్యాపార వాతావరణాన్ని దెబ్బతీయడం ఖాయమని తేల్చిచెప్పింది.

అసలు ఏమిటీ యాప్?

చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ అనే కంపెనీ 'డౌయిన్' పేరిట 2016 సెప్టెంబర్‌లో యాప్‌ను ప్రారంభించింది. తొలుత చైనాలోనే అందుబాటులోకి వచ్చిన ఈ యాప్ యూజర్లను విశేషంగా ఆకట్టుకుంది. రికార్డుస్థాయిలో డౌన్‌లోడ్లు జరిగాయి. దాంతో బైట్‌డ్యాన్స్ కంపెనీ 2017లో అంతర్జాతీయ వెర్షన్‌ను ప్రారంభించింది. దీనికి టిక్‌టాక్ అనే పేరుపెట్టింది. 2018 ఆగస్టు నుంచి యాప్ ప్రపంచమంతటా బాగా వ్యాప్తిలోకి వచ్చింది. చైనాలో ఇది డౌయిన్ పేరిటే కొనసాగుతోంది. తక్కువ నిడివితో కూడిన వీడియోల షేరింగ్ కోసం టిక్‌టాక్ యాప్‌ను రూపొందించారు. ప్రాథమికంగా లిప్ సింకింగ్, డ్యాన్సింగ్ వీడియోలను ఇతరులతో పంచుకొనే వీలుంది. 3 సెకండ్ల నుంచి 10 నిమిషాల నిడివిల వీడియోలు ఉంటాయి. యూజర్ల అభిరుచులు, ఆసక్తిని బట్టి వీడియోలు ప్రత్యక్షం కావడం ఇందులోని మరో ప్రత్యేకత. ప్రపంచవ్యాప్తంగా 40కిపైగా భాషల్లో టిక్‌టాక్ యాప్ అందుబాటులో ఉంది.

టిక్‌టాక్.. 60 నిమిషాలే

18 ఏళ్లలోపు వారికి వర్తింపు

వాషింగ్టన్: టిక్‌టాక్ వల్ల వినియోగదారుల డేటా భద్రతకు ముప్పు వాటిల్లుతోందని ఒకవైపు ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, మరోవైపు యాప్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. 18 ఏళ్లలోపు యూజర్లు ఒకరోజులో కేవలం ఒక గంటపాటే యాప్‌ను వినియోగించేలా పరిమితి విధించినట్లు టిక్‌టాక్ ట్రస్ట్ అండ్ సేఫ్టీ అధినేత కార్మాక్ కీనన్ బుధవారం ప్రకటించారు. గంట సమయం దాటిన తర్వాత వీడియోలు ఆగిపోతాయని తెలిపారు. గంట తర్వాత మళ్లీ యాప్‌లో వీడియోలు చూడాలంటే పాస్‌కోడ్ ఎంటర్ చేయాల్సి ఉంటుందని అన్నారు. ఇక 13 ఏళ్లలోపు యూజర్లు పాస్‌కోడ్ ఎంటర్ చేసిన తర్వాత మరో 30 నిమిషాలపాటు మాత్రమే వీడియోలు తిలకించేందుకు వీలుంటుందని, ఆ తర్వాత ఆగిపోతాయని పేర్కొన్నారు.

చక్కని ప్రణాళిక, మెరుగైన నగరాలు

దేశాభివృద్ధికి కీలకం: మోదీ



న్యూఢిల్లీ: చక్కని ప్రణాళికతో నిర్మితమైన నగరాలే దేశ భవితను నిర్దేశిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన ఈ 75 ఏళ్లలో అలాంటి కనీసం 75 నగరాలను నిర్మించుకున్నా ప్రపంచ వేదికపై భారత్ ఎప్పుడో గొప్ప స్థాయికి చేరి ఉండేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చా పరంపరలో భాగంగా బుధవారం 'పట్టణ ప్రణాళిక, అభివృద్ధి, పారిశుద్ధ్యం'పై వెబినార్‌లో ఆయన మాట్లాడారు. దేశం శరవేగంగా పట్టణీకరణ చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తుపై దృష్టితో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడం చాలా ముఖ్యమని నొక్కిచెప్పారు. "రాబోయే పాతికేళ్లలో దేశ ప్రగతి పట్టణ ప్రణాళికపై ఆధారపడి ఉంటుంది. "మన నగరాలు వ్యర్థ, నీటి ఎద్దడి రహితంగా, అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా ఉండటం చాలా ముఖ్యం. చక్కని ప్రణాళిక అందుకు కీలకం. కొత్త నగరాల అభివృద్ధి, ఉన్నవాటి ఆధునికీకరణ కూడా పట్టణాభివృద్ధిలో కీలకమే. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాల్లో పట్టణ ప్రణాళిక వ్యవస్థ బలోపేతం, ప్రైవేట్ రంగంలో నైపుణ్యాన్ని అందుకు సమర్థంగా వినియోగించుకోవడం, పట్టణ ప్రణాళికను అత్యున్నతంగా తీర్చిదిద్దే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మాణానికి ఏం చేయాలో దృష్టి పెట్టాలి. ఎందుకంటే ప్రణాళిక సరిగా లేకున్నా, దాని అమలులో విఫలమైనా పెను సమస్యలకు దారి తీయడం ఖాయం" అని సూచించారు. పట్టణాభివృద్ధికి ఈ బడ్జెట్లో రూ.15 వేల కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. టైర్-2, టైర్-3 నగరాల ప్రణాళిక, అభివృద్ధిలో పెట్టుబడులు పెరగాల్సిన అవసరముందన్నారు.

'ఈశాన్య' ఫలితాలు నేడే

త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో కౌంటింగ్

న్యూఢిల్లీ: మూడు ఈశాన్య రాష్ట్రాలు త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు గురువారం వెలువడనున్నాయి. ఈశాన్యాన మరింతగా విస్తరించాలన్న అధికార బీజేపీ ఆశలు ఏ మేరకు నెరవేరాయన్నది ఈ ఫలితాలతో తేలనుంది. ముఖ్యంగా ఈసారి అందరి దృష్టీ ప్రధానంగా త్రిపురపైనే నెలకొంది. అక్కడ పాతికేళ్ల వామపక్ష పాలనకు తెర దించుతూ అభివృద్ధి నినాదంతో బీజేపీ 2018లో సొంతంగా అధికారంలోకి రావడం తెలిసిందే. దాంతో ఈసారి బీజేపీని ఎలాగైనా నిలువరించేందుకు చిరకాల శత్రుత్వాన్ని పక్కన పెట్టి మరీ లెఫ్ట్, కాంగ్రెస్ జట్టు కట్టి బరిలో దిగాయి. ఇక నాగాలాండ్, మేఘాలయల్లో కూడా బీజేపీ అధికార సంకీర్ణంలో భాగస్వామిగా ఉంది. అయితే మేఘాలయలో ఎన్నికల ముందు అధికార నేషనల్ పీపుల్స్ పార్టీతో బంధం తెంచుకుని సంకీర్ణం నుంచి బయటికొచ్చింది. అంతేగాక తొలిసారిగా మొత్తం 60 స్థానాలకూ పోటీ చేసింది! నాగాలాండ్‌లో మరోసారి ఎన్‌డీపీపీతో కలిసి బరిలో దిగింది. అక్కడ బీజేపీ అధికారం నిలుపుకుంటుందని, త్రిపురలో ఏకైక పెద్ద పార్టీగా మెజారిటీకి చేరువగా వస్తుందని ఎగ్జిట్ పోల్స్ పేర్కొనడం తెలిసిందే. ఇక త్రిపురలో హంగ్ తప్పకపోవచ్చని అంచనా వేశాయి. కొత్తగా తెరపైకి వచ్చిన టిప్రా మోతా కనీసం 15 స్థానాలకు పైగా గెలుచుకుని కింగ్‌మేకర్‌గా మారొచ్చని జోస్యం చెప్పాయి.

భారత చట్టాలకు లోబడి పని చేయాల్సిందే

బీబీసీ ఉదంతంపై బ్రిటన్‌కు జై శంకర్ స్పష్టీకరణ


జై శంకర్, క్లెవర్లీ

న్యూఢిల్లీ: భారత్‌లో పని చేసే సంస్థలన్నీ ఇక్కడి చట్టాలకు, నియమ నిబంధనలకు లోబడి నడుచుకోవాల్సిందేనని బ్రిటన్‌కు కేంద్రం స్పష్టం చేసింది. రెండు రోజుల జీ-20 మంత్రుల సదస్సులో పాల్గొనేందుకు భారత్ వచ్చిన బ్రిటన్ విదేశాంగ మంత్రి జేమ్స్ క్లెవర్లీ బుధవారం విదేశాంగ మంత్రి జై శంకర్‌తో భేటీ అయ్యారు. పలు ద్వైపాక్షిక అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. బీబీసీపై పన్ను ఎగవేత ఆరోపణలు, ఢిల్లీ, ముంబైల్లోని ఆ సంస్థ కార్యాలయాల్లో సీబీఐ సర్వే ఉదంతాన్ని ఈ సందర్భంగా క్లెవర్లీ ప్రస్తావించారు. ఏ సంస్థలైనా ఇక్కడి పూర్తిగా చట్టాలకు లోబడి పని చేయాలని జై శంకర్ గట్టిగా బదులిచ్చినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పలు అంతర్జాతీయ పరిణామాలపైనా తామిద్దరం లోతుగా చర్చలు జరిపామంటూ అనంతరం జై శంకర్ ట్వీట్ చేశారు.

ఢిల్లీ కేబినెట్లో కొత్త ముఖాలు

ఆతిషి, సౌరభ్‌కు అవకాశం ● 5 నుంచి ఇంటింటి ప్రచారం


సౌరభ్ భరద్వాజ్ ఆతిషి

న్యూఢిల్లీ: జైలుపాలై రాజీనామా చేసిన ఇద్దరు కీలక మంత్రులు మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్ స్థానాలను వెంటనే భర్తీ చేస్తూ ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పార్టీ ఎమ్మెల్యేలు ఆతిషి (41), సౌరభ్ భరద్వాజ్ (43)లను మంత్రులుగా నియమించాలని లెఫ్టినెంట్ గవర్నర్‌కు సీఎం అరవింద్ కేజ్రీవాల్ బుధవారం సిఫార్సు చేశారు. ఎల్జీ వాటిని రాష్ట్రపతి ఆమోదానికి పంపినట్టు సమాచారం. సిసోడియా, జైన్ మంగళవారం రాజీనామా చేయడం తెలిసిందే. ఉప ముఖ్యమంత్రి హోదాలో సిసోడియా ఏకంగా 18 శాఖల బాధ్యతలు చూశారు. ఆయనను మద్యం కుంభకోణం కేసులో సీబీఐ ఆదివారం అరెస్టు చేసింది. ఇక మనీ లాండరింగ్ కేసులో 2022 మేలో అరెస్టై జైల్లో ఉన్న జైన్ కూడా మంగళవారం దాకా శాఖల్లేని మంత్రిగా కొనసాగారు. కేజ్రీవాల్ కేబినెట్లో ఆతిషి తొలి మహిళా మంత్రి కానున్నారు.

మమ్మల్నెవరూ ఆపలేరు: కేజ్రీవాల్

ఆప్ ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లతో కేజ్రీవాల్ బుధవారం తన నివాసంలో భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై లోతుగా చర్చించారు. సిసోడియా అరెస్టు రాజకీయ కక్షసాధింపులో భాగమేననే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఇందుకోసం మార్చి 5 నుంచి ఆప్ ఎమ్మెల్యేలంతా ఇంటింటి ప్రచారం, వీధుల్లో సమావేశం వంటివి చేపట్టనున్నారు. భేటీ అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. జైన్, సిసోడియాలను అరెస్టులు ఢిల్లీ సర్కారు చేస్తున్న మంచి పనులను ఎలాగైనా అడ్డుకోవాలన్న ప్రధాని మోదీ వ్యూహంలో భాగమేనని ఆరోపించారు. "కానీ మా టైమొచ్చింది. ఆప్ ఓ తుఫాను. మమ్మల్నెవరూ ఆపలేరు" అన్నారు. అణగదొక్కేందుకు చూసిన కొద్దీ తాము రెట్టించిన వేగంతో పని చేస్తామన్నారు.

కేజ్రీ తప్పుకునేది ఎప్పుడు: బీజేపీ

'పావులు తప్పుకున్నాయి. మరి రాజు సంగతేమిటి?' అని బీజేపీ ప్రశ్నించింది. ఢిల్లీ మద్యం పాలసీ అవకతవకల్లో కీలక పాత్ర పోషించిన కేజ్రీవాల్ సీఎం పదవికి ఎప్పుడు రాజీనామా చేస్తారో చెప్పాలని పార్టీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అన్నారు. సిసోడియా రాజీనామా లేఖపై తేదీ లేకపోవడం ఎన్నో ప్రశ్నలకు తావిస్తోందన్నారు. మద్యం విధానం రూపొందించిన మంత్రుల బృందంలో సభ్యుడైన కై లాశ్ భాటియా కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

'నిత్యానంద కైలాస'ను పరిగణించం: ఐరాస

జెనీవా: భారత్‌లో లైంగిక వేధింపుల ఆరోపణల కేసులు ఎదుర్కొంటూ దేశం వదిలి పారిపోయిన నిత్యానంద స్వామి నెలకొల్పినట్లు చెబుతున్న 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస (యూఎస్‌కే)' దేశం తరఫున ఇద్దరు ప్రతినిధులు జెనీవాలో గత నెల 24న ఐక్య రాజ్య సమితికి చెందిన ఒక చర్చాగోష్టిలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఐరాస గుర్తించని దేశం తరఫు వ్యక్తులు ఆ కార్యక్రమంలో ఎలా భాగస్వాములయ్యారని విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ఐరాస స్పష్టతనిచ్చింది. 'యూఎస్‌కే ప్రతినిధులు వాస్తవానికి ఒక దేశం తరఫున ఆ చర్చలో పాల్గొనలేదు. కేవలం ఒక స్వచ్ఛంద సంస్థగా వచ్చి మాట్లాడారు. ఆ అంశాలను పరిగణనలోకి తీసుకోవట్లేదు' అని ఐరాస బుధవారం స్పష్టంచేసింది. ' జెనీవా చర్చాగోష్టిలో ముందస్తు అనుమతితో ఎవరైనా వచ్చి మాట్లాడొచ్చు. పలు సమస్యలు, ఇతివృత్తాలపై వెలువడే భిన్నాభిప్రాయాలతో కూడిన ముసాయిదా అది. ఐరాసలో కైలాస దేశ శాశ్వత మహిళా రాయబారిగా చెప్పుకున్న విజయప్రియ నిత్యానంద అభిప్రాయాలను పట్టించుకోబోం' అని జెనీవాలోని ఐరాస మానవహక్కుల హై కమిషనర్ చెప్పారు.

గ్రీస్‌లో గూడ్స్, రైలు ఢీకొని...

36 మంది సజీవ దహనం



తెంపే (గ్రీస్): గ్రీస్‌లో ఎదురెదురుగా వస్తున్న ప్రయాణికుల, సరకు రవాణా రైళ్లు ఢీకొన్న దుర్ఘటనలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. 85 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఉత్తర గ్రీస్‌లోని తెంపే పట్టణ సమీపంలో మంగళవారం అర్ధరాత్రివేళ ఈ ఘోరం సంభవించింది. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న సహాయక బృందాలు అవిశ్రాంతంగా కష్టపడుతున్నాయి. చెల్లాచెదురుగా, తలకిందులుగా పడిన బోగీల నుంచి క్షతగాత్రులను బయటకు తీసుకొచ్చి ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మూడు బోగీలకు మంటలు అంటుకోవడంతో అందులోని 36 మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. వేగంగా రైళ్లు ఢీకొనడంతో బోగీల కిటికీలు, అద్దాలు పగిలి ప్రయాణికుల మృతదేహాలు కొన్ని వాటిల్లోంచి విసిరేసినట్టు 140 అడుగుల దూరంలో పడ్డాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ప్యాసింజర్ రైలులో 350 మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలుస్తోంది. ఘటనకు నైతిక బాధ్యతగా రవాణ మంత్రి కోస్టాస్ కరమాన్లిస్ రాజీనామా చేశారు.

ముకేశ్ అంబానీకి విదేశాల్లోనూ జెడ్ ప్లస్ భద్రత

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి, ఆయన కుటుంబ సభ్యులకు భారత్‌లోనే గాక విదేశాల్లోనూ జెడ్ ప్లస్ భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అందుకయ్యే ఖర్చులను అంబానీయే భరించాలని పేర్కొంది. న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణ మురారీ, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

అమెరికా ఎగుమతుల మండలిలో ఇద్దరు భారతీయులు

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వ విభాగంలో మరో ఇద్దరు భారతీయ అమెరికన్లకు కీలక పదవులు దక్కాయి. అమెరికా అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించి ప్రధాన జాతీయ సలహా మండలి ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్‌కు కార్పొరేట్ రంగానికి చెందిన పునీత్ రంజన్, రాజేశ్ సుబ్రమణియమ్‌లను ఎన్నుకున్నట్లు వైట్‌హౌస్ బుధవారం ప్రకటించింది. రంజన్ గతంలో డెలాయిట్ కన్సల్టింగ్‌కు సీఈవోగా పనిచేశారు. ప్రస్తుతం డెలాయిట్ గ్లోబల్ సీఈఓ ఎమిరిటస్‌గా ఉన్నారు. ఫెడ్ఎక్స్‌కు సీఈవో, అధ్యక్షునిగా సుబ్రమణియమ్ కొనసాగుతున్నారు. సుబ్రమణియమ్‌ను ఈ ఏడాది భారతప్రభుత్వం ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డ్‌తో సత్కరించింది. అమెరికా అంతర్జాతీయ వాణిజ్యం పనితీరు, ఎగుమతులను ప్రోత్సహించడం, వ్యాపార, పరిశ్రమల, వ్యవసాయ, కార్మిక, ప్రభుత్వ విభాగాల మధ్య తలెత్తే సమస్యలపై చర్చించి ఈ ఎగుమతుల మండలి పరిష్కారానికి కృషిచేస్తుంది. ఈ అంశాలపై అధ్యక్షుడు బైడెన్‌కు సలహాలు, సూచనలు చేస్తోంది.

రూ.120 కోట్లతో 'వందేభారత్'

టీఎంహెచ్-ఆర్‌వీఎన్ఎల్ కన్సార్టియం బిడ్

న్యూఢిల్లీ: 200 వందేభారత్ రైళ్ల తయారీ, నిర్వహణ కోసం టెండర్లు ఆహ్వానించగా, రష్యాకు చెందిన సీజేఎస్సీ ట్రాన్స్‌మాష్‌హోల్డింగ్, భారత్‌కు చెందిన రైలు వికాస్ నిగమ్ లిమిటెడ్(టీఎంహెచ్-ఆర్‌వీఎన్ఎల్) కన్సార్టియం లోయెస్ట్ బిడ్డర్‌గా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ బీహెచ్ఈఎల్, టిటాగఢ్ వ్యాగన్స్ కన్సార్టియం రెండో లోయెస్ట్‌గా అవతరించినట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. ఐసీఎఫ్-చెన్నై ఒక్కో వందే భారత్ రైలును రూ.128 కోట్లతో తయారు చేసింది. తాము రూ.120 కోట్లతోనే తయారు చేస్తామని టీఎంహెచ్-ఆర్‌వీఎన్ఎల్ కన్సార్టియం వెల్లడించింది. ఇక బీహెచ్ఈఎల్-టిటాగఢ్ వ్యాగన్స్ కన్సార్టియం ఒక్కో రైలును రూ.140 కోట్లతో తయారు చేసేందుకు ముందుకొచ్చింది

యుద్ధం ఆపి చర్చించుకోండి: చైనా, బెలారస్

బీజింగ్: రష్యా, ఉక్రెయిన్ తక్షణం యుద్ధానికి స్వస్తి పలికి చర్చలకు రావాలని చైనా, బెలారస్ సూచించాయి. ఇరు దేశాల అధ్యక్షులు షీ జిన్‌పింగ్, అలెగ్జాండర్ లెకెషెంకో ఈ మేరకు సంయుక్తంగా పిలుపునిచ్చారు. వారిద్దరూ బుధవారం బీజింగ్‌లో సమావేశమై చర్చించారు. రష్యాకు అత్యంత సన్నిహిత దేశమైన బెలారస్ యుద్ధంలో తొలినుంచీ అన్నిరకాలుగా ఆ దేశానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న విషయం తెలిసిందే.

ప్రజల పొదుపును పణంగా పెట్టారు

అదానీ గ్రూప్‌ను కాపాడేందుకే: రాహుల్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌ను కాపాడేందుకు భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ), లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)లపై తీవ్ర ఒత్తిడి పెంచి ప్రజల పొదుపులను పణంగా పెట్టారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బుధవారం ఆయన ట్విట్టర్‌లో ఒక వీడియోను షేర్‌చేస్తూ హిందీలో ట్వీట్ చేశారు. ' అదానీ గ్రూప్ షేర్ల విలువ పతనం అవుతుండటంతో ఎల్ఐసీ రోజూ రూ.1,000 కోట్లు నష్టపోతోంది. ఎవరి బలవంతం, ఒత్తిడి వల్ల ఎల్ఐసీ, ఎస్‌బీఐ ప్రజల సొమ్మును అదానీలో పెట్టుబడిగా పెట్టాయి?. మిత్రకాలం-2. మీ(ప్రజల) పొదుపు మొత్తాలు అదానీకి ధారాదత్తం చేయబడ్డాయి. లక్షల కోట్ల రుణాలున్న అదానీ గ్రూప్‌లో ఎల్ఐసీ ఎందుకు పెట్టుబడి పెట్టింది? ముసుగు తొలగితేగానీ దేశానికి ఎంత నష్టం వాటిల్లిందనేది తేలదు. మీరు(ప్రజలు) మీ పొదుపును కుటుంబం, పిల్లల భవిష్యత్తు కోసం దాచిపెట్టారు. ఈ మొత్తాలను రిస్క్‌లో పడేసింది ఎవరు? ఎల్ఐసీలో పెట్టిన పెట్టుబడి భద్రమే అని ప్రకటించాల్సిన బాధ్యత ప్రధానికి లేదా? గత నెల 24వ తేదీ నుంచి ఇప్పటిదాకా అదానీ షేర్ల దెబ్బకు ఎల్ఐసీకి జరిగిన నష్టాలను ప్రధాని ప్రకటించగలరా? అదానీ గ్రూప్‌లో పెట్టుబడి పెట్టిన రిటైర్ ఇన్వెస్టర్ల భయాలను మోదీ పోగొట్టగలరా? ' అని రాహుల్ పలు ప్రశ్నలు సంధించారు.

కొత్త లుక్‌లో రాహుల్

బ్రిటన్ పర్యటనలో రాహుల్ గడ్డం ట్రిమ్ చేసుకుని కొత్త లుక్‌లో కనిపించారు. భారత్ జోడో యాత్ర కొనసాగినంతకాలం రాహుల్ నెరసిన గడ్డంతో ఉన్న విషయం తెల్సిందే. మంగళవారం లండన్ చేరుకున్న రాహుల్ చక్కని సూట్‌లో కనిపించారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఆయన ప్రసంగించనున్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులతో చర్చాగోష్ఠిలో పాల్గొంటారు.



మూగబోయిన ట్విట్టర్ పిట్ట



న్యూయార్క్: ట్విట్టర్ మళ్లీ మొరాయించింది. గంటలపాటు స్తంభించిపోయింది. ట్విట్టర్ సేవలకు అంతరాయం కలగడం కొన్ని నెలలుగా పరిపాటిగా మారడం తెల్సిందే. సంస్థను మస్క్ హస్తగతం చేసుకున్నాక వేలాది ఉద్యోగులకు ఉద్వాసన పలికారు. దాంతో ఉన్న కాస్త సిబ్బందికి నిర్వహణ తలకు మించిన భారంగా మారినట్లు కనిపిస్తోంది. తాజాగా 200 మంది ఇంజనీర్లను మస్క్ తొలగించారు. వీరిలో ప్రొడక్ట్ మేనేజర్లు, ఇంజనీర్లు, డేటా సైన్స్ విభాగ సిబ్బంది ఉన్నారు. బ్లూ వెరిఫికేషన్ చందా, త్వరలో అమలు చేయబోయే పేమెంట్స్ ప్లాట్‌ఫామ్‌లకు సారథిగా ఏస్తర్ క్రాఫోర్డ్‌నూ సాగనంపారు. తాజా ఉద్యోగుల ఉద్వాసన పర్వంలో సేల్స్ విభాగ చీఫ్ క్రిస్ రేడీని మస్క్ వెళ్లగొట్టడం గమనార్హం.



కోరల్లేని ట్రాఫిక్ పోలీస్

ఫుట్‌పాత్‌లు, అక్రమ పార్కింగ్‌లు కనిపిస్తున్నా.. చర్యలు తీసుకునే అధికారం ట్రాఫిక్ పోలీసులకు లేకుండాపోతోంది. జీహెచ్‌ఎంసీ విభాగానికి లేఖ రాయటం వరకే పరిమితమవుతున్నారు. -8లో



టూరిస్ట్‌గా వెళ్లి.. బంగారం స్మగ్లింగ్

టూరిస్ట్‌గా విదేశాలకు వెళ్లి అక్రమంగా బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్న ముగ్గురు నిందితులను రాజేంద్రనగర్ జోన్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. -8లో

కేలండర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ తెలంగాణ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్- 2023 క్యాలెండర్‌ను బుధవారం మంత్రి కేటీఆర్ మాదాపూర్‌లోని టీ హబ్‌లో ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

ఉప్పల్ ఎమ్మెల్యేకు త్రుటిలో తప్పిన ప్రమాదం



కీసర: ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది. కీసర రింగ్‌రోడ్డు వద్ద కుక్కలు అడ్డురావడంతో ముందు వెళ్తున్న వాహనం సడెన్ బ్రేక్‌తో ఆగిపోయింది. దీని వెనకాలే వస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి వాహనం ఢీకొనడంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. తాను సురక్షితంగా ఉన్నానని కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి తెలిపారు.

శాస్త్రీయ కళలకు నూతనత్వం తోడవ్వాలి

- ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శాస్త్రీయ కళలను కాపాడుతూ వాటి వైభవాన్ని ముందు తరాలకు కొత్తదనంతో అందించే ప్రయత్నం చేస్తున్నామని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన శాస్త్రీయ నృత్య గురువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో శాస్త్రీయ నృత్య సంగీతాన్ని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విశ్వవిద్యాలయాల్లో కూడా పరిచయం చేసే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కళాభిమానుల సహకారంతో నిత్య ప్రక్రియలో నూతనత్వాన్ని తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. శ్రీశ్రీ., గుర్రం జాషువా, గురజాడ దేశభక్తి, అభ్యుదయ గేయాలకు శాస్త్రీయ నృత్యాలను జోడించి కళలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ ఉపాధ్యక్షురాలు కె.సుజావతి, ఎస్ఆర్ఐ సుశీల, ప్రొఫెసర్ రత్న, సంధ్య, పుష్ప, శరత్, మాస్టర్ రేపల్లె కృష్ణ, వాల్మీకి, పిఎస్ మూర్తి, రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీసీసీని సందర్శించిన సోక్‌నెట్ రీజినల్ కో-ఆర్డినేటర్

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయంగా పేరెన్నిక గన్న సోక్‌నెట్ సంస్థ సౌత్ ఏషియా రీజినల్ కో-ఆర్డినేటర్, నేషనల్ సెక్యూరిటీ డైరెక్టర్ రిచర్డ్ లాస్ బుధవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ పోలీసు ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీఎస్‌పీఐసీసీసీ) సందర్శించారు. ఆయన వెంట బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పొలిటికల్ ఎకానమీ సలహాదారు నళినీ రఘురామన్ సైతం ఉన్నారు. రాష్ట్ర పోలీసు విభాగం వద్ద అందుబాటులో ఉన్న టెక్నాలజీ, దాని వల్ల ఫలితాలు తదితరాలను నగర కొత్వాల్ సీవీ ఆనంద్ వీరికి వివరించారు.

క్రికెటర్ త్రిషకు సత్కారం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని రాష్ట్ర క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ విజేత భారత జట్టు సభ్యురాలైన గొంగడి త్రిషను బుధవారం బీఆర్‌కే భవన్‌లోని తన చాంబర్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా త్రిషకు నగదు ప్రోత్సాహం కోసం ఆమె తండ్రి రామిరెడ్డి క్రీడా శాఖ కార్యదర్శికి విజ్ఞాపనపత్రం అందజేయగా పరిశీలిస్తామని ఆయన తెలిపారు.

నిమ్స్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించండి

లక్డీకాపూల్: నిమ్స్ వైద్యుల మానసిక, శారీరక ఉల్లాసానికి ఆస్పత్రిలో మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్‌కు నిమ్స్ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. బుధవారం ఆయన చాంబర్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీషాన్, కార్యదర్శులు శరత్, శ్రీనివాస్ కలిసి వినతిపత్రం సమర్పించారు. జూనియర్ డాక్టర్లు ఎంతో పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, మానసిక విశ్రాంతికి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ విషయమై స్పందించిన ఆంజనేయ గౌడ్.. నిమ్స్‌లో స్థలాన్ని పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు.



కొమ్మలన్నీ.. పసుపు పచ్చ రెమ్మలై!



చెట్టు కొమ్మలన్నీ పూల రెమ్మలై కన్నులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పసుపు పచ్చ పూలు మనసును హత్తుకుంటున్నాయి. ఎవరు నేర్పారమ్మ ఈ కొమ్మకు.. పూలిమ్మనీ రెమ్మరెమ్మకూ.. అన్నచందంగా వర్ణ రంజితమై ప్రకృతి కాంతకు వన్నె తెస్తున్నాయి. హుస్సేన్ సాగర్ నుంచి ఖైరతాబాద్ వైపు వెళ్లే మార్గంలో ఓ చెట్టు పసుపు పచ్చ పూలతో ఆకట్టుకుంటోంది. అటువైపు వెళ్లే వారిని కట్టి పడేస్తోంది.

ఓవర్ లోడ్

మూడు వేల మెగావాట్లు దాటిన విద్యుత్ డిమాండ్

- తీవ్ర ఒత్తిడికి గురవున్న ఫీడర్లు.. డీటీఆర్‌లు
- ఎర్తింగ్ లోపం.. తరచూ ఫ్లెక్సివేషన్లు
- సరఫరాలో అంతరాయాలు
- ఫిర్యాదులకు స్పందించని ఇంజనీర్లు
- ఆందోళనలో వినియోగదారులు

సాక్షి, సిటీబ్యూరో: ఎండలు భగ్గున మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో సిటిజన్లు ఉపశమనం కోసం రోజంతా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఆన్ చేసి ఉంచుతున్నారు. పగటిపూట మాత్రమే కాదు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యుత్ వినియోగం అనుహ్యంగా పెరుగుతోంది. ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో సబ్‌స్టేషన్లలోని ఫీడర్లతో పాటు వీధుల్లోని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ఆయిల్ లీకేజీలను అరికట్టకపోవడానికి తోడు డీటీఆర్‌ల వద్ద సరైన ఎర్తింగ్ సిస్టం లేకపోవడం వల్ల షార్ట్‌సర్క్యూట్‌లు, సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యలు తలెత్తుతున్నాయి. అసలే వార్షిక పరీక్షల కాలం.. ఆపై ఇంట్లో కరెంట్ కూడా లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొంతకాలంగా 24 గంటల కరెంట్ సరఫరా పుణ్యమా అని చాలా మంది తమ అపార్ట్‌మెంట్లలోని జనరేటర్ల వాడకాన్ని మరిచిపోయారు. ఏళ్ల తరబడి నిర్వహణ లేమికి తోడు ట్యాంకులో డీజిల్ కూడా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్లు చేస్తే.. క్షేత్రస్థాయి లైన్‌మెన్లు, ఏఈలు, ఏడీఈలు, డీఈల నుంచి ఆశించిన స్పందన రావడం లేదు.

ఆయిల్ లీకేజీలు...ఎర్తింగ్ సమస్యలు..

ఎండలకు ఇన్సులేటర్ల మధ్య పగుళ్లు ఏర్పడుతున్నాయి. వీటి మధ్యలో గ్యాప్ ఏర్పడుతుండటం.. తెల్లవారుజామున కురిసే మంచు వీటి మధ్య చేరడంతో షార్ట్‌సర్క్యూట్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా ఆయా ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోని గృహ, వాణిజ్య సముదాయాలకు సరఫరాలో అంతరాయం తప్పడం లేదు. అంతేకాదు నగరంలోని మెజార్టీ సబ్‌స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు రాక్ ఏరియాల్లోనే



ఏర్పాటు చేశారు. సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యలు తలెత్తినప్పుడు ఎర్తింగ్ కీలకంగా వ్యవహరిస్తుంది. మెజార్టీ డీటీఆర్‌ల వద్ద సరైన ఎర్తింగ్ సిస్టం లేదు. ఉన్న చోట నిర్వహణ అధ్వానంగా తయారైంది. డీటీఆర్‌ల చుట్టూ చెత్త పేరుకుపోతోంది. ఫ్యూజులు పోయిన సమయంలోనే కాదు.. షార్ట్‌సర్క్యూట్ వంటి సాంకేతిక సమస్యలు తలెత్తిన సమయంలో నిప్పు మిణుగురులు ఆ పక్కనే ఉన్న చెత్తపై పడటంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి డీటీఆర్‌లో పేలుళ్లతో పాటు సంస్థకు ఆస్తి నష్టం వాటిల్లుతోంది. నిజానికి ప్రతి మూడు నెలలకోసారి లైన్ల పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఆశించిన విధంగా పనులు చేయడం లేదనే విమర్శలు లేకపోలేదు.

గ్రేటర్‌లో ఇటీవల విద్యుత్ వినియోగం ఇలా..

తేదీ	మిలియన్ యూనిట్లు	పీక్ డిమాండ్ (మెగావాట్లలో)
20	56.8	2820
21	57.9	2879
22	58.8	3335
23	59.9	2879
24	60.0	2932
25	56.8	2736
26	52.9	2479
27	57.8	2810
28	58.9	2873

అంచనాలు మించే అవకాశం..

- గ్రేటర్‌లో 2019 మే 29న రికార్డు స్థాయిలో 73.4 ఎంయూల కరెంట్ వినియోగం జరిగింది. కోవిడ్ కారణంగా వరుసగా రెండేళ్ల పాటు వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు మూతపడ్డాయి. నిర్మాణాలు, గృహ ప్రవేశాలు కూడా పెద్దగా లేకపోవడంతో కరెంట్ వినియోగం అనూహ్యంగా తగ్గింది. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఆ తర్వాత 2022 ఏప్రిల్ 18న 69.4 ఎంయూలు నమోదైంది. అప్పట్లో గరిష్ట డిమాండ్ 3435 మెగావాట్లుగా ఉంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది కొత్త కనెక్షన్లు 12 శాతం పెరిగాయి.
- పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయి. ప్రతి ఇంట్లోనూ ఏసీ, కూలర్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, గ్రీజర్, వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు సర్వ సాధారణమయ్యాయి. ఫలితంగా విద్యుత్ వినియోగం కూడా రెట్టింపైంది. భగ్గున మండుతున్న ఎండలకు తోడు రాత్రిపూట చలి తగ్గి.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం నగరవాసులు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు 24 గంటలు ఆన్‌లో ఉంచుతుండటంతో కరెంట్ వినియోగం రెట్టింపవుతోంది. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే.. ఈ వేసవిలో 4 వేల మెగావాట్లకు చేరి రోజు సగటు వినియోగం 80 ఎంయూలు దాటే అవకాశం ఉన్నట్లు డిస్కం ఇంజినీర్లు అంచనా వేశారు.

కుక్కలు సరే.. మరి కోతులు?

నగరంలో పెరుగుతున్న వానరాల బెడద

- జీహెచ్‌ఎంసీలో వానరాలను పట్టుకునే నిపుణులు కరువు
- కఠిన నిబంధనల కారణంగా ముందుకు రాని కాంట్రాక్టు ఏజెన్సీలు
- కుక్కలతో పాటు కోతుల బెడదనూ తగ్గించాలంటున్న నగర ప్రజలు

సాక్షి, సిటీబ్యూరో: అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడి మృతి నేపథ్యంలో వెలువడిన విమర్శలతో కుక్కల బెడద తగ్గించేందుకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ.. కుక్కల సంతతి నివారణకు స్పెషల్‌డ్రైవ్‌లు తదితర చర్యలు చేపట్టింది. నగరంలో ఓవైపు కుక్కలతో పాటు మరోవైపు కోతుల బెడదతోనూ ప్రజలు.. ముఖ్యంగా మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోతుల బెడద నివారణకు సైతం ప్రాణాలు పోయేంతదాకా చర్యలు చేపట్టరా..? అని కోతుల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



కాంట్రాక్టర్ల అనాసక్తి..

కోతుల సమస్యలపై ఫిర్యాదులందినా పాత పద్ధతుల్లోనే ఉచ్చులు వేసి పట్టుకుంటుండటం మినహా జీహెచ్‌ఎంసీలో కోతులను పట్టుకోవడంలో నిపుణులు లేరు. అందుకోసం టెండర్లను ఆహ్వానిస్తున్నప్పటికీ, కాంట్రాక్టు ఏజెన్సీలు ముందుకు రావడం లేదు. కోతులను పట్టుకునేందుకు సంబంధించిన టెండర్లలో జీహెచ్‌ఎంసీ తక్కువ మొత్తం మాత్రమే పేర్కొంటుండటం ఇందుకు కారణంగా తెలుస్తోంది. పట్టుకున్న కోతుల్ని వన్యప్రాణుల సంరక్షణ నిబంధనల మేరకు నిర్దేశించిన అడవుల్లో వదలాల్సిన బాధ్యత సైతం కాంట్రాక్టు ఏజెన్సీలకే ఉండటంతో క్లిష్టమైన పనులుగా భావించి ముందుకు రావడం లేదు. ఢిల్లీ వంటి నగరాల్లో కాంట్రాక్టు ఏజెన్సీలకు ఒక కోతిని పట్టుకుంటే రూ.6 వేలు, ఇతర నగరాల్లో రూ.5 వేలు చెల్లిస్తుండగా, జీహెచ్‌ఎంసీ మాత్రం రూ.1600 మాత్రమే చెల్లిస్తామంటోంది. ఈ సొమ్ముతోనే కోతుల్ని పట్టుకున్నప్పటినుంచి నిర్దేశిత అటవీప్రాంతంలో వదిలేంత దాకా దాని సంరక్షణ, ఆహారం, తదితర బాధ్యతలు కూడా కాంట్రాక్టు ఏజెన్సీలవేనని టెండరు నిబంధనల్లో పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో కోతుల బెడద తీరడం లేదు.

ఈ ప్రాంతాల్లో ఎక్కువ...

నగరంలో పద్మారావునగర్, న్యూబోయిగూడ, ఉస్మానియా యూనివర్సిటీ, టోలిచౌకి, మెహదీపట్నం, ముషీరాబాద్, కాప్రా, మారేడ్‌పల్లి, అల్వాల్, అమీర్‌పేట్, తార్నాక, ఎల్‌బీనగర్, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతులు వీధుల్లో తిరగడమే కాక ఇళ్లలోకి చొరబడుతుండటం, ఇంట్లో సామాగ్రి చెల్లాచెదురు చేస్తుండటం, అడ్డుకోబోతే మీద పడుతుండటంతో మహిళలు భయంతో బెంబేలెత్తుతున్నారు. ఎండాకాలంలో సమీప అటవీప్రాంతాల నుంచి ఆహారం కోసం కోతులు గుంపులు ఎక్కువగా నగరంలోకి వస్తున్నట్లు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో కంటే ఎండాల సమయంలో వీటి బెడద మరింత ఎక్కువని ఆయా ప్రాంతాల ప్రజలు పేర్కొన్నారు. కుక్కల బెడద తోపాటు కోతుల బెడద లేకుండా చేయాల్సిన బాధ్యత జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగానిదే. ప్రస్తుతం కుక్కల సమస్యలపైనే దృష్టి సారిస్తున్న ఆ విభాగం కోతులకు సంబంధించిన ఫిర్యాదులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

ఫార్మా పరిశ్రమలో పేలిన రియాక్టర్ | ఇద్దరు కార్మికుల మృతి



ప్రమాదం జరిగిన పరిశ్రమ


కుమార్ సరెన్


నరేంద్ర

జీడిమెట్ల: ఫార్మా పరిశ్రమలో రియాక్టర్‌ను శుభ్రపరుస్తుండగా మంటలు అంటుకుని రసాయనాలు మీదపడటంతో ఇద్దరు కార్మికులు మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. జీడిమెట్ల సీఐ పవన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి శ్రీనివాస్ రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన కుమార్ సరెన్ (25), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నరేంద్ర (26) సూరారంలో ఉంటూ జీడిమెట్ల ఫేజ్-4లోని అరోర్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు డ్యూటీకి వెళ్లారు. ఉదయం 10.15 గంటలకు పరిశ్రమలోని రియాక్టర్‌ను రసాయనాలతో శుభ్రపరుస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు అంటుకుని కుమార్, నరేంద్రలపై రసాయనాలు పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని పరిశ్రమ సిబ్బంది అంబులెన్స్‌లో నగరంలోని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. అనంతరం ఇరువురి మృతదేహాలను పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిశ్రమలో ప్రమాదం జరిగిన తీరును ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జీడిమెట్ల ఎస్సై మన్మధ్‌లు సందర్శించి ప్రమాదతీరును పరిశ్రమ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను పరిశ్రమ యాజమాన్యం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ఏఐఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్-ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) 65వ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయమైన దారుస్సలాం మైదానంలో జరగనుంది. ఇందుకోసం పార్టీ నాయకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఇటీవల ముంబైలో తొలి జాతీయ సదస్సు నిర్వహించుకోవడంతో పాటు ఈ ఏడాది తెలంగాణలో ఎన్నికలు జరగనుండటంతో సభావేదికపై నుంచి కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఈసారి 50 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని పార్టీ నేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రకటించిన విషయం విదితమే. ఆవిర్భావ సభ ద్వారా వీటిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఆవిర్భావ సభకు దేశం నలుమూలల నుంచి పార్టీ బాధ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

బల్దియా దిద్దుబాట

- వెలుగు చూస్తున్న సెల్ఫ్ అసెస్‌మెంట్ అక్రమాలు
- రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు లేకుండానే పీటీఐఎన్‌లు
- ఉదాసీనంగా జారీ చేసిన జీహెచ్‌ఎంసీ
- వెల్లువెత్తిన ఫిర్యాదులతో పరిశీలన..
- 15వేలకు పైగా పీటీఐఎన్‌ల తొలగింపు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ భవనాల్ని సైతం ప్రైవేట్ వ్యక్తులు తమ పేరిట సెల్ఫ్ అసెస్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోకుండా.. ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత ఫీజు చెల్లించగానే పీటీఐఎన్‌లు (ఆస్తిపన్ను గుర్తింపు నంబర్లు) సైతం జారీ చేసిన జీహెచ్‌ఎంసీ, వివిధ వర్గాల నుంచి అందిన ఫిర్యాదులతో దిద్దుబాటు చర్యల్లో మునిగింది. సెల్ఫ్ అసెస్‌మెంట్ ద్వారా అందిన దరఖాస్తులు.. వాటిల్లో తగిన డాక్యుమెంట్లు లేనప్పటికీ అసెస్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ, ఫీజులు కట్టించుకొని జారీచేసిన పీటీఐఎన్‌ల పరిశీలన చేపట్టింది. గత ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఆన్‌లైన్ ద్వారా దాదాపు 58వేల దరఖాస్తులు సెల్ఫ్ అసెస్‌మెంట్ల కోసం రాగా ఆన్‌లైన్ ద్వారానే ఫీజులు కూడా స్వీకరించి పీటీఐఎన్‌లు జారీ చేసింది. ఇటీవల చేపట్టిన పరిశీలనలో తగిన డాక్యుమెంట్లు లేని పీటీఐఎన్‌లు 15వేలకుపైగా ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించింది. మరో 15 వేల పీటీఐఎన్‌ల పరిశీలన కొనసాగుతోంది. వీటిలో తగిన డాక్యుమెంట్లతో సక్రమంగా ఉన్నవెన్నో, లేనివెన్నో తెలియాల్సి ఉంది. మిగతావి మాత్రం తగిన డాక్యుమెంట్లతో సవ్యంగా ఉన్నట్లు సమాచారం.



రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు లేకుండానే..

ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ అసెస్‌మెంట్ కోసం అందిన దరఖాస్తుల పరిశీలనను జీహెచ్‌ఎంసీ అధికారులు అసలు పట్టించుకోకపోవడంతో.. ఏ భవనం కావాలనుకుంటే ఆ భవనానికి సెల్ఫ్ అసెస్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్ణీత ఫీజులు చెల్లించి పీటీఐఎన్‌లు పొందారు. అన్‌రిజిస్టర్డ్ నోటరీ దస్తావేజులతో పాటు ఏ పత్రాలు పడితే ఆ పత్రాలు అప్‌లోడ్ చేసి పీటీఐఎన్‌లు పొందిన వారున్నారు. అలాంటి వాటిని తొలగిస్తున్నారు. అలాగే.. తప్పుడు పత్రాలు అప్‌లోడ్ చేసిన వారిపై పోలీసు కేసులు నమోదు చేయాల్సిందిగా కమిషనర్ ఆదేశించినప్పటికీ, చాలా సర్కిళ్లలో సంబంధిత అధికారులు అందుకు వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ అసెస్‌మెంట్ల దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నప్పటికీ, అక్రమాలకు తావు లేకుండా పరిశీలన జరుపుతున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. అవసరమైన పత్రాలన్నీ సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్నాకే డిప్యూటీ కమిషనర్లు పీటీఐఎన్‌లు జారీ చేస్తున్నారని చెబుతున్నారు.





'సీపీఆర్'.. ఆపద పరార్!

సడెన్ కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)తో ఎలా రక్షించవచ్చో ప్రాక్టికల్‌గా వివరిస్తున్న చిత్రాలు ఇవి. బుధవారం తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లోని జీవీకే- ఈఎంఆర్ఐ సెంటర్‌లో సీపీఆర్ శిక్షణ ప్రారంభోత్సవం సందర్భంగా సీపీఆర్ చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి తదితరులు.

సునీల్ కోసం స్పెషల్ టీమ్

- నకిలీ సర్టిఫికెట్ల కేసులో సూత్రధారి ఇతడే
- పట్టుబడితేనే వర్సిటీ ఉద్యోగుల గుట్టు వీడేది
- ఢిల్లీలో గాలించాలని నిర్ణయించిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: వాట్సాప్ ద్వారా వచ్చిన వివరాల ఆధారంగా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి పంపిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సూత్రధారి సునీల్ కపూర్ కోసం ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. ఈ ముఠాకు చెందిన ఏడుగురిని దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, 600 నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఢిల్లీకి చెందిన సునీల్ విద్యా సంస్థలకు కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తూ ఈ దందాలోకి దిగాడు. వీళ్లు ప్రధానంగా అమెరికా, లండన్‌లను స్టడీ వీసా దరఖాస్తు చేసుకునే విద్యార్థులనే టార్గెట్‌గా చేసుకుని ఈ దందా చేశారు. వీసా జారీ సమయంలో కొన్ని ఎంబసీలు ఆయా యూనివర్సిటీలకు ఈ-మెయిల్ పంపడం ద్వారా దాఖలు చేసిన అభ్యర్థి సర్టిఫికెట్ల పూర్వాపరాలు సరి చూసుకున్నారు. ఇలా వచ్చే మెయిల్స్‌కు స్పందించడానికి, అవి నిజమైనవే అంటూ జవాబు ఇవ్వడానికి ఆయా వర్సిటీల్లో కొందరినీ సునీల్ కపూర్ ఏర్పాటు చేసుకున్నట్లు అరెస్టు అయిన నిందితుల ద్వారా పోలీసులు గుర్తించారు. వీళ్లు ఎవరన్నది తెలియాలంటే సునీల్ కపూర్ చిక్కడమే మార్గం కావడంతో అతడి కోసం వేట ముమ్మరం చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు 2019 మార్చి 21న ఓ నకిలీ సర్టిఫికెట్ల కేసును ఛేదించారు. మహ్మద్ హబీబ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, ఇతడి నుంచి 16 నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీలతో కూడిన వీటిని ఇతడికి సునీల్ కపూర్ అనే వ్యక్తి ఇచ్చినట్లు తేలింది. ఆ కేసులో నిందితుడు, ఈ కేసులో నిందితుడుగా ఉన్న సునీల్ కపూర్ ఒకరేనా అనే కోణంలోనే అధికారులు ఆరా తీస్తున్నారు. మరోపక్క ఈ ముఠా నుంచి సర్టిఫికెట్లు ఖరీదు చేసి, విదేశాలకు వెళ్లిన 30 మంది వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏడుగురు నిందితులను కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారించడం ద్వారా కీలక వివరాలు రాబట్టాలని పోలీసులు నిర్ణయించారు. దీనికి అనుమతి కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

సైదాబాద్: సెల్‌ఫోన్ వాడొద్దని తల్లి మందలించినందుకు మనస్తాపం చెందిన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలో ఫారెస్ట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పోతురాజు సైదాబాద్ ఎస్‌బీఐ కాలనీలోని శుభోదయం శ్రీనివాస అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్నాడు. ఆయన భార్య సంగీత స్థానిక భోజిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. వారి కుమారుడు ధృవ కాపర్తి (16) దిల్‌సుఖ్‌నగర్‌లోని చైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల అతను సెల్‌ఫోన్‌ను ఎక్కువగా వాడుతున్నాడు. మంగళవారం రాత్రి 12 గంటల సమయంలోనూ సెల్‌ఫోన్ వాడుతుండటం గమనించిన తల్లి వద్దని వారించి ఫోన్‌ను తీసేసుకుంది. దాంతో మనస్తాపం చెందిన ధృవ ఇంటికి బయట నుండి గడియ పెట్టి అపార్ట్‌మెంట్ పైకి ఎక్కి అక్కడి నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు అతడిని వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కోరల్లేని ట్రాఫిక్ పోలీస్!

- చలాన్ల జారీకే పరిమితమైన విభాగం
- ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయ లేమి
- దీంతో యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లు, రోడ్ల ఆక్రమణ
- అయినా చర్యలు తీసుకునే అధికారం లేదు
- జీహెచ్‌ఎంసీకి లేఖ రాయడం వరకే పరిమితం
- ట్రాఫిక్ విభాగానికీ అధికారాలు ఉండాలంటున్న ఉన్నతాధికారులు



సాక్షి, సిటీబ్యూరో: 'నానక్‌రాంగూడ నుంచి ఖాజాగూడ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిని ఆక్రమించి కొందరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇదేంటని ఓ సోఫా వ్యాపారస్తుడిని సైబరాబాద్ పోలీసులు ప్రశ్నించగా.. తాము వీధి వ్యాపారులమంటూ.. జీహెచ్‌ఎంసీ జారీ చేసిన లైసెన్సు చూపించారు. కమర్షియల్ వ్యాపారం కూడా వీధి వ్యాపారుల చట్టం పరిధిలోకి వస్తుందా? అని లైసెన్స్ చూసిన అధికారి అవాక్కయ్యారు. రోడ్డును ఆక్రమించకూడదని ఆదేశించడంతో.. సదరు వ్యాపారి కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో (యథాతథ స్థితి) ఆర్డర్ తెచ్చుకొని.. ఎంచక్కా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు.'

...ఈ సంఘటనలో తప్పెవరిది అనే ప్రస్తావన కాసేపు పక్కన పెడితే..కళ్ల ముందు రోడ్డును ఆక్రమించేసినా చర్యలు తీసుకునే అధికారం ట్రాఫిక్ పోలీసులకు లేకపోవటం గమనార్హం. ఫలితంగా పన్నుల రూపంలో రూ.కోట్లు చెల్లిస్తున్న సామాన్యులు ట్రాఫిక్‌లో నరకయాతన అనుభవించాల్సి వస్తోంది.

చలాన్లు మూడుకు మించితే అరెస్టే..

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు చలాన్లు జారీ చేస్తుంటారు. పదుల సంఖ్యలో పేరుకుపోతున్నా కట్టని వాహనదారులు చాలా మందే ఉన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకునే అధికారం ట్రాఫిక్ పోలీసులకు ఉండాలి. మూడు కంటే ఎక్కువ చలాన్లు పెండింగ్‌లో ఉంటే అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచే అధికారం ట్రాఫిక్ విభాగానికి ఇవ్వాలి. దీంతో వాహనదారులలో భయం, బాధ్యత రెండూ పెరుగుతాయి.

రోడ్డు ఆక్రమిస్తే తొలగింపు..

పాదచారుల కోసం కేటాయించిన కాలిబాటలను, రోడ్లను ఆక్రమించేసి వ్యాపారాలు చేస్తున్నారు. ఆయా ఆక్రమణదారులపై నోటీసులు జారీ చేయాలని కోరుతూ జీహెచ్‌ఎంసీకి లేఖ రాస్తున్నారు. అలా కాకుండా రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు కనిపిస్తే వెంటనే తొలగించే అధికారం ట్రాఫిక్ పోలీసులకు ఉండాలి. జీహెచ్‌ఎంసీ ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసే సమయంలో ట్రాఫిక్ పోలీసుల నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌ఓసీ) ఉంటేనే లైసెన్స్‌లు జారీ చేయాలి.

భవన నిర్మాణాలకు ట్రాఫిక్ ఎన్‌ఓసీ..

ఆకాశహర్మ్యాలు, వాణిజ్య సముదాయాల నిర్మాణ అనుమతుల జారీలో ట్రాఫిక్ విభాగాన్ని జోడించాలి. 45, 60 అడుగుల రహదారులలోని భవనాలకు ట్రాఫిక్ విభాగం ఎన్‌ఓసీ ఉంటేనే నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలి. భవిష్యత్తులో ఆయా ప్రాంతాలలో ఏర్పడే ట్రాఫిక్ రద్దీని అంచనా వేసి, ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే ఒకేసారి వేల సంఖ్యలో వాహనాలు ప్రధాన రహదారి మీదికి వస్తే ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతుంది.

నడి రోడ్ల మీద ప్రార్థనా స్థలాలు..

చాలా మంది వ్యాపారస్తులు, గృహ యజమానులు రోడ్ల విస్తీర్ణంలో తమ భవనాలను తొలగించకుండా ఉండేందుకు తెలివిగా రాత్రికి రాత్రే రోడ్ల మధ్యలో ప్రార్థనా స్థలాలను ఏర్పాటు చేస్తున్నారు. సున్నితమైన అంశాలు కావటం, రాజకీయ అవసరాల నేపథ్యంలో ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తుంది. ఈ తరహా సమస్యలలో క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి, చర్యలు తీసుకునేలా ట్రాఫిక్ పోలీసులకు విచక్షణాధికారులు ఉండాలి.

లేఖలకే పరిమితమైన ట్రాఫిక్..

ఏ వ్యవస్థ అయినా బాగుపడాలంటే క్షేత్ర స్థాయిలో ఉండే అధికారుల చేతిలో అధికారం ఉండాలి. రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, క్రమబద్ధీకరణ చేసే ట్రాఫిక్ పోలీసులకైతే మరీనూ! అయితే ఈ విషయంలో ట్రాఫిక్ విభాగం కేవలం చలాన్ల జారీకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కళ్ల ముందు ఫుట్‌పాత్‌లు, రోడ్ల ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌లు కనిపిస్తున్నా.. చర్యలు తీసుకునే అధికారం ట్రాఫిక్ పోలీసులకు లేదు. జీహెచ్‌ఎంసీ విభాగానికి లేఖ రాయటం వరకే పరిమితమవుతున్నారు. ఆఖరికి రోడ్డు ప్రమాదాలలో నమోదు చేసే ఐపీసీ 304, 337 కేసులలో కూడా ట్రాఫిక్ పోలీసులు విచారించే అధికారం లేకపోవటం గమనార్హం.

పేదల శత్రువు మోదీ

- వంట గ్యాస్ ధర పెంపు దారుణం
- సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు, చిత్రంలో వెంకట్‌రెడ్డి తదితరులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రధాని నరేంద్ర మోదీ పేద ప్రజల అత్యంత దుర్మార్గపు శత్రువని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల విపరీతంగా పెరగటం వల్ల సామాన్య ప్రజలు కొనలేక, తినలేక దుర్భరం జీవితాన్ని గడుపుతున్నా.. అవేవి పట్టించుకోకుండా నియంతృత్వ ధోరణితో పాలన కొనసాగిస్తున్నారని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు మండిపడ్డారు. బుధవారం నగరంలోని హిమాయత్ నగర్ మఖ్దూమ్ భవన్‌లో మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా సీపీఐ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలు భరించలేని జీవన వ్యయంతో సతమతమౌతున్నారని ఆరోపించారు. భయంకరమైన ఆర్థిక సంక్షోభం, అసమానతలు, నిరుద్యోగం వంటివి దేశంలోని సామాన్యుడి ఆర్థిక సామర్థ్యం అట్టడుగు స్థాయికి నెట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను తీర్చడంలో మోదీ పాలనా యంత్రాంగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ ఉదారీకరణ, ప్రైవేటీకరణ , ప్రపంచీకరణ విధానాలు ప్రజలలో తీవ్ర అసమానతలకు దారితీసిందన్నారు. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైందని, దీంతో పేదలు అత్యంత పేదలుగా మారారని, ధనికులు అత్యంత ధనికులయ్యారన్నారు. బీజేపీ తిరోగమన విధానాలు దేశ ప్రయోజనాలకు ప్రమాదకరంగా మారాయని, వీటిని ప్రతిఘటించేందుకు పోరాటాలు తీవ్రతరం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడంలేదని, వీటిపై అధికారులను నిలదీయాలన్నారు. అపరిష్కృత సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు కోసం సీపీఐ శ్రేణులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అయన పిలుపునిచ్చారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్. బాలమల్లేష్, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి డి.జి. సాయిలు గౌడ్, సహాయ కార్యదర్శి దామోదర్ రెడ్డి కార్యవర్గ సభ్యులు ఏసురత్నం, శంకర్ రావు, దశరథ్, టి. శంకర్, ఆర్.కృష్ణ మూర్తి, జె. లక్ష్మి, హరినాథ్ రావు, వెంకట్‌రెడ్డి, ధర్మేంద్ర పాల్గొన్నారు.

సంగీతం, సాహిత్యాలతో మానసికోల్లాసం

బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం



చిప్పాడ నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న వకుళాభరణం తదితరులు

చిక్కడపల్లి: సాహిత్యం, సంగీతం మనిషికి మానసికోల్లాసాన్ని, ప్రశాంతతను ఇస్తాయని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. బుధవారం రాత్రి చిక్కడపల్లి గానసభలో సూర్యోదయ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘంటసాల గాన గౌతమి చిప్పాడ నాగేశ్వర్‌రావు, గీతాంజలిల గానవిభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వకుళాభరణం మాట్లాడుతూ నాగేశ్వర్‌రావు గొంతులో ఘంటసాల పరకాయ ప్రవేశం చేశారని అన్నారు. కళాకారులను ప్రోత్సహించడం, ఆదుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలు ఆపాలంటూ హెచ్చార్సీకి వినతి



హెచ్చార్సీ వద్ద వినతి పత్రాన్ని చూపుతున్న జాజుల లింగంగౌడ్

నాంపల్లి: విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీ చైతన్య విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని, ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ బుధవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్చార్సీ)లో వినతిపత్రం అందచేశారు. కళాశాలల్లో యాజమాన్యం, సిబ్బంది వేధింపుల ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉప్పల్ ఫిర్జాదిగూడలో జరిగిన బాలిక ఆత్మహత్య ఘటన మరువక ముందే నార్సింగ్‌లో మరో ఘటన జరిగిందని వివరించారు. ర్యాంకుల కోసం విద్యార్థులను వేధించడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులను తిట్టడం, కొట్టడంతో పాటుగా సూటిపోటి మాటలతో అవహేళనకు గురిచేయడం జరుగుతోందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత విద్యా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని, విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పూసల సతీష్, హరి, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

దూలపల్లిలో దారుణ హత్య



కుత్బుల్లాపూర్: పేట్ బషీరాబాద్ పరిధిలోని దూలపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. రాత్రి 9 గంటలకు డయల్ 100కు హత్యపై ఫిర్యాదు అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, ఏసీపీ రామలింగరాజు ఇతర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే సుమారు 35 ఏళ్ల వ్యక్తిని నడిరోడ్డుపై నరికి చంపినట్లు గుర్తించారు. దీనిపై గ్రామంలో విచారించారు. ఓ మహిళ, ముగ్గురు వ్యక్తులు స్కూటర్‌పై వచ్చి ఆ వ్యక్తిని కత్తులతో నరికి చంపి పారిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మృతుడ్ని, దుండగులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. క్లూస్ టీం సందర్శించి ఆధారాలను సేకరించింది. డాగ్ స్క్వాడ్, ఎస్‌ఓటీ బృందాలు కూడా దూలపల్లికి వచ్చాయి. సీసీ ఫుటేజీలనూ విశ్లేషిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గోరక్షక్ సభ్యులపై కేసు కొట్టివేత

రాజేంద్రనగర్: భజరంగ్‌దళ్, గోరక్షక్ సభ్యులపై గతంలో పెట్టిన కేసును ఉప్పర్‌పల్లి కోర్టు బుధవారం కొట్టి వేసిందని వారు వెల్లడించారు. ఉప్పర్‌పల్లి కోర్టు వద్ద మొయినాబాద్ మండల గోరక్షక్, భజరంగ్‌దళ్ సభ్యులు మేకల మల్లేష్‌యాదవ్, మహేష్‌చారి, విక్రమ్‌రెడ్డి, సురేష్‌గౌడ్ న్యాయవాదితో కలిసి వివరాలు వెల్లడించారు. 2017లో హిమాయత్‌సాగర్ నుంచి మొయినాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఓ వాహనంలో తరలిస్తున్న ఆవులను అడ్డుకున్నామని, ఈ విషయంలో వాహనం డ్రైవర్ తమపై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు వేశాడని చెప్పారు. ఈ నేపథ్యంలో బుధవారం తమపై ఉన్న కేసును న్యాయమూర్తి కొట్టేసినట్లు వారు తెలిపారు.

వాకింగ్‌కు వచ్చిన యువ నటికి వేధింపులు

యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కులో వాకింగ్‌కు వచ్చిన యువ నటిని ఒక అగంతకుడు వెంబడించి బెంబేలెత్తించాడు. గతంలోనూ ఈ యువ నటికి ఇదే పార్కులో చేదు అనుభవం ఎదురైంది. వివరాల్లోకి వెళితే... కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్స్ సమీపంలో నివసించే యువ నటి ఎప్పటిలాగానే బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కుకి వాకింగ్‌కు వచ్చింది. రెండేళ్ల క్రితం కేబీఆర్ పార్కు ముందున్న జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో యువనటి వాకింగ్‌కు వెళ్లగా ఆమె వెనుక నుంచి వచ్చిన ఒక అగంతకుడు ఆమె సెల్‌ఫోన్ లాక్కోవడమే కాకుండా చీకటిగా ఉన్న ప్రాంతంలో తీసుకెళ్లి ఆమెపై దాడికి యత్నించాడు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనలో నిందితుడిని సైతం పోలీసులు కొద్ది రోజుల తర్వాత అరెస్టు చేశారు. కొద్దిరోజుల తర్వాత భయం నుంచి తేరుకున్న యువ నటి తన భద్రత దృష్ట్యా కేబీఆర్ పార్కు లోపల నడకకు వస్తోంది. బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఆమె వాకింగ్ చేస్తుండగా ఒక అగంతకుడు ఆమెను చాలా దూరం పాటు వెంబడించాడు. అనుమానంతో ఆమె మధ్యలోనే వాకింగ్ నిలపగా అగంతకుడు సైతం నిలిచిపోయాడు. ఇలాగే అయిదారు ప్రాంతాల్లో యువ నటి నిలిచిన ప్రాంతంలోనే అగంతకుడు సైతం నిలిచి ఆమెను బెంబేలెత్తించాడు. దీంతో ఆమె పార్కు వచ్చిన వాకర్లను అప్రమత్తం చేయడంతో వారు పార్కు సిబ్బందికి సమాచారం అందించి అతన్ని పట్టుకున్నారు. అతన్ని పార్కు బయట ఉన్న ఇంటర్ సెప్టార్ పోలీసుల ద్వారా బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వ్యక్తిని శేఖర్‌గా గుర్తించారు.

క్రికెట్ మ్యాచ్ టికెట్ల పేరిట బురిడీ

- రూ.2.62 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాడు
- అరెస్టు చేసిన పోలీసులు



నిందితుడు ప్రవీణ్

సాక్షి, సిటీబ్యూరో: క్రికెట్ మ్యాచ్ టికెట్ అని సోషల్ మీడియా పోస్టు చూసి.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.2.62 లక్షలు పోగొట్టుకున్నాడు ఓ బాధితుడు. చివరకు రాచకొండ సైబర్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు అంతర్రాష్ట్ర నిందితుడు సిరిగిడి ప్రవీణ్‌ను బుధవారం అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జీ నరేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళంకు చెందిన సిరిగిడి ప్రవీణ్, అతని మిత్రులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలయ్యారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో సైబర్ నేరాలు చేయాలని నిర్ణయించుకున్నారు. క్రికెట్ మ్యాచ్ టికెట్లు, బెట్టింగ్‌లు అని సోషల్‌మీడియాలో విపరీతంగా ప్రచారం చేశారు. ఈ క్రమంలో మన్సూరాబాద్‌కు చెందిన బాధిత విద్యార్థి ఓ రోజు విశాఖపట్నంలోని ఇండియా- దక్షిణాఫ్రికా క్రికెట్ మ్యాచ్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని ట్విట్టర్‌లో ఓ పోస్టు చూశాడు. క్రికెట్ అభిమాని అయిన బాధితుడు పోస్టుకు స్పందించాడు. దీంతో నిందితుడు అధికారంలో ఉన్న పార్టీ ఎమ్మెల్యే కొడుకునని పరిచయం చేసుకున్నాడు. వీఐపీ బాక్స్ టికెట్ ఇప్పిస్తానని నమ్మించి.. పలు దఫాలుగా బాధితుడి నుంచి రూ.2.62 లక్షలు నగదు కొట్టేశాడు. ఎంతకీ టికెట్ రాకపోవటంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు.. గతేడాది జూన్‌లో రాచకొండ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్ గౌడ్.లావాదేవీలు జరిపిన బ్యాంకు ఖాతాల వివరాలను సమీకరించి నిందితుడు శ్రీకాకుళానికి చెందిన ప్రవీణ్‌గా గుర్తించారు. సాంకేతిక ఆధారాలను పరిశోధించగా.. నిందితుడు కేరళలోని కొచ్చిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ప్రత్యేక బృందం కేరళకు వెళ్లి ట్రాన్సిట్ రిమాండ్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్లతో పాటు ఐదు బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.8.90 లక్షల నగదును సీజ్ చేశారు. 2018 నుంచి సైబర్ నేరాలకు పాల్పడుతున్న ప్రవీణ్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 13 కేసులు ఉన్నాయి.

టూరిస్ట్‌గా వెళ్లి.. బంగారం స్మగ్లింగ్





నిందితులు అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: టూరిస్ట్‌లాగా విదేశాలకు వెళ్లి అక్రమంగా బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్న ముగ్గురు నిందితులను రాజేంద్రనగర్ జోన్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ), కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.40 లక్షలు విలువ చేసే 700 గ్రాముల బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఓటీ డీసీపీ డాక్టర్ ఎంఏ రషీద్ తెలిపిన వివరాల ప్రకారం...

- ఫలక్‌నుమా ఖాద్రీ చమన్‌కు చెందిన సయ్యద్ మోయిజ్ పాషా వృత్తిరీత్యా ట్రావెల్ ఏజెంట్‌గా పనిచేస్తున్నా.. ప్రవృత్తి మాత్రం బంగారం స్మగ్లింగ్. స్థానికులను పర్యాటక వీసాలతో దుబాయ్ పంపించి, కస్టమ్స్ డ్యూటీ లేకుండా అక్రమంగా స్మగ్లింగ్ బంగారాన్ని దిగుమతి చేస్తుంటాడు. వీటిని స్థానిక గోల్డ్ వ్యాపారస్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటాడు.
- ఈ క్రమంలో ఫిబ్రవరి రెండో వారంలో రాజేంద్రనగర్‌లోని బీకేపురంకు చెందిన సమీర్ ఖాన్‌ను టూరిస్ట్ వీసా మీద దుబాయ్‌కు పంపించాడు. అతను స్మగ్లింగ్ బంగారాన్ని తీసుకొని ఫిబ్రవరి 28న హైదరాబాద్‌కు తిరిగొచ్చాడు. ఈ గోల్డ్ బిస్కెట్లను బుధవారం మైలార్‌దేవ్‌పల్లిలోని వట్టేపల్లిలో విక్రయిస్తుండగా..విశ్వసనీయ సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, కస్టమ్స్ అధికారులు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు.
- కింగ్‌పిన్ మోయిజ్ పాషా గతంలో నాలుగైదు సార్లు ఇదే తరహా బంగారాన్ని దిగుమతి చేసుకొని.. రెయిన్‌బజార్‌లోని మసూద్ జువెల్లర్స్ యజమాని మొహమ్మద్ అర్షద్‌కు విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడించాడు. దీంతో అతన్ని కూడా అరెస్టు చేశారు. నిందితుల నుంచి 13 పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. బంగారాన్ని కస్టమ్స్ అదనపు కమిషనర్‌కు అందజేశారు.

క్లుప్తంగా

పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్, జవహర్‌నగర్, ఫిలింనగర్, వినాయకనగర్, బండారు బాల్‌రెడ్డి నగర్ బస్తీల్లో నూతన సీసీ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ బుధవారం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. చాలా రోజుల పాటు రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్పొరేటర్ వివరించారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ సాధ్యమైనంత త్వరగా పనులను ప్రారంభించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బోరబండలో మహిళలకు ఆటల పోటీలు



మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళలు

రహమత్‌నగర్: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బోరబండ సైట్ 4, 5 మైదానంలో బీఆర్‌ఎస్ డివిజన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. వివిధ బస్తీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఖోఖో, మ్యూజికల్ చైర్, తాడులాగుడు, రన్నింగ్ వంటి పోటీలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు విజయ్‌కుమార్, బాబానాయక్, యూసుఫ్, రాము, డివిజన్ బీఆర్‌ఎస్ మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 9న హైటెక్ హోటల్ వద్ద నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షురాలు శివలెంక ఉదయలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గృహ అవసరాల గ్యాస్‌పై రూ.50 పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపిందన్నారు. పెంచిన ధరతో సిలిండర్ రూ.1150కి చేరిందన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదలపై మోయలేని భారం మోపుతుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో రూ.450 ఉన్న ధరను మూడింతలు పెంచి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. వెంటనే పెంచిన మొత్తాన్ని తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

వీధి కుక్కలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

వెంకటేశ్వరకాలనీ: అంబర్‌పేటలో వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతిచెందిన తర్వాత జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎంటమాలజీ సిబ్బంది బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని గతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీధి కుక్కలు ఎదురుపడినప్పుడు విద్యార్థులు చేయాల్సిన పనులను సూచించారు. అరుస్తున్న కుక్కలను చూసి పరిగెత్తితే అవి మరింత కోపంగా పైకి దూసుకు వస్తాయని, అలాంటి సమయంలో ఏం చేయాలో చెప్పారు. వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు బస్తీల్లో, కాలనీల్లో ప్రమాదకరంగా ఉన్న కుక్కలు తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

26న టీ చాంపియన్‌షిప్ పోటీలు

బంజారాహిల్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హైబిజ్ టీవీ టీ(ఛాయ్) చాంపియన్‌షిప్ 2023 నిర్వహిస్తున్నట్లు హైబిజ్ టీవీ ఎండీ ఎం.రాజగోపాల్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ పోటీలను టీ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆమోదించిందని, ఈ నెల 26న హెచ్ఐసీసీలో ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ప్రథమ స్థానంలో నిలిచిన మహిళకు రూ.1లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, అయిదుగురు రన్నరప్‌లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యంగా..

- కంటి వెలుగుకు పెరుగుతున్న ఆదరణ
- పెద్ద సంఖ్యలో శిబిరాలకు తరలివస్తున్న ప్రజలు
- పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందజేస్తున్న అధికారులు



ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సొసైటీ కార్యదర్శి

బంజారాహిల్స్: అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. డిసెంబర్ 19న ప్రారంభమైన ఈ శిబిరాల్లో ప్రజలు కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 12 చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. మురికివాడలు, బస్తీ వాసులతో పాటు కాలనీవాసులు, అపార్ట్‌మెంట్‌వాసులు సైతం ఈ శిబిరాలకు తరలి వస్తుండడంతో ఇటీవల జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 అధికారులు ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లోనూ కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేశారు. కాలనీవాసులు, ఎఫ్ఎన్‌సీసీ సభ్యులు, ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులు కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. కాలనీవాసులు సైతం పెద్ద సంఖ్యలో వస్తుండడంతో త్వరలోనే కాలనీ సంక్షేమ సంఘాలతో కలిసి ఈ శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. సగటున రోజుకు 900 మందికి నియోజకవర్గం పరిధిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో గత నెల 28వ తేదీ వరకు 19021 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 6607 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 1863 మందిని శస్త్ర చికిత్సల కోసం సిఫార్సు చేశారు. నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు 25 వేల పైచిలుకు మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో 8 వేల మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా, 2236 మందిని శస్త్ర చికిత్సల కోసం సిఫార్సు చేశారు. ఇప్పుడున్న శిబిరాలను సమీపంలోని కాలనీలు, బస్తీల్లోకి మార్చాలని నిర్ణయించారు.

- కంటి వెలుగు శిబిరాల్లో నిపుణులైన ఆప్తమాలజిస్టులు అందుబాటులో ఉండడం, అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలు చేస్తుండడంతో ప్రజలు కంటి వెలుగు కేంద్రాలకు ఆకర్షితులవుతున్నారు. అక్కడికక్కడే కంటి అద్దాలను సైతం అందజేస్తుండడంతో సమీపంలోని ప్రజలంతా ఈ శిబిరాలకు వస్తున్నారు. వచ్చిన గంటలోపే పరీక్షలు నిర్వహిస్తుండడంతో పనులకు వెళ్లే వారికి సైతం పెద్దగా సమయం వృథా కావడం లేదు.

> **ఆదరణ పెరుగుతోంది**
>
> 
>
> కంటి వెలుగు శిబిరాలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. నెల రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరాల్లో కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి అక్కడికక్కడే కళ్లజోళ్లు అందిస్తున్నాం. వారం, పది రోజులకు ఒకసారి శిబిరాలను ఒక చోట నుంచి మరో ప్రాంతానికి మారుస్తూ ప్రజలకు దగ్గరగా ఉండేలా చేస్తున్నాం. రాబోయే 70 రోజుల్లో డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తాం. కొత్తగా శిబిరాలు ప్రారంభించే ప్రాంతాల్లో మా సిబ్బంది స్థానికులకు అవగాహన కలిగిస్తున్నారు.
>
> – రజినీకాంత్‌రెడ్డి, డీఎంసీ, జీహెచ్‌ఎంసీ సర్కిల్–18

జర్నలిస్ట్ యూనియన్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్ తదితరులు

పంజగుట్ట: జర్నలిస్టులు సమాజంలో ప్రతిపక్ష పాత్ర పోషించాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ అన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ 2023 డైరీని ఆయన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కప్పర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రఘునందన్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల చేతిలో ఉన్న పెన్నును సరిగ్గా వినియోగిస్తే అక్రమార్కులకు చెమటలు పడతాయన్నారు. అవకాశం వస్తే జర్నలిస్టుల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో అమ్మ టీవీ చైర్మన్ కంది శ్రీనివాస్‌రెడ్డి, భారత్ టుడే చైర్మన్ గురువారెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, పెద్దాపురం నర్సింహ, పోడిశెట్టి రమేష్, దాసన్న, దశరథ్, బాపూరావు, ఫసియుద్దీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీజిత్‌రాజ్

రహమత్‌నగర్: బీజేపీ నిర్వహించే కార్యక్రమాల్లో యువత ముందుండాలని జిల్లా బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు శ్రీజిత్‌రాజ్(కిట్టు) పార్టీ శ్రేణులకు సూచించారు. రహమత్‌నగర్ పబ్లిక్ స్కూల్ వద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. కార్నర్ మీటింగ్‌లకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, ఎక్కడ మీటింగ్ జరిగినా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు. సీనియర్ నాయకుడు సముద్రాల మల్లేశ్‌గుప్తా, డివిజన్ అధ్యక్షుడు కనకరాజు, రాంధారి బాబా, నాందెడ్ కాశీ, ఆనంద్, నితిష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ సారథ్యంలోనే దేశాభివృద్ధి..

వెంగళరావునగర్: ప్రధాని మోదీ సారథ్యంలోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ యూసుఫ్‌గూడ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని వెంకటగిరిలో మంగళవారం రాత్రి చంద్రమోహన్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

సనత్‌నగర్: పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సదుపాయాలను కల్పిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. 38 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం ఆయన అందజేసి మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందుతున్నాయన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక మంది సరైన వైద్య సేవలను పొందలేకపోతున్నారని, అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ వైద్య సేవలలో పెనుమార్పులు వచ్చాయన్నారు. వివిధ రకాల వైద్య పరీక్షల కోసం కోట్లాది రూపాయల వ్యయంతో అత్యాధునిక వైద్య పరికరాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. రోగుల సహాయకులకు కూడా రూ.5 లకే నాణ్యమైన, రుచికరమైన భోజనం ఆస్పత్రుల ఆవరణలోనే అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, టి.మహేశ్వరిశ్రీహరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ అత్తెలి అరుణగౌడ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న ఏసీపీ శంకర్రాజు

హిమాయత్‌నగర్: ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్రాజు పేర్కొన్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో 'రోడ్డు భద్రత-ట్రాఫిక్ నిబంధనలు' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావి పౌరులుగా ఎదగాల్సిన వారు అర్ధాంతరంగా రోడ్డు ప్రమాదాల్లో తనువు చాలించకూడదనే ఉద్దేశంతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తాము వివరించిన అంశాలను కుటుంబ సభ్యులకు, చుట్టు పక్కల వారికి, బంధువులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ గురించి వీడియో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణగూడ ఎస్ఐ షేక్ షఫీ, ఏఎస్ఐ సుబ్బారావు, బేగంపేట టీటీఐ కానిస్టేబుళ్లు ఎస్.వెంకటప్రసాద్, నర్సింలు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో నిర్వహించిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గత నెల 19వ తేదీన మొదలైన బ్రహ్మోత్సవాలు బుధవారం పుష్పయాగంతో వేడుకగా జరిగాయి. పూజా కార్యక్రమాల్లో భాగంగా శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో అభిషేకించారు. నేత్రపర్వంగా సాగిన ఈ పుష్పయాగం వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీటీడీ ఎల్ఏసీ చైర్మన్ జీవీ.భాస్కర్‌రావుతో పాటు బీజేపీ నేత విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.

'ఈఎస్ఐసీ' ఆవరణలో వైద్య శిబిరం

అమీర్‌పేట: ఈఎస్ఐసీ 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పక్షం రోజుల విశేష సేవా కార్యక్రమాల్లో భాగంగా సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంతో పాటు ఈఎస్ఐ కార్డు లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించారు. ఆప్తాల్మాలజీ, డెర్మటాలజీ, పల్మొనరీ విభాగాలకు సంబంధించి ఐపీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలనకు వచ్చాయి. కెమికల్, సిమెంట్, వుడ్ వర్క్స్ సంబంధిత పని ప్రదేశాల్లో పనిచేస్తూ ఊపిరితిత్తులు, చర్మ సమస్యలతో వచ్చిన ఐపీలకు వైద్య సలహాలు, సూచనలు చేసి మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్ల వంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 35, గోకరకాయ 45, కీర 23, దోస కాయ 35, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 19, చామగడ్డ 70, మొరంగడ్డ 18, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిపై బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.12 ప్రధాన రహదారిలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ టి.నరసింహరాజు, ట్రాఫిక్ ఎస్ఐ రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు కొనసాగాయి. కొన్నేళ్లుగా రోడ్ నెం.12 ఇన్‌కం ట్యాక్స్ క్వార్టర్స్ ప్రహరీ గోడను ఆనుకొని పెద్ద ఎత్తున ఫుట్‌పాత్‌పై బండ్లు ఏర్పాటు చేశారు. దీంతో పాదచారులకు ఆటంకంగా మారింది. ఆరు నెలల నుంచి ట్రాఫిక్ పోలీసులు వారికి అవగాహన కలిగించడంతో పాటు కొంత మందికి జరిమానా విధించారు. మరికొంత మందిపై ఎఫ్ఐఆర్ సైతం నమోదు చేశారు. అయినప్పటికీ ఆక్రమణదారుల్లో మార్పు రాలేదు. దీంతో డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్‌లపై ఉన్న తోపుడు బండ్లు, డబ్బాలు తొలగించారు.

జీపీఎఫ్ అమలు చేయాలని ధర్నా



బంజారాహిల్స్: తమను జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్) కిందకు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ టీఎస్ఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట 110 మంది ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చాలని, పీఆర్‌సీ విడుదల చేయాలని యూనియన్ అధ్యక్షులు వర్ధన్, సంతోష్, మల్లికార్జున్, నారాయణ తదితరులు డిమాండ్ చేశారు. ఏడాది కాలంగా పీఆర్‌సీ పెండింగ్‌లో ఉందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని వారు చెప్పారు.

గ్యాస్ ధర పెంపుపై రేపు బీఆర్‌ఎస్ నిరసనలు

వెంగళరావునగర్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఈ నెల 3వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని యూసుఫ్‌గూడ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో మహిళా నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గౌరీస్ జ్యువెల్లరీ ప్రారంభం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లో గౌరీస్ డిజైనరీ జ్యువెలరీ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో గౌరి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో తమ ఫ్లాగ్‌షిప్ స్టోర్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సాంప్రదాయ సమకాలీన డిజైన్లతో మేళవించిన ఆభరణాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నైపుణ్యం ఉన్న కళాకారులచే ఈ ఆభరణాలు రూపొందించారని, తమ వినియోగదారుల ఆకాంక్షలకు అనుగుణంగా దీనిని ఏర్పాటు చేశామని ఆయన అన్నారు.



పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి



స్వామివారి శాంతి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్‌లో కొలువుదీరిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున ప్రాతః కాల ఆరాధన నిర్వహించారు. నిత్య జప హోమ తర్పణ పారాయణాలు, ప్రాణ ప్రతిష్ఠ హవనాలు, శాంతి హోమాలు, మహాపూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. గర్తపూజ, యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ దృష్టికుంభం, ప్రథమ ఆరాధనలు, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు మోటుపల్లి కిరణ్‌కుమారాచార్యులు, శేషశైలాచార్యులు ఘనంగా నిర్వహించారు. గత నెల 26న ప్రారంభమైన ఈ వేడుకల్లో భక్తులు భారీగా పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయం ఉన్న ప్రాంతానికి శ్రీరామవీధి అని స్థానికులు నామకరణం చేశారు. టెక్ వేవ్ అధినేత గుమ్మడపు వనజాదేవి, దామోదర్‌బాబు దంపతులు ఈ వేడుకలకు సహకారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నూతన పైప్‌లైన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభించిన అధికారులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలో సీవరేజి పైప్‌లైన్ పనులను బుధవారం అధికారులు ప్రారంభించారు. సమస్యను పరిష్కరించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి పలుమార్లు వాటర్ వర్క్స్ ఎండీ దానకిషోర్‌ను కోరగా ఎట్టకేలకు పనులను ప్రారంభించారు. ఖైరతాబాద్ కల్లు కంపౌండ్ నుంచి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వరకు ఈ పనులు చేపట్టనున్నారు. రెండు వారాల్లో పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

'శ్రీ చైతన్య విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలి'

లిబర్టీ: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ మానసికంగా విద్యార్థులను వేధిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థలకు గుర్తింపును రద్దు చేయాలని దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటిక్యాల గణేష్ డిమాండ్ చేశారు. చైతన్య కళాశాలలో ఫీజుల భారం తట్టుకోలేక అనేక మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సాత్విక్ ఆత్మహత్య చేసుకున్న కళాశాల ప్రాంగణాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కళాశాల ప్రిన్సిపాల్, జీఎంలపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో ఇతర విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బీసీ వ్యతిరేక విధానాలను ఉపేక్షించం

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి అన్నారు. కేంద్రం అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక విధానాలను ఇక ఉపేక్షించేది లేదని, 2024 ఎన్నికలే లక్ష్యంగా బీసీలు తిరుగుబాటు చేసి బీజేపీని ఓడిస్తారన్నారు. బుధవారం బీసీ దళ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీల అభివృద్ధి కోసం పథకాలు అమలు చేసేందుకు జనాభా వివరాలు అవసరమన్నారు. రాష్ట్రంలోని బీసీల వివరాలు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు లేఖ రాశారని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామని, వచ్చే ఎన్నికల్లో బీసీలంతా కలిసి ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమన్నారు.

పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తులు

బంజారాహిల్స్: మహీంద్రా యూనివర్సిటీలో 2023–24 విద్యా సంవత్సరం కోసం ఎడ్యుకేషనల్ స్టడీస్‌లో పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మేడూరి వెల్లడించారు. ఫుల్‌టైమ్ రీసెర్చ్ స్కాలర్లకు పీహెచ్‌డీ అసిస్టెంట్‌షిప్స్ అందిస్తుందన్నారు. కోర్సు కాల వ్యవధి మూడు సంవత్సరాలని, దీనిని మరో సంవత్సరం పాటు పొడిగించుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు. స్కూల్ ఎడ్యుకేషన్, ఉన్నత విద్య, సోషియాలజీ, ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ సైకాలజీ, హిస్టరీ ఆఫ్ ఎడ్యుకేషన్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం

రసూల్‌పురా: పేద ప్రజలకు అతి తక్కువ ఖర్చుతోనే మెరుగైన వైద్యం అందించేందుకు ప్రధాని మోదీ చర్యలను చేపట్టారని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ అన్నారు. తిరుమలగిరిలో ప్రధాన మంత్రి భారతీయ జన్ ఔషధి కేంద్ర జెనరిక్ మెడికల్ స్టోర్స్ ఎండీ గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ జన్ ఔషధి దివస్ కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీమ్‌లో భాగంగా జనరిక్ మెడిసిన్ షాపుల ద్వారా అతి తక్కువ ధరల్లో పేదలకు నాణ్యమైన మందులు అందుతున్నాయన్నారు. తొమ్మిది వేల జనరిక్ షాపులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని ఈ నెల ఏడో తేదీ వరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జన్ ఔషధి అగాహన వాహనాన్ని రామకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శంకర్రావు, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలోని హుండీలను లెక్కించగా రూ.43,37,608 ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వాహణ అధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. లెక్కింపులో ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, దేవాదయశాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

దేశ చరిత్రలోనే ప్రథమ స్థానంలో ఏపీ సీఎం జగన్



• ఆర్.కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 62 శాతం పదవులిచ్చి దేశ చరిత్రలోనే ప్రథమ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కొనియాడారు. బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 బీసీలకు కేటాయించి బీసీల ఆత్మబంధువుగా మారారని తెలిపారు. బీసీ ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీలు జగన్‌ని ఆదర్శంగా తీసుకుని తగిన ప్రోత్సాహం కల్పించాలన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేందుకు దేశంలోని ముఖ్యమంత్రులను, అన్ని రాజకీయ పార్టీల అధినేతలను కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలోనే దేశవ్యాప్తంగా పర్యటించనున్నట్లు కృష్ణయ్య తెలిపారు. కేంద్ర విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు పునరంకితమవుదాం

• పిలుపునిచ్చిన మందకృష్ణ మాదిగ



బౌద్ధనగర్: అమరుల త్యాగాల సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధనకు పునరంకితం అవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మాదిగ అమరుల సంస్మరణ దినం సందర్భంగా బుధవారం పార్శీగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో అమరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ అమరుల అమరత్వం వృథా కానివ్వమని తెలిపారు. 29 ఏళ్లుగా సుదీర్ఘంగా కొనసాగుతున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం (ఎమ్మార్పీఎస్) అనేకమంది త్యాగా ల బిడ్డలను తయారు చేసిందన్నారు. ఉద్యమ మొదటి దశలో వర్గీకరణ వ్యతిరేక శక్తుల దాడిలో అమరుడైన మీరాసాహెబ్ మొదలుకొని తెల్ల బండ్ల రవి మాదిగ, పొన్నాల సురేందర దామోదర్ మహేశ్, భారతీ, పెద్దాడ ప్రకాశ్, కొండూరు రాజెల్లయ్య, వీరన్న, యాకన్న లాంటి చాలా మంది నాయకులు వర్గీకరణ ఉద్యమంలో అమరులయ్యారని గుర్తుచేశారు.

వనరులు పుష్కలం.. అవకాశాలు అపారం

▶ మొదటి పేజీ తరువాయి


శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'నేపథ్యంలో బుధవారం ఆయన కొందరు జాతీయ మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

- పెట్టుబడికి ఉన్న అవకాశాలను, పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలను పారిశ్రామికవేత్తలకు వివరించడం ద్వారా ఈ రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడం సదస్సు లక్ష్యం. పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత సానుకూల వాతావరణం రాష్ట్రంలో ఉంది.
- ప్రభుత్వం తొలి నుంచీ స్నేహపూర్వక పారిశ్రామిక విధానంతో ముందుకు వెళుతోంది. ఏ రాష్ట్రంలోనైనా పరిశ్రమలు నెలకొల్పాలంటే ఆ రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు, ప్రోత్సహకాలు ఇవ్వటం సహజం. ప్రభుత్వం నుంచి అందే సహకారం, రాయితీలు, ప్రోత్సహకాలు, రాష్ట్రంలో ఉన్న అనువైన వాతావరణం, వనరులను పారిశ్రామివేత్తలు చూస్తారు. రాష్ట్రంలో ఇవన్నీ ఉన్నాయి. 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీరం పరిశ్రమలకు అనుకూలం.
- రాష్ట్రంలో 48 రకాల ఖనిజాలు లభ్యమవుతాయి. ఇది ఖనిజాధారిత పరిశ్రమలకు ఎంతో అనుకూలం. సిమెంట్, లైమ్‌స్టోన్ పరిశ్రమలు నెలకొల్పడానికి మన వద్ద ఎంతో అనుకూల పరిస్థితులున్నాయి.
- 6 పోర్టులున్నాయి. కొత్తగా 4 పోర్టులు నిర్మిస్తున్నాం. అందులో 3 పోర్టులను ప్రభుత్వమే సొంత నిధులతో నిర్మిస్తోంది. పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. పోర్టు రవాణా కారణంగా రాష్ట్రంలో తయారయ్యే వస్తువుల ఎగుమతికి తక్కువ ఖర్చవుతుంది.
- కర్బన ఉద్గారాలను తగ్గించి పర్యావరణ పరిరక్షణకు మేలు చేసే గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, పంప్డ్ స్టోరేజ్... గ్రీన్ ఎనర్జీదే భవిష్యత్ అంతా. ఈ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో మంచి అవకాశాలున్నాయి. వీటివల్ల చౌకగా విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. రెన్యువబుల్, గ్రీన్ ఎనర్జీకి ఏపీలో పుష్కలమైన వనరులున్నాయి. విండ్, హైడ్రోజన్, సోలార్ విద్యుదుత్పత్తికి ఇక్కడ అపార అవకాశాలున్నాయి. 82 గిగావాట్ రెన్యూవబుల్ ఎనర్జీ కెపాసిటీ, 34 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అవకాశం ఉంది. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుంది.
- పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలు తీసుకుని, వాటి ప్రకారం ప్రో యాక్టివ్‌గా వ్యవహరిస్తున్నాం . అందుకే ఈ రాష్ట్రంవైపు ఎప్పుడూ చూడని అంబానీ, బిర్లా, అదానీ, బంగూర్, బజాంకా, దాల్మియా.. వంటి వారు ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారు. గతంలో ఇంతమంది దిగ్గజ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చింది లేదు.
- 2021-22లో 11.43 శాతం వృద్ధిరేటుతో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. పలురంగాల్లో అగ్రగామిగా నిలుస్తూ... సులభతర వాణిజ్య విధానాల్లో (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వరుసగా మూడేళ్లు నెంబర్ వన్‌గా నిలిచింది.

ఎస్‌డీజీ లక్ష్యాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు

ఉచిత పథకాలు అంటూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అభివృద్ధి చేయకుండా కేవలం సంక్షేమ పథకాలే ఇస్తున్నామనుకుంటే దేశంలోనే అత్యధికంగా 11.43 శాతం వృద్ధిని ఎలా సాధిస్తాం? అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులేస్తున్నాం. ప్రతి పథకాన్నీ ఎస్‌డీజీ లక్ష్యాలకు అనుగుణంగా డీబీటీ రూపంలో నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నాం. ఉదాహరణకు జీఈఆర్ గణాంకాలు చూస్తే కాలేజీల్లో చేరే వారి సంఖ్య రాష్ట్రంలో ఎక్కువ. 18 నుంచి 23 ఏళ్ల వయస్సులో ఉన్నవారు చదువు మానకుండా కాలేజీలో చేరేలా పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థి డిగ్రీ పూర్తి చేస్తే అతని హోదా మారుతుంది. అందుకే తల్లిదండ్రులకు విద్య భారం కాకుండా ఉండేలా 100 శాతం ఫీజు రీఇంబర్స్‌మెంట్ ఇస్తూ విద్యాదీవెన, వసతిదీవెన, ప్రాథమిక విద్యలో అమ్మఒడి వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఈ మొత్తం నేరుగా కళాశాలలకు ఇవ్వకుండా తల్లుల ఖాతాల్లో వేస్తున్నాం. దీనివల్ల ఆ విద్యార్థి చదువు మధ్యలో ఆగదు. పట్టభద్రుడై ఆదాయాన్ని ఆర్జించడం ద్వారా పేదరికం నుంచి మధ్యతరగతి హోదాలోకి ఆ కుటుంబం మారుతుంది. దేశాభివృద్ధిలో ఇది ఎంతో కీలకమైన అంశం.

బడ్జెట్ పరిమితుల్లోనే... పారదర్శకంగా...



ఈ పథకాలన్నీ కూడా బడ్జెట్ పరిమితుల్లోనే అమలు చేస్తున్నాం. సాధారణంగా రాజకీయ నేతలు సామాన్యులకు అర్థం కాని రీతిలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. గతంలో కూడా ఇదే బడ్జెట్ ఉండేది. ఆ నిధులు ఎక్కడికి వెళ్తాయో ఎవరికీ అర్థమయ్యేది కాదు. లబ్ధిదారులెవరో ఆ దేవుడికే తెలియాలి అనే పరిస్థితి ఉండేది. కానీ రాష్ట్రంలో తొలిసారిగా మేము అందరికీ సరళంగా అర్థమయ్యేలా పారదర్శకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. ప్రతి పథకాన్నీ బడ్జెట్‌లో కచ్చితంగా నిర్దేశించాం. ప్రతి పథకాన్ని లబ్ధిదారుల ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాలతో అనుసంధానించాం. నేరుగా నగదు బదిలీ విధానంలో పథకాన్ని అమలు చేస్తున్నాం.

- ఏ రాష్ట్రానికైనా కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. అందుకే కేంద్రంలోని బీజేపీతో మేము స్నేహపూర్వక వాతావరణమే కోరుకుంటున్నాం. మాకు రాజకీయాల కంటే మా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. ప్రజలకు ఏం కావాలో అది చేయాలనేది మా ప్రభుత్వ విధానం. అందుకే మా ప్రభుత్వం రియాలిటీలో పేదలకు ఏం కావాలో అదే చేస్తోంది. అందుకే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో వేగంగా ముందుకెళ్తున్నాం.

3 రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు

ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా గత ప్రభుత్వ తప్పులను కొన్నింటిని సరిచేస్తుంది, కొన్ని కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తుంది. మేం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, వ్యవసాయం.. ఈ రంగాల్లో పూర్తి స్థాయిలో విప్లవాత్మక చర్యలు చేపట్టాం. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 'నాడు–నేడు' పేరిట ప్రభుత్వాసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నాం. ప్రాథమిక విద్యా రంగంలో 'అమ్మ ఒడి' పథకం ఓ విప్లవం. మేము అధికారంలోకి వచ్చేనాటికి ప్రాథమిక విద్య ప్రమాణాల్లో ఆంధ్ర ప్రదేశ్ దేశంలో చివరి రెండు, మూడు స్థానాల్లో ఉండేది. ఈ పరిస్థితి మార్చాలనుకున్నాం. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు మేం అమలు చేస్తున్న పథకాలు చెబుతా. అమ్మ ఒడి పథకం కింద పిల్లల్ని బడికి పంపే తల్లుల ఖాతాలో రూ.15వేలు వేస్తున్నాం. దీనికి కనీసం 75 శాతం హాజరు ఉండాలనే నిబంధన పెట్టాం. ఇంటర్మీడియట్ వరకు అమ్మ ఒడి పథకం ఇస్తున్నాం. తరవాత జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు అందిస్తున్నాం. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుండటంతో పిల్లల చదువు ఎందుకు ఆపాలని తల్లిదండ్రులు భావిస్తారు కదా?. ఇక ఏటా స్కూళ్లు తెరవటానికి ముందే జగనన్న విద్యా కానుక పేరిట సమగ్ర కిట్‌ను ఇస్తున్నాం. తెలుగు, ఇంగ్లీష్ బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, స్కూల్ బ్యాగ్, షూ, సాక్సులు, యూనిఫామ్ ఇస్తూ యూనిఫామ్‌కు కుట్టేందుకు మజూరీ చార్జీలూ ఇస్తున్నాం. దీనికి ఏటా రూ.వేయి కోట్లకు పైగా నిధులు వెచ్చిస్తున్నాం. ఇక మధ్యాహ్న భోజన పథకాన్ని పూర్తిగా మార్చాం. టీడీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకానికి రూ.600 కోట్ల బడ్జెట్ ఉండేది. దాన్ని రూ.1,908కోట్లకు పెంచాం. జగనన్న గోరుముద్ద పేరుతో భోజనం నాణ్యత పెంచాం. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టాం. ఆరో తరగతి నుంచి డిజిటల్ తరగతులు ఏర్పాటు చేస్తున్నాం. నాడు–నేడు మొదటి దశ కింద 15,275 పాఠశాలలను ఎంపిక చేసి వాటి రూపు రేఖలను సమూలంగా మార్చాం. రాష్ట్రంలో 30,230 తరగతుల డిజిటలైజేషన్‌ను ఈ జూన్ నాటికి పూర్తి చేస్తున్నాం. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. ఇప్పటివరకు 60వేల మంది ఉపాధ్యాయులకు, 4.70 లక్షల మంది విద్యార్థులకు మొత్తం 5.30 లక్షల ట్యాబ్‌లు పంపిణీ చేశాం.

అంతేకాదు! అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు పెంచాం. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడాదికి రూ.800కోట్లు కేటాయించేవారు. దీన్ని రూ.1,800 కోట్లకు పెంచాం. జగనన్న సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ్ ప్లస్ పేరిట అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార నాణ్యతను మెరుగుపరిచాం. ఎందుకంటే ఆరేళ్ల వరకే పిల్లలు శారీరకంగా, మానసికంగా వేగంగా ఎదుగుతారు. ఆ సమయంలో వారికి సరైన పోషకాహారం అందించాలి. అదే చేస్తున్నాం. ఆడపిల్లల పెళ్లికి సహకరిస్తూ... వారు చదువు కొనసాగించేలా నిబంధనలు పెట్టాం. 10వ తరగతి పాస్ అవ్వాలని, 18 ఏళ్లు నిండాలని నిబంధన పెట్టడం వల్ల వారు పది తరవాత ఇంటర్ చదువుతారు. డిగ్రీలోనూ చేరతారు. చేరారు కనక పూర్తి చేస్తారు. ఈ ఉద్దేశంతోనే వివాహానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నాం.

- ➤ చదువుల్లో రాణిస్తూ విదేశాల్లో చదువుకోవాలనుకునే వారికి 'విదేశీ దీవెన' పథకాన్ని అందిస్తున్నాం. నిర్దేశిత 21 ఫ్యాకల్టీల్లో ప్రపంచంలోని టాప్–50 యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించే మన విద్యార్థులకు గరిష్ఠంగా రూ.1.25 కోట్ల వరకూ ఫీజును చెల్లిస్తున్నాం. గత ఏడాది 200మందికి స్పాన్సర్‌షిప్ అందించాం. ఇలాంటి వర్సిటీల్లో చదివిన వాళ్లంతా వచ్చే పదేళ్లలో అత్యున్నత స్థాయికి చేరుకుని, మన రాష్ట్రానికి ఆస్తిగా మారతారన్న విశ్వాసం నాకుంది.
- ➤ ప్రభుత్వాసుపత్రులకు కాయకల్ప చికిత్స చేస్తున్నాం. ఎవ్వరూ ఊహించని విధంగా వైద్య రంగంలో ఖాళీగా ఉన్న 48,000 పోస్టులను భర్తీ చేశాం. ప్రతి హాస్పిటల్‌లో డాక్టర్, నర్సులు ఉండేలా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాం. జాతీయస్థాయి ప్రమాణాలు ఉండేలా హాస్పిటల్స్‌ను ఆధునీకరించాం. 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నాం. ఆరోగ్య శ్రీ పరిధిలోకి వచ్చే చికిత్సల సంఖ్యను 1,059 నుంచి ఏకంగా 3,255కు పెంచాం. ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్, హెల్త్‌కార్డుల డిజిటలైజేషన్ ఇలా అనేక సంస్కరణలు తెచ్చాం.
- ➤ వ్యవసాయ రంగానికి వస్తే... రైతు భరోసా కేంద్రంపేరిట రైతులకు సంబంధించిన సేవలన్నీ ఒకేచోట అందిస్తున్నాం. ప్రతి గ్రామానికీ వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ పొందిన అధికారిని నియమించడమే కాకుండా ప్రతి రైతు తాలూకు పంట వివరాలను 'ఈ క్రాప్'లో నమోదు చేస్తున్నాం. రైతులకు విత్తనం దగ్గర నుంచి పంట అమ్ముకోవడం వరకూ ఆర్‌బీకే ద్వారా చేయూత అందిస్తున్నాం. పాలన సంస్కరణల్లో భాగంగా.... ప్రతి 2000 జనాభాకు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి 50 మంది జనాభాకూ ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేశాం. ఎటువంటి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. దేశంలో డీబీటీ ద్వారా నేరుగా నగదు అందుకుంటున్న లబ్ధిదారులు రాష్ట్రంలోనే అధికం. మాకు ఓటు వేశారా లేదా, ఏ పార్టీ అనేది చూడకుండా పథకాలు అందిస్తున్నాం.

నగర వార్తలు

ప్రొస్టేట్ సమస్యకు అధునాతన చికిత్స

బంజారాహిల్స్: ప్రొస్టేట్ సమస్యతో బాధపడుతున్న వారికి ఆపరేషన్ అవసరం లేకుండా యూరోలిఫ్ట్ అనే ఆధునిక సాంకేతిక చికిత్సను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ వంశీకృష్ణ వెల్లడించారు. ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో మొదటిసారిగా బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రిలో ఈ చికిత్సను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ ప్రక్రియ సంప్రదాయ శస్త్ర చికిత్సలా కాకుండా యూరోలిఫ్ట్ లోకల్, అనస్తీషియా కింద నిర్వహిస్తారన్నారు. ఇందుకు ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం లేదని తక్కువ నొప్పిని కలిగి ఉంటుందన్నారు.

వినోద్‌కుమార్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఉస్మానియా యూనివర్సిటీ: విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక ఉద్యోగాల భర్తీ పై రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ ఓయూలో చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్‌గౌడ్ విమర్శించారు. బుధవారం ఓయూలో దయాకర్‌గౌడ్ మాట్లాడుతూ రెండుసార్లు అధికారం చేపట్టి 9 సంవత్సరాలుగా వర్సిటీల్లో ఒక్క పోస్టును కూడా భర్తీ చేయలేదని వయోభారతంతో డాక్టరేట్ నిరుద్యోగులు నిరాశతో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గతంలో అనుమతించిన 1062 ఉద్యోగాలను భర్తీ చేయకుండా కాలయాపన చేసి చివరి దశలో మరో వేయి పోస్టులు అదనమని వినోద్‌కుమార్ ప్రకటించడం సిగ్గుచేటు అని దయాకర్‌గౌడ్ పేర్కొన్నారు.

ఐవీఎఫ్ రాష్ట్ర పొలిటికల్ కమిటీ చైర్మన్‌గా ఆదిత్య గుప్తా

నాగోలు: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ స్టేట్ పొలిటికల్ కమిటీ చైర్మన్‌గా మాశెట్టి ఆదిత్య గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళి గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆయనకు అందజేశారు. బుధవారం నాగోలులో శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... ఆర్యవైశ్యులు రాజకీయాల్లోనూ రాణించాలన్నారు. ఐవీఎఫ్ స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లలు దాటిన ఖ్యాతి

- అంతర్జాతీయ అవార్డులను అందుకున్న తెలుగు ప్రొఫెసర్
- జేఎన్‌టీయూలో ప్రొఫెసర్‌గా కొనసాగుతున్న డా.ప్రకాశ్ కింతాడ
- అమెరికా, లండన్ యూనివర్సిటీల నుంచి ప్రతిష్టాత్మక అవార్డులు



డా.ప్రకాశ్ సత్కారం అందుకుంటూ...

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీలో కెమికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డా.ప్రకాశ్ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డులను అందుకుంటున్నారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో ఆయన చేసిన విశిష్ట పరిశోధనా సేవలు అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించాయి. పరిశోధనా రగంలో తను చేసిన విశిష్ట సేవలకుగాను ఇటీవల లండన్‌లోని రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (ఎఫ్ఆర్ఎస్‌సీ) అవార్డ్‌ను అందుకున్నారు.

- ◆ అమెరికా వేదికగా చికాగోలోని ఇంటర్నేషనల్ అమెరికన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ రీసెర్చ్ అవార్డు, విశ్వవ్యాప్త విశిష్ట ప్రొఫెసర్ అవార్డును అందుకున్నారు.
- ◆ ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ బయోగ్రాఫికల్ సెంటర్ 21వ శతాబ్దపు అత్యుత్తమ మేధావుల జాబితాలో చేర్చడంతో పాటు ఈ సంస్థకు డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా నియమించింది.
- ◆ 2011 సంవత్సరంలో బయోగ్రాఫికల్ సెంటర్ ఆధ్వర్యంలోనే అత్యుత్తమ వంద మంది పరిశోధకుల్లో ఒకరిగా స్మారక అవార్డును ప్రదానం చేశారు.
- ◆ అంతేకాకుండా ప్రొ.ప్రకాశ్ డిక్షనరీ ఆఫ్ ఇంటర్నేషనల్ బయోగ్రఫీ సియాట్ ఆఫ్ డిప్లొమాస్, డిక్షనరీ ఆఫ్ ఇంటర్నేషనల్ బయోగ్రఫీ, మెడల్ ఆఫ్ ఇన్‌క్లూజన్, మెరిటోరియస్ అచీవ్‌మెంట్స్ సిటేషన్, పిక్టోరియల్ టెస్టిమోనియల్ ఆఫ్ అచీవ్‌మెంట్ అవార్డులను అందుకున్నారు.
- ◆ నార్త్‌కరోలినాలోని అమెరికన్ బయోగ్రాఫికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి 'గోల్డ్‌మెడల్ ఆఫ్ ఇండియా' అవార్డును సైతం సొంతం చేసుకున్నారు. ఈ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రొ.ప్రకాశ్ 'రీసెర్చ్ బోర్డ్ ఆఫ్ అడ్వైజర్స్ మెంబర్'గా ఉన్నారు. వీటితో పాటు భారత జ్యోతి అవార్డు, లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, అబ్దుల్ కలాం అవార్డులను అందుకున్నారు.

దేశ విదేశాల్లో తెలుగు తేజం

అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకున్న ప్రొ.ప్రకాశ్ మొదట్లో జైపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) యూనివర్సిటీలో కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఇంకా పలు వర్సిటీల్లో పనిచేశారు. ఇందులో భాగంగా 33 అంతర్జాతీయ ప్రచురణలు, 31 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రెజెంటేషన్‌లను ప్రచురించారు. బంగారం, ప్లాటినం, పల్లాడియం, రుథేనియం మెటల్ కాంప్లెక్స్‌ల సింథసిస్‌లో విస్తృతమైన అనుభవమున్న ప్రొ.ప్రకాశ్ తన పరిశోధనలతో దేశానికి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నానని 'సాక్షి'కి తెలిపారు.

రాజమండ్రి, విజయవాడలో బీసీ బహిరంగ సభలు



రాకేష్‌నాయుడుకు నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న రాజమండ్రిలో, ఏప్రిల్ మొదటి వారంలో విజయవాడలో బీసీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు రాజ్యాంగ పరంగా రావాల్సిన హక్కుల సాధన కోసం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడడం తప్ప వారి డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాజమండ్రి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా రాకేష్‌నాయుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా ఆశోక్‌లకు నియామకపత్రాలు అందజేశారు.

ఆరుగురిపై వీధి కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి

కుత్బుల్లాపూర్ : కొంపల్లి మున్సిపాలిటీలో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఏకంగా ఆరుగురిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బుధవారం కొంపల్లి మున్సిపల్ పరిధిలో ఆరు ఘటనలు చోటు చేసుకోవడంతో స్థానికంగా కలకలం రేపుతోంది. సాయంత్రం ఒక్కసారిగా గుంపుగా వచ్చిన కుక్కలు స్థానికులను పరిగెత్తించాయి.. కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో సమీపంలో శివానీ (16) చేతిపై, క్రాంతి (10) భుజం మీద, అశ్విన్ కాలనీలో బాపురావు (50) చెయ్యి మీద, ఏఎంఆర్ రెసిడెన్సీ పార్కింగ్ వద్ద మీనాక్షి (20)తో పాటు మరో ఇద్దరిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా ఇటీవలే ఎన్‌సీఎల్‌లో 42 మందిపై వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో కాలనీకి చెందిన చిన్నారులు, పెద్దలు ప్లకార్డులు చేతబూని వీధి కుక్కల బారి నుండి కాపాడాలంటూ ప్రదర్శన నిర్వహించారు. అంతేకాక మంత్రి కేటీఆర్‌కు సైతం ట్వీట్ చేశారు.

తాను మరణిస్తూ అవయవదానం



లక్ష్మమ్మ(ఫైల్)

రాయదుర్గం: ఓ వృద్ధురాలు మరణిస్తూ కళ్లు, కాలేయం దానం చేసి ఆదర్శంగా నిలిచింది. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రి వర్గాలు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొయినాబాద్ మండలం అప్పారెడ్డి గూడేనికి చెందిన ఎటికెపల్లి లక్ష్మమ్మ (60) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు కాంటినెంటల్ ఆస్పత్రిలో ఈనెల 27న చేర్పించారు. అయితే 28వ తేదీన రాత్రి 7.40 గంటలకు బ్రెయిన్ డెడ్ అయినట్లు డాక్టర్లు ప్రకటించారు. దీంతో కుమారుడు చంద్రశేఖర్ తన తల్లి అవయవాలను దానం చేయాలని నిర్ణయించినట్లు డాక్టర్లకు తెలిపాడు. దీంతో వైద్యులు ఆమె కళ్లు, కాలేయాన్ని అవసరమైన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ పద్ధతిలో అమర్చారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్ వీరంగం

ప్రయాణికుడి ఫిర్యాదుతో రిమాండ్



శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో ఓ కానిస్టేబుల్ పీకల దాకా మద్యంతాగి రోడ్డుపై వీరంగం సృష్టించాడు. పోలీసులు,స్థానికులు తెలిపిన మేరకు..ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రాజమల్లయ్య (35) మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో కొత్వాల్‌గూడ ఔటర్‌రింగ్ రోడ్డు సర్వీసు రోడ్డులో తన కారును రోడ్డుకు అడ్డంగా పెట్టాడు. ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ఆపి డబ్బు వసూలుకు కూడా పాల్పడ్డాడని పేర్కొన్నారు. గచ్చిబౌలి నుంచి వస్తున్న అశ్విన్‌రెడ్డి దంపతులను కారు ఆపి అసభ్యకరంగా మాట్లాడడంతో వారు 100 ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి అతడిని రిమాండ్‌కు తరలించారు.

100 రోజులకు చేరిన నిమ్స్ ఉద్యోగుల నిరసన



లక్డీకాపూల్ : తమకు న్యాయం చేయాలని కోరుతూ నిమ్స్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం వంద రోజులు పూర్తి చేసుకుంది. తమను జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్) కిందకు తీసుకురావాలని డిమాండ్ వంద రోజులుగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా చేస్తున్నారు. పెన్షన్ సదుపాయాన్ని ఈపీఎఫ్ నుంచి నిమ్స్‌కు మార్చాలని డిమాండ్ డిమాండ్ చేశారు. గతంలో నిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది 32 మంది, డాక్టర్లు 12 మందికి కల్పించిన విధంగానే తమకు కూడా నిమ్స్ పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా పెన్షన్ బాధితుల ప్రతినిధులు, శాంతి కుమారి, మధు కుమార్ తదితరులు మాట్లాడారు.

మహిళాభ్యుదయం కోసమే '4 ఈ సెంటర్'

బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గీతామూర్తి

నాగోలు: మహిళల అభ్యున్నతి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని, మహిళాసాధికరతకు ప్రధాని నరేంద్రమోడీ నిరంతరం కృషి చేస్తున్నారని బీజేపీ జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు, తమిళనాడు ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ అన్నారు. బుధవారం రాత్రి నాగోలు డివిజన్ బండ్లగూడ ఆనంద్‌నగర్‌లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ మహిళా మోర్చా పాలసీ, రీసెర్చ్ ఇంచార్జి కాలంశెట్టి లయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన (చదువు, ఉపాధి, వ్యవస్థాపకత, సాధికారత) 4 ఈ సెంటర్‌ను వనతి శ్రీనివాసన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలను చదువు, ఉపాధి రంగాలలో ప్రోత్సహించాలని సూచించారు. వ్యవస్థాపకత, సాధికరత కోసం 4 ఈ సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. అన్ని రంగాల్లో రాణించేలా మహిళలను ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నిరంతరం ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సుకన్య సమృద్ధి పథకం, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలపై అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. మహిళల అభ్యదయ కోసం తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా 4 సెంటర్ నాగోలులో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, రాష్ట్ర ఇంచార్జి నళిని, రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కృష్ణవేణి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ విభాగం అధ్యక్షుడు సామ రంగారెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, నేతలు శ్యామల, గజం రాజ్యలక్ష్మి, బద్దం బాలకృష్ణగౌడ్, దప్పురాజు పాల్గొన్నారు.

■ సైబర్‌టాక్

ఫోన్ హ్యాక్ అయ్యిందా?!



ప్రతీకాత్మక చిత్రం

తెలుసుకోవడం ఎలా..?
● ఫోన్ చాలా స్లో అవుతుంది. ఫోన్ త్వరగా వేడెక్కుతుంది. ● డేటా వినియోగం బాగా పెరుగుతుంది. ● యూ ట్యూబ్ లేదా ఆన్‌లైన్ వీడియోలు బఫర్ అవ్వవు. ● వెబ్ పేజీలు లోడ్ అవడానికి టైమ్ పడుతుంది. ● ప్రోగ్రామ్స్, యాప్స్ క్రాష్ అవుతాయి. ● గాడ్జెట్ సడెన్‌గా రీస్టార్ట్ అవుతుంది. ● విచిత్రమైన, ఊహించని మెసేజీలు వస్తుంటాయి.

ఎలా చెక్ చేయాలి?
● ఆండ్రాయిడ్ ఫోన్ అయితే సెట్టింగ్స్– యాప్స్, నోటిఫికేషన్స్– కెమెరా/ మైక్రోఫోన్ (ఏదైనా తెలియని యాప్‌కి యాక్సెస్ ఉందో లేదో తనిఖీ చేయండి) ● యాపిల్ ఫోన్ అయితే సెట్టింగ్స్– ప్రైవసీ–కెమెరా/మైక్రోఫోన్ (ఏదైనా తెలియని యాప్‌కి యాక్సెస్ ఉందో లేదో చెక్ చేయాలి)

సైబర్ టాక్

గీతిక (పేరుమార్చడమైనది) డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. ఈ మధ్య తన క్లాస్‌మేట్ (నందు) చేసే మెసేజీలు ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. తను ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా అందుకు సంబంధించిన సమాచారాన్ని తిరిగి తనకే పోస్ట్ చేస్తున్నాడు. ఎవరికైనా చెబుదామంటే ఎవరూ నమ్మరు. పైగా తననే నిందిస్తారు. తను ఊళ్లో లేకపోయినా తనకు సంబంధించిన ప్రతి విషయాన్నీ తిరిగి తనకే పంపిస్తున్నాడు. ఏమైనా అంటే, నాకు అన్నీ తెలుసు.. అన్నట్టు ప్రవర్తిస్తున్నాడు. ఇది ఇబ్బందికరంగా ఉండటమే కాదు భయంగానూ ఉంటోంది.

గీతిక లాగే చాలా మంది ఇబ్బందులకు లోనయ్యే సమస్య ఇది. తమ ఫోన్ హ్యాక్ అయిందనే విషయాన్ని ఏ మాత్రం పసిగట్టలేరు. అంత స్మార్ట్‌గా మన చేతుల్లో ఉండే స్మార్ట్ ఫోనుల్లో దొంగలు దూరుతున్నారు జాగ్రత్త.

స్మార్ట్ ఫోన్‌లలో చాలా మంది చేసే కొన్ని తప్పులు ఏంటంటే..

- మనం ఏం చేస్తున్నామో మిగతా అంతా చూసేలా చేయడం.
- అలెక్సా వంటి టూల్స్ వాటంతట అవే రన్ అయ్యేలా చేయడం
- ఎప్పుడూ యాప్స్ సైన్ ఇన్‌లోనే ఉండటం
- స్మార్ట్ ఫోన్ యాక్సెస్ ఏదైనా ఓకే చేయడం.

వెంటనే తెలుసుకోవాలంటే...

- ఆండ్రాయిడ్ వినియోగదారులు అయితే.. సెట్టింగ్స్– యాప్స్, నోటిఫికేషన్లు (ఏదైనా తెలియని యాప్‌లో స్పై, మానిటర్, ట్రాక్ ట్రోజన్ .. మొదలైన పేర్లు ఉన్నాయేమో చెక్ చేయండి. ఒకవేళ అలాంటివి కనిపిస్తే వెంటనే వాటిని తీసేయండి. ఇది తెలుసుకోవడానికి సెట్టింగ్స్, ప్లేస్ – గూగుల్ ప్లే, ప్రొటెక్షన్ స్కాన్ చేయండి.
- ఐవోఎస్ వినియోగదారులు అయితే.. అన్ని పాస్‌వర్డ్‌లను మార్చాలి. నెట్‌వర్క్ సెట్టింగ్స్‌ను రీసెట్ చేయాలి. ఐఓఎస్ రీసెంట్ వెర్షన్‌ను అప్‌డేట్ చేయాలి.

ఏం చేయాలి?

- మీ ఫోన్ పరిమితులను మీకు మీరుగా నిర్దేశించుకోండి.
- ఐఓఎస్ యాప్స్‌ని వెంటనే అప్‌డేట్ చేయండి.
- ఉపయోగంలో లేనప్పుడు మీ గ్యాడ్జెట్స్‌ను లాక్ చేసి ఉంచండి.
- వైఫై, బ్లూ టూత్ వాడకంలో జాగ్రత్తలు పాటించండి.
- బ్యాంకింగ్, సామాజిక మాధ్యమాల కోసం రెండురకాల ప్రామాణీకరణలను పాటించండి.
- డేటాను తరచూ బ్యాకప్ చేయండి.
- సెక్యూరిటీ యాంటీవైరస్, మాల్వేర్ అప్లికేషన్లను ఉపయోగించండి
- మీరు ఇన్‌స్టాల్ చేసే యాప్స్‌ను ప్లే స్టోర్ నుంచి మాత్రమే ఎంచుకోండి.

స్మార్ట్‌ఫోన్లో స్నూపింగ్‌కి అనుమతించేవి...

- పిల్లలు వాడుతున్న స్మార్ట్ ఫోన్ల ద్వారా వారు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలుసుకోవడానికి ట్రాక్ చేయగల యాప్స్ ఉంటాయి.
- కంపెనీ గ్యాడ్జెట్‌లలో ఇన్‌స్టాల్ చేయబడిన మానిటరింగ్ సాఫ్ట్‌వేర్, వాటిని కంపెనీ ప్రయోజనాల కోసమే ఉపయోగించాలి కాబట్టి ఈ హక్కును రిజర్వ్ చేసుకోవచ్చు.
- ఆర్డర్ డెలివరీని ట్రాక్ చేయడం, డెలివరీని పర్యవేక్షించడానికి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి నిఘా అవసరం కావచ్చు.

కొన్ని రకాల సమస్యలు

- హాని కలిగించే యాప్స్, స్పై వేర్, పబ్లిక్ వైఫై, ఉపయోగించని యాప్స్, ఫిషింగ్, పాస్‌వర్డ్ సెక్యూరిటీ లేనివి .. వంటి వాటి వల్ల సమస్యలు కలగవచ్చు.

ముఖ్యమైన పోర్టల్స్

- మీ ఫోన్ IMEI నెంబర్‌ని https://www.imei.info/ చెక్ చేయండి.
- మీ పేరుపై ఎన్ని ఫోన్ నెంబర్లు ఉన్నాయో చెక్ చేసుకోవడానికి https://tafcop.dgtelecom.gov.in



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,** డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

■ గెలుపు దారి

అంజలి చెప్పిన సమాధానం

పరీక్షల్లో అత్తెసరు మార్కులు వచ్చే అమ్మాయి...

మాస్టర్ ప్రశ్న అడిగితే బిత్తరచూపులు చూసే అమ్మాయి...

క్లాసురూమ్‌లో కూర్చొని పాఠం వినడాన్ని భారంగా భావించే అమ్మాయి 'భవిష్యత్ ఎలా ఉండబోతుంది?' అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం ఎవరికైనా కష్టం కాకపోవచ్చు.

మరి అదే అమ్మాయి చదువుపై శ్రద్ధ చూపితే...

సమాధానం చెప్పడం అంజలి సూద్‌కు మాత్రమే సాధ్యమవుతుంది.

అంజలి సూద్ అమెరికాలోని ఫ్లింట్ నగరం(మిచిగాన్)లో పుట్టింది. తల్లిదండ్రులు పంజాబ్ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. చిన్నప్పుడు పరీక్షలలో అంజలి చాలా పొదుపుగా తెచ్చుకునే మార్కులను చూసి 'ఈ అమ్మాయి హైస్కూల్ దాటి కాలేజీ గడప తొక్కడం కష్టమే' అనుకునే వారు పెద్దలు. క్లాస్‌రూమ్‌లో టీచర్ ఎప్పుడైనా పాఠానికి సంబంధించిన ప్రశ్న ఏదైనా వేస్తే ఆమె జవాబు చెప్పిన సందర్భం అంటూ లేదు.



> ఒక పెద్ద బాధ్యత మనల్ని వెదుక్కుంటూ వచ్చినప్పుడు నేను చేయగలనా? అని భయపడడం కంటే ఎందుకు చేయలేను అని అనుకోవడంలోనే సక్సెస్‌మంత్రా దాగి ఉంది.

● అంజలి సూద్

అలాంటి అమ్మాయి కాస్తా కాలక్రమంలో మారింది, చదువు మీద శ్రద్ధ పెట్టింది. మార్కులు పెంచుకుంటూ పోయింది.

'బాగా చదువుతున్నావు' అనే ప్రశంస ఆమెకు మరింత బలాన్ని ఇచ్చి ఇక వెనక్కి తిరిగి చూసుకునే అవసరం లేకుండా చేసింది.

'వార్టన్ స్కూల్ ఆఫ్ ది యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియా'లో ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్ చదువుకున్న అంజలి హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చేసింది.

చదువు పూర్తయిన తరువాత ఫైనాన్స్, మీడియా, ఇ–కామర్స్‌కు సంబంధించిన సంస్థల్లో పనిచేసింది. అంజలి ప్రతిభ గురించి ఆ నోటా ఈ నోటా విన్న ఆన్‌లైన్ వీడియో మార్కెటింగ్ సంస్థ 'విమియో' తమ సంస్థలోకి ఆహ్వానించింది. 'హెడ్ ఆఫ్ గ్లోబల్ మార్కెటింగ్' 'జనరల్ మేనేజర్' (కోర్ క్రియేటర్ బిజినెస్) హోదాల్లో పనిచేసింది. విమియో బిజినెస్ (మార్కెటింగ్, బ్రాండ్స్‌కు మెంబర్‌షిప్ ప్లాన్)లాంటి ఎన్నో కార్యక్రమాలను లాంచ్ చేసి సక్సెస్ అయింది.

అంజలి సృజనాత్మక ఆలోచనలు, వ్యాపార ఎత్తుగడలు నచ్చి సంస్థ ఆమెను 'సీయీవో' స్థానంలో కూర్చోబెట్టింది. సీయీవోగా కొత్త స్ట్రాటజీతో ముందుకు దూసుకు వెళ్లింది. వీడియో క్రియేటర్స్ కోసం కొత్త సాఫ్ట్‌వేర్‌ను, టూల్స్‌ను ప్రవేశ పెట్టింది.

'మనం చేస్తున్న బిజినెస్ మాత్రమే' అన్నట్లుగా కాకుండా చుట్టుపక్కల ఏం జరుగుతోందో గమనించడం అంజలి అలవాటు. వీడియో ఎడిటింగ్ అండ్ వీడియో మార్కెటింగ్ సంస్థ 'మాజిస్టో'ను కొనుగోలు చేయడం 'విమియో'కు కలిసొచ్చింది.

34 ఏళ్ల వయసులోనే సీయీవోగా బాధ్యతలు చేపట్టి 'విమియో'ను వరల్డ్స్ లార్జెస్ట్ ఆన్‌లైన్ యాడ్–ఫ్రీ వీడియో ప్లాట్‌ఫామ్‌గా ఉన్నతస్థానంలో నిలిపింది అంజలి.

'నేను ఈ స్థాయికి వస్తానని ఎప్పుడూ అనుకోలేదు. చేసిన పనికి గుర్తింపు లభిస్తే చాలు అనుకునేదాన్ని. ఆ గుర్తింపే నన్ను ఇక్కడ వరకు తీసుకువచ్చింది. ఒక పెద్ద బాధ్యత మనల్ని వెదుక్కుంటూ వచ్చినప్పుడు నేను చేయగలనా? అని భయపడడం కంటే ఎందుకు చేయలేను అని అనుకోవడంలోనే సక్సెస్ మంత్ర దాగి ఉంది' అంటుంది అంజలి.

■ సృజన



● శైలజ కేజ్రీవాల్

కలల జిందగీ

'బాంబేకు వెళ్లి ఏంచేస్తావు? బాధతో తిరిగి వస్తావు. అంతకుమించి సాధించేది లేదు' అని నిరాశపరిచారు చుట్టాలు పక్కాలు.

భయపడి ఉంటే... కలల రెక్కలు కత్తిరించి ఉంటే... టీవీ మీడియా, సినిమా రంగంలో తన కంటూ ఒక పేరు తెచ్చుకునేది కాదు శైలజ కేజ్రీవాల్....

శైలజ కేజ్రీవాల్‌కు గేమ్‌లో భాగం కావడం కంటే 'గేమ్ చేంజర్'గా పేరు తెచ్చుకోవడం అంటే ఇష్టం. ఆ ఇష్టమే తనని కోల్‌కత్తా నుంచి ముంబైకి తీసుకువచ్చింది. సాహిత్యంలో డిగ్రీ చేసిన శైలజకు మాస్ సినిమాల నుంచి సమాంతర సినిమాల వరకు అన్ని రకాల సినిమాలు అంటే ఇష్టం.

'కలంటూ కనని కన్నులు ఎందుకు!' అన్నట్లుగా ఉండేది ఆమె ధోరణి.

వినోదరంగంలో పేరు తెచ్చుకోవాలనేది శైలజ కల. ఆ కలల దారిని వెదుక్కుంటూ ఒక ఫైన్ మార్నింగ్ ముంబైలో అడుగు పెట్టింది. స్టూడియోల చుట్టూ తిరగడం కాకుండా ముందు ఉద్యోగం చూసుకుంది. ఒక బడిలో టీచర్‌గా చేరింది. ఆ తరువాత టీవీ రంగంలోకి అడుగు పెట్టింది.

'జిందగీ' (జీ నెట్‌వర్క్ చానల్) శైలజకు ఎంతో పేరు తీసుకువచ్చింది.

రెండు దేశాల మధ్య శత్రుత్వం ఉన్నప్పుడు వార్తల్లో, వ్యాసాల్లో, టీవీల్లో ఆ దేశాలకు సంబంధించిన ప్రముఖులే ఎక్కువ కనిపిస్తుంటారు. మరి సరిహద్దుకు అవతల ఉన్న సామాన్యులు ఎలా ఉంటారు? వారి జీవన విధానం ఎలా ఉంటుంది? వారి ప్రవర్తన ఎలా ఉంటుంది...అనే అంశాల ఆధారంగా 'జిందగీ'కి శ్రీకారం చుట్టింది శైలజ.

'జిందగీ' ప్రారంభానికి ముందు 'ట్రోలింగ్ తప్పదు' అని చాలామంది హెచ్చరించారు.

అయితే విమర్శల కంటే ప్రశంసలే ఎక్కువగా లభించాయి.

'అచ్చం మనలాంటి జీవితాలే వారివి కూడా' అనే మాటలు వినిపించాయి.

రైటింగ్, వాయిస్ వోవర్, ప్రొడక్షన్‌లలో విలువైన అనుభవాలను మూటగట్టుకున్న శైలజకు కాలంతోపాటు నడవడం, కాలానికంటే కాస్త ముందుగా ఆలోచించడం అంటే ఎంత ఇష్టమో, గత వైభవాన్ని వర్తమానంలోకి తీసుకురావడం అంటే కూడా అంతే ఇష్టం.

'మన దేశంలో సినిమా థియేటర్లు కనిపిస్తాయిగానీ నాటకరంగ థియేటర్లు కనిపించవు. నాటకరంగానికి అద్భుతమై చరిత్ర ఉంది. ఆ చరిత్ర గొప్పదనాన్ని వర్తమానంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాను' అంటుంది శైలజ.

> సృజనాత్మక ప్రయాణంలో ఎన్నో అద్భుతమైన రత్నాలు దొరుకుతాయి. వాటిని ఎలా ఉపయోగించుకున్నామనే దానిపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది. రచన నుంచి వాయిస్ వోవర్ వరకు ఎన్నో పనులు చేశాను. అయితే అవి ఒకదానికి ఒకటి సంబంధంలేని భిన్నమైన పనులు కావు. వాటిలో అంతర్లీనత ఉంటుంది. దాన్ని పట్టుకోగలిగితే మనలోని సృజనను మెరుగుపరుచుకోవచ్చు. కొత్త ప్రయోగాలు చేయడానికి ముందు భయం ఎదురొస్తుంది. ఆ భయాన్ని అధిగమించాల్సిన అవసరం ఉంది.

> కాలేజీలో చదువుకున్న సాహిత్యం వృథా పోలేదు. నా వృత్తి జీవితంలో ఎక్కడో ఒకచోట ఉపయోగపడుతూనే ఉంది. రైటర్‌గా ఉన్నప్పుడు కంటెంట్‌పై దృష్టి పెడతాను. ప్రొడ్యూసర్‌గా ఉన్నప్పుడు క్రియేటర్స్‌పై నమ్మకాన్ని పెట్టుకుంటాను.
>
> – శైలజ కేజ్రీవాల్

బ్యూటిప్స్

ఐస్‌క్యూబ్స్‌తో అందం



ఐస్‌క్యూబ్స్‌తో చర్మానికి సరికొత్త అందాన్ని తీసుకురావచ్చు. చర్మం, మెడ మీద ఉండే నొప్పులు తగ్గిపోతాయి. దీంతోపాటు నలుపు మచ్చలు, ముఖం మీద పేరుకున్న మట్టి తొలగిపోతాయి. రక్తప్రసరణ మెరుగవటంతో పాటు చర్మంలోని నూనె శాతాన్ని తగ్గించే ఈ ఐస్ క్యూబ్స్ బ్యూటీ టిప్స్‌ను తెలుసుకుందాం.

● ఒక బౌల్‌లో నీళ్లు తీసుకుని అందులో గుప్పెడు తులసి ఆకుల్ని నలిపి వేయాలి. ఆ తర్వాత రెండు స్పూన్ల అలోవెరా జెల్‌ను వేసి బాగా కలపాలి. ఆ నీటిని ఐస్‌క్యూబ్స్ ట్రేలో వేసి ఫ్రిజ్‌లో ఉంచాలి. ఈ ఐస్‌క్యూబ్స్‌తో చర్మాన్ని రుద్దితే ముఖ చర్మం తాజాగా మెరవడంతోపాటు వేడివల్ల వచ్చిన మచ్చలు తొలగి పోతాయి. ● ఐస్‌క్యూబ్స్ ట్రేలో ఒక కప్పు రోజ్‌వాటర్‌తో పాటు కప్పు మంచి నీళ్లు కలపాలి. దీనిని ఫ్రీజర్‌లో ఉంచాలి. ఆ ఐస్‌క్యూబ్స్‌తో మెల్లగా చర్మంపై రుద్దితే ముడతలు తగ్గిపోతాయి. స్కిన్ ఇన్‌ఫెక్షన్స్ దరి చేరవు. దీంతోపాటు ముఖం ఫ్రెష్‌గా ఉన్నట్లు అనిపిస్తుంది. ● ఒక బౌల్‌లో మెత్తగా దంచిన దోసకాయ ముక్కలను వేయాలి. దీనికి ఐదారు చుక్కల నిమ్మరసం కలపాలి. ఇందులో ఐస్ క్యూబ్స్ వేసి కొన్ని గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచి.. తీసిన తర్వాత వీటితో ముఖంపై రబ్ చేయాలి. దీనివల్ల రక్తప్రసరణ సాఫీగా జరిగి నొప్పులు, మొటిమలు తగ్గిపోతాయి. కమిలినట్లుగా ఉన్న ముఖం తాజాగా మారుతుంది. ● చర్మ సౌందర్యానికి కుంకుమ పువ్వుకి సాటి లేదు. కుంకుమ పువ్వును కొంచెం రోజ్ వాటర్‌లో కలపాలి. ఈ రెండిటినీ బాగా కలిపాక.. ఐస్ క్యూబ్స్ ట్రేలో వేసి క్యూబ్స్ తయారు చేసుకోవాలి. వాటితో ముఖం మీద సున్నితంగా మర్దన చేస్తే పిగ్మెంటేషన్, నల్లటి మచ్చలు, మొటిమలు తగ్గిపోతాయి. ముఖ్యంగా స్కిన్‌టోన్ మారిపోతుంది.

■ సక్సెస్ స్టోరీ

సంకల్పమే సగం బలం

కుటుంబ సమస్యలు
అనారోగ్య సమస్యలు
చెడు అలవాట్లు
మనల్ని ఎప్పుడూ కుదురుగా ఉండనివ్వవు.
వీటికి భయం తోడైతే ఇక చెప్పనే అక్కరలేదు.
అలాంటిది మరణం అంచుల్లో ఉండి కూడా
ఏమాత్రం భయం లేకుండా
సమస్యను ధైర్యంగా ఎదుర్కొని,
తనలాంటి మరికొందరికి
స్వస్థత చేకూర్చే పనిలో సఫలమవుతోంది మరియ.

నియతి వి. మరియ ఉండేది ముంబైలో. గురుగ్రామ్‌లో పుట్టి పెరిగిన మరియ ఇంజినీరింగ్ పూర్తి చేశాక ఉద్యోగం వెతుక్కుంటూ ముంబై వెళ్లింది. ఎయిర్ ఇండియాలో ఉద్యోగం వచ్చింది. మూడేళ్లు ఆ ఉద్యోగంలో కొనసాగింది. అప్పుడే కోలుకోలేని అనారోగ్యం,,, క్యాన్సర్ బారిన పడినట్టు తెలుసుకున్న మరియ మానసికంగా ఓడిపోకూడదని నిర్ణయించుకుంది. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు, తన జీవితాన్ని చక్కదిద్దుకున్న వైనం, పది వేల మందికి పైగా స్వస్థత చేకూర్చిన ఆమె ప్రయాణం గురించి తెలుసుకుంటే ఆ సంకల్ప శక్తి మనలోనూ ప్రవేశిస్తుంది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...



● కార్పొరేట్ ట్రైనర్‌గా...



● నియతి. వి. మరియ

మలుపులు

''నాది ఆనందకరమైన జీవితమే. అమ్మానాన్నలకు మేం ముగ్గురు కూతుళ్లం. నాన్న బ్యాంకు ఉద్యోగి, అమ్మ టీచర్. ఇంజినీరింగ్ పూర్తిచేసి, ఎయిర్‌లైన్స్ కంపెనీలో ఉద్యోగిగా ఉన్నాను. ఆఫీసులో ఉన్నప్పుడు ఓరోజు గొంతులో గడ్డలాగా అనిపించింది. మొదట టాన్సిల్స్ అనుకున్నాను. అయినప్పటికీ ముందు జాగ్రత్తగా చెక్ చేసుకుంటూనే ఉన్నాను. కానీ, రోజు రోజుకూ గడ్డ పెరుగుతూనే ఉంది. సెలవుల్లో ఇంటికి వెళ్లగానే అమ్మానాన్నకు చెప్పాను. డాక్టర్ సలహా మేరకు పరీక్షలు చేయించుకున్నాను. హెల్త్ రిపోర్ట్స్ చూడగానే నా కాళ్ల కింద నేల కదిలిపోయినట్టుగా అనిపించింది. అప్పటివరకు క్యాన్సర్ అంటే 'ఇతరులకు వచ్చే జబ్బు' అని అనుకునేదాన్ని. క్యాన్సర్ అంటే మరణం అని సినిమాల్లోనూ చూశాను. ఇప్పుడది నా ఒంట్లోనే ఉంది.

అంగీకరించక తప్పలేదు!

క్యాన్సర్ జబ్బు నా ఒంట్లోనే ఉందని అంగీకరించడానికే చాలా కాలం పట్టింది. చికిత్స తీసుకోవడం మొదలుపెట్టాను. అయితే, కీమోథెరపీకి భయపడ్డాను. అందుకే, హోమియోపతి, ఆయుర్వేద చికిత్సలు కూడా తీసుకున్నాను. రోజులు నెలల్లోకి మారుతున్నాయి. మళ్లీ రిపోర్ట్స్ తీస్తే క్యాన్సర్ నాల్గవదశలో ఉందని తేలింది. డాక్టర్ కీమోథెరపీ తప్పదన్నారు. కీమోథెరపీ గురుగ్రామ్‌లో మొదలైంది. మొత్తం ఆరు సెషన్స్. నాల్గవ సెషన్ పూర్తయ్యేనాటికి జుట్టు 90 శాతం రాలిపోయింది. సెషన్స్ పూర్తయ్యాక తిరిగి ఉద్యోగంలో చేరాను. విగ్ పెట్టుకొని ఆఫీసుకు వెళ్లేదాన్ని. ఈ పరిస్థితి నన్ను శారీరకంగా మానసికంగా కుంగదీసింది.

భయపడద్దు

ముమ్ముందు కీమోథెరపీని ఎలాగైనా నివారించాలనుకున్నాను. అందుకు, ఇంటర్‌నెట్‌లో చాలా శోధించాను. ఈ క్రమంలో హీలింగ్ ప్రాసెసింగ్ పద్ధతులు నా కంటపడ్డాయి. వీటి గురించి తెలుసుకున్న కొద్దీ నాలో నాకే ఓ కొత్తశక్తి వచ్చి చేరినట్టు అనిపించేది. వాటిని ఆచరణలో పెట్టాను. ఆఫీసు వర్క్ పూర్తయ్యాక ఒక రోజు థెరపిస్ట్ దగ్గరకు వెళ్లాను. ఒక విధంగా చెప్పాలంటే అక్కడి సెషన్స్ నా జీవితాన్ని మార్చేశాయి. క్యాన్సర్‌కు భయపడకూడదని, దానితో పోరాడాలని గట్టిగా నిర్ణయించుకున్నాను.

> **మరింత సాధన**
>
> రకరకాల అనారోగ్య సమస్యలతో ఉన్నవారు నేనిచ్చే సూచనలతో తమ జీవితాల్లో సానుకూల మార్పు వచ్చిందని చెప్పేవారు. దీంతో నాకు ఎంతగానో సాయంగా ఉన్న హీలింగ్ ప్రక్రియలను మరింత గా సాధన చేయడం మొదలుపెట్టాను. ఫలితంగా అనారోగ్యం నుంచి కోలుకున్నాను. పెళ్లి చేసుకొని, ఓ బిడ్డకు తల్లినయ్యాను.

మనసు– శరీరం

నా ఆరోగ్యం బాగోలేదని అర్థమయ్యాక క్యాన్సర్ అనుభవం నుంచి మనసుకు– శరీరానికి మధ్య గల సంబంధం గురించి తెలుసుకున్నాను. మానసికంగా బలహీనంగా ఉంటే అది శరీరంపైన ఎలాంటి చెడు ప్రభావమైనా చూపుతుంది. ఇందు కోసం హిప్నోథెరపీ గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నాను. దీని ద్వారా అంచెలంచెలుగా నన్ను నేను మెరుగు పరుచుకున్నాను. దీనివల్ల చేకూరుతున్న ప్రయోజనాలు, నాలో వస్తున్న మార్పులు చుట్టూ ఉన్నవారిలో ఆసక్తిని రేకెత్తించాయి. దీంతో తెలిసిన వారు, నా సూచనల కోసం వచ్చేవారు.

చేస్తున్న ఎయిర్ ఇండియా ఉద్యోగాన్ని విడిచిపెట్టి, 'ఇదయా కాన్షియస్ లివింగ్'ను ప్రారంభించాను. ఈ పదేళ్లలో దాదాపు ప్రపంచం నలుమూలల వ్యక్తులతో కలిసి పనిచేశాను. ఇప్పటి వరకు పదివేలకు పైగా వ్యక్తుల జీవితాల్లో ఆరోగ్యకరమైన మార్పు తీసుకురాగలిగాను. ప్రజలకు పూర్తి స్వస్థతా చికిత్సపై అవగాహన కలిగించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. గూగుల్ లాంటి కంపెనీల్లో కార్పొరేట్ ట్రైనర్‌గా పనిచేశాను. హిప్నోబర్తింగ్ ద్వారా ప్రసవ సమయంలో ఎలాంటి పద్ధతుల ద్వారా సుఖ ప్రసవం అవుతుందో కూడా నేర్పిస్తుంటాను. ఎవ్వరైనా సరే ఏ అనారోగ్య సమస్య వచ్చినా ముందు మానసికంగా కుంగిపోకూడదు. మనసు దృఢంగా ఉంటే ఎలాంటి యుద్ధంలోనైనా గెలవగలరు'' అని వివరిస్తుంది మరియ.



ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ముంబై ఇండియన్స్ జట్టుకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్‌ను నియమించారు. భారత కెప్టెన్ అయిన హర్మన్‌ప్రీత్ ఇటీవల టి20 ప్రపంచకప్ సందర్భంగా 150 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడిన తొలి క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. బీసీసీఐ ఆధ్వర్యంలో డబ్ల్యూపీఎల్ తొలి సీజన్ ఈనెల 4 నుంచి 26 వరకు ముంబైలో జరుగుతుంది. లీగ్ తొలి రోజు తొలి మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో ముంబై ఇండియన్స్ ఆడుతుంది.

ఇంగ్లండ్‌ను గెలిపించిన మలాన్



బంగ్లాదేశ్‌తో మిర్పూర్‌లో బుధవారం జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ మూడు వికెట్లతో గెలిచింది. 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 48.4 ఓవర్లలో 7 వికెట్లకు 212 పరుగులు చేసి నెగ్గింది. డేవిడ్ మలాన్ (114 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలిపించాడు. తొలుత బంగ్లాదేశ్ 47.2 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. ఆర్చర్, వుడ్, మొయిన్ అలీ, ఆదిల్ రషీద్ రెండేసి వికెట్లు తీశారు.

భారత్ 109 ఆలౌట్

నిజంగానే నిజం! 109 పరుగులకే ఆలౌటైంది ఆస్ట్రేలియా కాదు... భారతే! గత రెండు టెస్టుల్లో ఎదురులేని టీమిండియా జోరు చూసినోళ్లకు ఇది కచ్చితంగా షాకే! చూసినోళ్లకే కాదు... మైదానంలో ఆడుతున్న భారత్‌కూ ఊహించని షాక్. గత రెండు టెస్టుల్లో తమ భరతం పట్టిన ఆతిథ్య జట్టును ఆసీస్ దెబ్బ తీసింది. అనంతరం బ్యాటింగ్‌లో నిలకడగా ఆడుతూ తొలిరోజే పటిష్టమైన ఆధిక్యానికి శ్రీకారం చుట్టింది.



ఖాజా

- ఆసీస్ స్పిన్ ఉచ్చులో గిలగిల
- దెబ్బ తీసిన కునెమన్, లయన్
- రాణించిన ఖాజా; ఆసీస్ 156/4

2 కపిల్ దేవ్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో 500 వికెట్లు తీసుకోవడంతోపాటు 5000 పరుగులు పూర్తి చేసిన రెండో భారతీయ క్రికెటర్‌గా రవీంద్ర జడేజా నిలిచాడు.

1 టెస్టుల్లో వరుసగా రెండు ఇన్నింగ్స్‌లలో ఎక్స్‌ట్రాలు ఇవ్వని తొలి జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది. ఢిల్లీలో జరిగిన రెండో టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో, మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ బౌలర్లు ఎక్స్‌ట్రాలు ఇవ్వలేదు.

ఇండోర్: తనదైన రోజున ఓ ఆటగాడిని లేదంటే జట్టుని అంత తేలిగ్గా తీసుకోరాదనేది ఇండోర్ టెస్టు మొదలైన రోజును చూస్తే ఇట్టే అర్థమవుతుంది. ఆస్ట్రేలియా స్పిన్ ద్వయం కునెమన్ (5/16), లయన్ (3/35) టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌ను ఒక్క సెషన్‌లోనే కుదేలు చేసింది. దీంతో మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 33.2 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. కోహ్లి (52 బంతుల్లో 22; 2 ఫోర్లు) టాప్ స్కోరర్! అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 54 ఓవర్లలో 4 వికెట్లకు 156 పరుగులు చేసింది. 47 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. చేతిలో ఇంకా 6 వికెట్లున్నాయి. ఓపెనర్ ఉస్మాన్ ఖాజా (147 బంతుల్లో 60; 4 ఫోర్లు) రాణించాడు. జడేజాకు 4 వికెట్లు దక్కాయి.

రాహుల్ స్థానంలో గిల్

కెప్టెన్ రోహిత్ ఫామ్‌లో లేని రాహుల్‌ను కాదని శుబ్‌మన్ గిల్‌తో ఇన్నింగ్స్ ఓపెన్ చేశాడు. సీమ్ బౌలింగ్‌ను చక్కగా ఎదుర్కోవడం, బౌండరీలు సులువుగా రావడంతో అనుభవజ్ఞుడైన స్మిత్ ఆరో ఓవర్లోనే స్పిన్నర్ కునెమన్‌ను దించాడు. ఈ ఎత్తు ఫలితమివ్వగా... కెప్టెన్ రోహిత్ (23 బంతుల్లో 12; 3 ఫోర్లు) స్టంపౌటయ్యాడు. తన మరుసటి ఓవర్లో గిల్ (18 బంతుల్లో 21; 3 ఫోర్లు)ను పెవిలియన్ చేర్చాడు. దీంతో కెప్టెన్ స్మిత్ బంతిని పూర్తిగా స్పిన్నర్ల చేతుల్లోనే పెట్టాడు. లయన్ కూడా తన తొలి ఓవర్లోనే వెటరన్ పుజారా (1)ను అసాధారణ టర్న్‌తో బౌల్డ్ చేశాడు. 36 పరుగులకే టాపార్డర్ పెవిలియన్‌కెళ్లింది. లయన్ తన తదుపరి ఓవర్లో జడేజా (4)ను బోల్తా కొట్టించాడు. స్లో డెలివరీని బౌండరీ కొట్టాలనుకుంటే అక్కడే ఉన్న కునెమన్ చురుగ్గా అందుకున్నాడు. మరుసటి ఓవర్లో... అదికూడా కేవలం 2 బంతుల వ్యవధిలోనే శ్రేయస్ అయ్యర్ (0) విస్మయపరిచే రీతిలో వెనుదిరిగాడు. కునెమన్ బంతి అయ్యర్ బ్యాట్ అంచును తగిలి వికెట్లను తాకీతాకనట్లుగా వెళ్లింది. బెయిల్ నెమ్మదిగా కిందకు పడటం... ఈ లోపు కీపర్ నుంచి బంతి వికెట్ల వైపు రీబౌండ్ కావడంతో అయ్యర్ తాను అవుట్ కాదనే భ్రమలో ఉండిపోయాడు. టీవీ అంపైర్ రీప్లే చూసి అవుటివ్వడంతో క్రీజు వీడక తప్పలేదు. 11.2 ఓవర్లలో 45 పరుగులకే సగం (5) వికెట్లు కూలడంతో భారత్ కష్టాల్లో పడింది. అందరి కంటే ఎక్కువ బంతులు, ఎక్కువసేపు క్రీజులో నిలిచిన కోహ్లిని మూడో స్పిన్నర్ మర్ఫీ ఎల్బీగా పంపాడు. కోహ్లి రివ్యూకెళ్లినా ఫలితం లేకపోయింది. శ్రీకర్ భరత్ (17; 1 ఫోర్, 1 సిక్స్) కూడా త్వరగానే అవుటయ్యాడు. 84/7 స్కోరు వద్ద లంచ్‌కెళ్లిన భారత్... రెండో సెషన్ మొదలైన కాసేపటికే 100 పరుగుల్ని కష్టంగా దాటి... అంతలోపే ఆలౌటైంది.



కునెమన్
లయన్
పుజారా బౌల్డ్

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ (స్టంప్డ్) క్యారీ (బి) కునెమన్ 12; గిల్ (సి) స్మిత్ (బి) కునెమన్ 21; పుజారా (బి) లయన్ 1; విరాట్ కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) మర్ఫీ 22; రవీంద్ర జడేజా (సి) కునెమన్ (బి) లయన్ 4; శ్రేయస్ అయ్యర్ (బి) కునెమన్ 0; భరత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 17; అక్షర్ పటేల్ (నాటౌట్) 12; అశ్విన్ (సి) క్యారీ (బి) కునెమన్ 3; ఉమేశ్ యాదవ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కునెమన్ 17; సిరాజ్ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (33.2 ఓవర్లలో ఆలౌట్) 109. వికెట్ల పతనం:** 1-27, 2-34, 3-36, 4-44, 5-45, 6-70, 7-82, 8-88, 9-108, 10-109. **బౌలింగ్:** మిచెల్ స్టార్క్ 5-0-21-0, కామెరాన్ గ్రీన్ 2-0-14-0, కునెమన్ 9-2-16-5, నాథన్ లయన్ 11.2-2-35-3, మర్ఫీ 6-1-23-1.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ట్రావిస్ హెడ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 9; ఉస్మాన్ ఖాజా (సి) గిల్ (బి) జడేజా 60; లబుషేన్ (బి) జడేజా 31; స్టీవ్ స్మిత్ (సి) భరత్ (బి) జడేజా 26; హ్యాండ్స్‌కాంబ్ (బ్యాటింగ్) 7; గ్రీన్ (బ్యాటింగ్) 6; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (54 ఓవర్లలో 4 వికెట్లకు) 156. వికెట్ల పతనం:** 1-12, 2-108, 3-125, 4-146. **బౌలింగ్:** అశ్విన్ 16-2-40-0, రవీంద్ర జడేజా 24-6-63-4, అక్షర్ పటేల్ 9-0-29-0, ఉమేశ్ యాదవ్ 2-0-4-0, సిరాజ్ 3-0-7-0.

తొలి రౌండ్‌లోనే శ్రీజ ఓటమి



గోవా: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) గోవా కంటెండర్ అంతర్జాతీయ టోర్నమెంట్ నుంచి జాతీయ చాంపియన్, భారత స్టార్ ఆకుల శ్రీజ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ 83వ ర్యాంకర్ శ్రీజ 2-11, 13-11, 8-11, 2-11తో ప్రపంచ 39వ ర్యాంకర్ హనా గొడా (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయింది. ఇతర మ్యాచ్‌ల్లో భారత నంబర్‌వన్, ప్రపంచ 34వ ర్యాంకర్ మనిక బత్రా 11-4, 11-8, 11-5తో టిన్ టిన్ హో (ఇంగ్లండ్)పై, సుతీర్థ ముఖర్జీ 11-7, 11-7, 8-11, 11-8తో సుహానా సైని (భారత్)పై గెలిచి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

'నంబర్‌వన్' అశ్విన్

ఐసీసీ టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్



దుబాయ్: ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టిన ప్రదర్శన... భారత మేటి స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ బౌలర్‌గా చేసింది. బుధవారం విడుదల చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ పేస్ బౌలర్ జేమ్స్ అండర్సన్‌ను రెండో స్థానానికి పంపించి అశ్విన్ నంబర్‌వన్ స్థానాన్ని అందుకున్నాడు. 36 ఏళ్ల అశ్విన్ తొలిసారి 2015లో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. ఆ తర్వాత పలుమార్లు అతను ఈ ఘనత సాధించాడు. గత మూడు వారాల్లో టాప్ ర్యాంక్‌లో ముగ్గురు వేర్వేరు బౌలర్లు నిలవడం విశేషం. అండర్సన్‌కంటే ముందు ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఈ స్థానంలో ఉన్నాడు. ఇప్పటివరకు 90 టెస్టులు ఆడిన అశ్విన్ 463 వికెట్లు పడగొట్టాడు. ఈ చెన్నై స్పిన్నర్ 864 రేటింగ్ పాయింట్లతో తాజాగా అగ్రస్థానానికి చేరుకోగా... అండర్సన్ 859 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. కమిన్స్ మూడో స్థానానికి చేరుకోగా... భారత్‌కే చెందిన బుమ్రా నాలుగో ర్యాంక్‌లో, షాహీన్ అఫ్రిది (పాకిస్తాన్) ఐదో ర్యాంక్‌లో ఉన్నారు. టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా తొలి స్థానంలో, అశ్విన్ రెండో స్థానంలో, అక్షర్ పటేల్ ఐదో స్థానంలో ఉన్నారు.

యశస్వి డబుల్ సెంచరీ



గ్వాలియర్: రంజీ చాంపియన్ మధ్యప్రదేశ్ జట్టుతో జరుగుతున్న ఇరానీ కప్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి రెస్ట్ ఆఫ్ ఇండియా 87 ఓవర్లలో 3 వికెట్లకు 381 పరుగులు సాధించింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (2) విఫలమయ్యాడు. యశస్వి జైస్వాల్ (259 బంతుల్లో 213; 30 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్ సెంచరీతో... అభిమన్యు ఈశ్వరన్ (240 బంతుల్లో 154; 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగిపోయారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 371 పరుగులు జోడించడం విశేషం. సౌరభ్ కుమార్ (0 బ్యాటింగ్), బాబా ఇంద్రజిత్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. మధ్యప్రదేశ్ బౌలర్ అవేశ్ ఖాన్ రెండు వికెట్లు తీశాడు.

క్వార్టర్స్‌లో సాకేత్–యూకీ జోడీ



దుబాయ్: 'లక్కీ లూజర్' హోదాలో మెయిన్ 'డ్రా'లో చోటు సంపాదించిన సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్-యూకీ బాంబ్రీ ద్వయం 6-3, 7-5తో మెలో (బ్రెజిల్)-జ్వెరెవ్ (జర్మనీ) జోడీపై నెగ్గింది. 73 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాకేత్-యూకీ మూడు ఏస్‌లు సంధించి, మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేశారు. వాస్తవానికి క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో సాకేత్-యూకీ ఓడిపోయి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయారు. అయితే మెయిన్ 'డ్రా' నుంచి ఒక జోడీ వైదొలిగింది. దాంతో క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో ఓడిన సాకేత్-యూకీలకు మెయిన్ 'డ్రా'లో చోటు ఇచ్చారు. మరో మ్యాచ్‌లో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) 5-7, 6-4, 7-10తో మెక్‌టిక్-పావిచ్ (క్రొయేషియా) చేతిలో ఓడిపోయారు.

దక్షిణాఫ్రికాకు ఆధిక్యం

సెంచూరియన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రెండో రోజు ఆట ముగిసేసరికి దక్షిణాఫ్రికా జట్టు 179 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 314/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 342 పరుగులవద్ద ఆలౌటైంది. అనంతరం అన్రిచ్ నోర్జే (5/36), రబడ (2/44), కోట్జీ (2/45) ధాటికి వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులకే పరిమితమైంది. 130 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 49 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (35 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

సినిమా



● ఎన్టీఆర్, రామ్‌చరణ్

ఆస్కార్ వేదికపై నాటు నాటు...

- రామ్‌చరణ్ రిటర్న్ గిఫ్ట్

ఆస్కార్ వేదికపై తెలుగు 'నాటు నాటు' మారుమోగనుంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. 95వ ఆస్కార్ అవార్డ్సులో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఈ చిత్రంలోని 'నాటు నాటు' పాట నామినేట్ అయిన సంగతి తెలిసిందే. మార్చి 12న (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13) జరగనున్న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో 'నాటు నాటు..' పాటను పాడిన గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ లైవ్‌లో పాడనున్నట్లు ఆస్కార్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. యం.యం. కీరవాణి స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రఫీ చేసిన విషయం తెలిసిందే.

అమెరికాలోనే 'ఆర్ఆర్ఆర్' టీమ్

ఆస్కార్ అవార్డుల వేడుక దగ్గర పడటంతో 'ఆర్ఆర్ఆర్' టీమ్ ప్రమోషనల్ యాక్టివిటీస్‌ను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం రాజమౌళి, ఆయన సతీమణి రమ, కీరవాణి తదితరులు అమెరికాలో ఉన్నారని తెలిసిది. ఆస్కార్‌కి సంబంధించిన వరుస ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు రామ్‌చరణ్ కూడా ఈ నెల 12కు వరకు యూస్‌లోనే ఉంటారట. మరో హీరో ఎన్టీఆర్ వీరిని త్వరలో జాయిన్ కానున్నారు. అలాగే ఇటీవల ఆస్కార్ నిర్వాహకులు అవార్డుల నామినీల కోసం ఏర్పాటు చేసిన లంచ్‌కు కీరవాణి, చంద్రబోస్ హాజరైన విషయం తెలిసిందే. ఈ నెల 9న అమెరికాలో నామినీల కోసం డిన్నర్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ విందులో కీరవాణి, చంద్రబోస్ పాల్గొననున్నారు.

ఎన్టీఆర్... చరణ్... హుక్ స్టెప్?

ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను లైవ్‌లో సింగర్స్ రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ పాడతారు కాబట్టి డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ కూడా ఉంటే బాగుంటుందని పలువురు నెటిజన్లు పోస్ట్ చేస్తున్నారు. వీటికి తోడు ఇటీవల ఓ అమెరికా మీడియాకు రామ్‌చరణ్ ఇంటర్వ్యూ ఇస్తూ...''ఇప్పటివరకు ప్రేక్షకులు మాకు చాలానే ఇచ్చారు. నా ప్రేమను ప్రేక్షకులకు చూపించడానికి 'నాటు నాటు' పాటను ఆస్కార్ లైవ్‌లో ప్రదర్శించడం ఓ మార్గంలా భావిస్తున్నాను. ఇది నేను వారికి ఇచ్చే రిటర్న్ గిఫ్ట్‌లా అనుకుంటున్నాను'' అని పేర్కొన్నారు. దీంతో ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటకు ఎన్టీఆర్, చరణ్ డ్యాన్స్ చేస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే మరో ఇంటర్వ్యూలో రామ్‌చరణ్ 'నాటు నాటు' పాట గురించి మాట్లాడుతూ– ''ఈ పాట చిత్రీకరణ సమయంలో దాదాపు 300మంది ప్రొఫెషనల్ డ్యాన్సర్లు సెట్స్‌లో ఉన్నారు. 7 రోజుల రిహార్సల్స్ తర్వాత 17 రోజుల పాటు ఈ పాటను షూట్ చేశాం.. 'నాటు నాటు' పాటను మేం ప్రదర్శించిన ప్రతిచోటా మంచి స్పందన లభిస్తోంది. అలా అని అన్ని చోట్లా చేయలేం. ఇక ఆస్కార్ నిర్వాహకులు రిక్వెస్ట్ చేస్తే, టైమ్ కలిసొస్తే 'నాటు నాటు' పాట పెర్ఫార్మ్ చేస్తాం. అయితే పాట మొత్తం ప్రదర్శించడం అనేది కష్టం. ఎందుకంటే ఈ పాటకు స్టెప్స్ వేసే టైమ్‌లో చాలా బ్రీత్ కావాలి, ఎనర్జీ ఉండాలి. కానీ చాన్స్ ఉంటే 'నాటు నాటు'లోని 'హుక్ స్టెప్'ను ఎందుకు ప్రయత్నించకూడదు? అను కుంటున్నాను'' అని పేర్కొన్నారు. మరి.. ఎన్టీఆర్, చరణ్‌ల లైవ్ పెర్ఫార్మెన్స్ ఉంటుందా? లేదా అనేది 13న తెలిసిపోతుంది.

స్టైలిష్ రావణాసుర



● రవితేజ

హీరో రవితేజ వేసవిలో థియేటర్లలో సందడి చేయనున్నారు. ఆయన హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'రావణాసుర'. ఈ చిత్రంలో సుశాంత్ కీలక పాత్ర చేయగా, మేఘా ఆకాష్, అనూ ఇమ్మాన్యుయేల్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటించారు. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్‌ని ఈ నెల 6న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించి, ఓ పోస్టర్ విడుదల చేసింది. ''స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'రావణాసుర'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో, కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్.

మాస్ దుర్గ



● సుధీర్‌బాబు

సుధీర్‌బాబు మూడు పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మామా మశ్చీంద్ర'. హర్షవర్ధన్ దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దుర్గ, పరశురామ్, డీజే.. ఈ మూడు పాత్రల్లో కనిపిస్తారు సుధీర్ బాబు. మాస్‌గా కనిపించే దుర్గ లుక్‌ని బుధవారం రిలీజ్ చేశారు. ''డిఫరెంట్ కాన్సెప్ట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. ఈ నెల 4న పరశురామ్ లుక్‌ని, 7న డీజే లుక్‌ని రిలీజ్ చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: పీజీ విందా, సమర్పణ: సోనాలి నారంగ్, సృష్టి (సృష్టి సెల్యులాయిడ్).

పెళ్లి సందడి



● మనోజ్

మంచు మనోజ్ పెళ్లి సందడి మొదలైంది. దివంగత ఎమ్మెల్యేలు భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి దంపతుల రెండో కుమార్తె భూమా మౌనికా రెడ్డితో మనోజ్ వివాహం రేపు జరగనుంది. వివాహ వేడుకల్లో భాగంగా మెహందీ వేడుక బుధవారం జరిగింది. కాగా కొద్దిమంది బంధువులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో హైదరాబాద్‌లో వీరి వివాహం జరగనుందని తెలిసింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం 'వాట్ ది ఫిష్' అనే సినిమా చేస్తున్నారు మనోజ్.

తెలివైన తీక్షణ



● ప్రియాంక

ప్రముఖ నటుడు ఉపేంద్ర భార్య, నటి ప్రియాంకా ఉపేంద్ర టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'డిటెక్టివ్ తీక్షణ'. ఆమె కెరీర్‌లో 50వ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు త్రివిక్రమ్ రఘు దర్శకుడు. గుత్తముని ప్రసన్న, జి. మునివెంకట్ చరణ్, బి. పురుషోత్తం నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, బెంగాలీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ప్రియాంక మాట్లాడుతూ– ''డిటెక్టివ్ తీక్షణ' ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టేలా ఉంటుంది. ఒక మహిళా పోలీసాఫీసర్ ఎంత ఇంటెలిజెంట్‌గా ఓ క్రైమ్‌ను సాల్వ్ చేసిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. మహిళలకు ఈ సినిమా ఓ స్ఫూర్తిలా ఉంటుంది'' అని చెప్పారు.

సైకో థ్రిల్లర్



● ధన్సిక

'కబాలి' ఫేమ్ సాయి ధన్సిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం సైకో థ్రిల్లర్ 'దక్షిణ'. 'మంత్ర', 'మంగళ' చిత్రాల దర్శకుడు ఓషో తులసీరామ్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని అశోక్ షిండే నిర్మించారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా అశోక్ షిండే మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో సాయి ధన్సిక పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారి పాత్రలో నటించారు. 'మంత్ర', 'మంగళ' తరహాలో 'దక్షిణ' కూడా ట్రెండ్ సెట్ చేస్తుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: బాలాజీ, కెమెరా: నర్సింగ్.



● అనుష్క ● నవీన్

మిస్ రవళి శెట్టి.. మిస్టర్ సిద్ధు పొలిశెట్టి

అనుష్క, నవీన్ పొలిశెట్టి జంటగా ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. పి. మహేశ్ బాబు దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రానికి 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అనుష్క, నవీన్ పాత్రల పేర్లు కలిసి వచ్చేలా టైటిల్‌ని ప్రకటించి, ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''ఈ సినిమాలో సిద్ధు పొలిశెట్టి అనే స్టాండప్ కమెడియన్‌గా నవీన్, అన్విత రవళి శెట్టి అనే చెఫ్ పాత్రలో అనుష్క నటించారు. ''మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' టైటిల్ సినిమా కథకు సరిపోయేలా ఉంటుంది. ఈ చిత్రాన్ని వేసవిలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: రధన్, కెమెరా: నీరవ్ షా.

మిస్టరీ ఏంటి?



● రవిశంకర్

రవిశంకర్, జేడీ ఆకాష్, సయ్యద్ ఇర్ఫాన్, సుమితా బజాజ్, సహర్ అఫ్సహ, వీరు ప్రధాన పాత్రల్లో హెచ్‌ఎమ్ శ్రీనందన్ దర్శకత్వం వహించిన చిత్రం 'కరాళ'. బోదాసు నర్సింహ నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం కన్నడలో 'బీగా' పేరుతో ఈ నెల 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో 'కరాళ' చిత్రం ట్రైలర్‌ను నిర్మాతలు ప్రసన్న కుమార్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ విడుదల చేశారు. బోదాసు నర్సింహ మాట్లాడుతూ– ''నాకు సినిమాపై అవగాహన లేదు. శ్రీనందన్ చెప్పిన కథ నచ్చి, నిర్మించాను'' అన్నారు. ''సైంటిఫిక్ మిస్టరీ చిత్రమిది'' అన్నారు శ్రీనందన్. సహనిర్మాత పిట్ల భాస్కర్, సంగీతదర్శకుడు శ్రీ గురు తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: ఎమ్‌బి అల్లికట్టి, వీనస్ నాగరాజ్ మూర్తి.

పోలీస్ మీటర్



● కిరణ్

కిరణ్ అబ్బవరం, అతుల్య రవి జంటగా నటించిన తాజా చిత్రం 'మీటర్'. ఈ చిత్రం ద్వారా రమేష్ కాదూరి దర్శకునిగా పరిచయమవుతున్నారు. చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రాన్ని ఏప్రిల్ 7న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు మాట్లాడుతూ– ''మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'మీటర్'. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారు'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాయి కార్తీక్, కెమెరా: వెంకట్ .సి దిలీప్–సురేష్ సారంగం, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్ (నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి).

ప్రేమిస్తే ప్రశాంతం



● గగన్, అవ్యక్త

గగన్ విహారి, అవ్యక్త జంటగా బి. రామచంద్ర శ్రీనివాస కుమార్ దర్శకత్వంలో ఆరంభమైన చిత్రం 'గాంగేయ'. ఎం. విజయ శేఖర్ రెడ్డి సమర్పణలో విజయ గౌతమి ఆర్ట్ మూవీస్‌పై టి. హేమకుమార్ రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి ఎం. విజయ శేఖర్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ సముద్ర క్లాప్ కొట్టారు. బి. రామచంద్ర శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ– ''రామానాయుడు గారిలా కుటుంబ సమేతంగా చూసేలా ఈ సినిమాను నిర్మిస్తున్నాం. మనిషి మనిషిని ప్రేమిస్తేనే శాంతి ఉంటుందనే పాయింట్‌తో తీస్తున్నాం'' అన్నారు. ''గాంగేయ'ని తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో నిర్మిస్తున్నాం'' అన్నారు టి. హేమకుమార్ రెడ్డి. ''చాలా మంచి కథతో ఈ చిత్రం రాబోతోంది'' అన్నారు ఎం. విజయ్ శేఖర్ రెడ్డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	449	59,411
నిఫ్టీ ▲	147	17,451

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	11,430	▽	25
డోజోన్స్	32,732	▲	75
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,915	▲	39
డాక్స్	15,305	▽	60
షాంఘై	3,312	▲	33
నికాయ్	27,517	▲	71

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	56,140	▲	1017
బంగారం (22 క్యారట్)	55,915	▲	1015
వెండి (కేజీ)	64,246	▲	1476

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.73	83.40
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	97.78	101.06
€	యూరో	ఎస్‌బీఐ	85.97	89.01
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.61	61.52
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.59	56.98
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.33	62.28
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.00	22.68
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.56	23.36
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.96

కెనరా బ్యాంక్‌కు ఎంఎస్‌ఎంఈ ఎక్సలెన్స్ అవార్డు



హైదరాబాద్: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్‌ను 'ఎంఎస్‌ఎంఈ బ్యాంకింగ్ ఎక్సలెన్స్ అవార్డు 2022' వరించింది. దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలను ప్రోత్సహించే దిశగా బ్యాంక్ అందించిన సేవలకుగానూ ఈ ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఢిల్లీలోని చాంబర్ ఆఫ్ ఇండియన్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఈ అవార్డు అందించింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ భవేంద్ర కుమార్ ఈ అవార్డును అందుకున్నారు.

ఇక ఒలెక్ట్రా ఈ-టిప్పర్స్..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అనుబంధ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ భారత్‌లో తొలిసారిగా తయారుచేసిన 6x4 హెవీ డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్స్‌కు హోమోలోగేషన్ ధ్రువీకరణ లభించింది. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఈ సర్టిఫికెట్ సాధించింది. రహదారులకు టిప్పర్ అనువైనదో లేదో తెలుసుకునేందుకు పర్వత ప్రాంతాలు, ఎత్తయిన ప్రదేశాలు, మైనింగ్, క్వారీల్లో పరీక్షలు చేసి ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. దేశంలోనే మొట్టమొదటి సర్టిఫైడ్ హెవీ డ్యూటీ ఈ-టిప్పర్‌గా ఇది నిలిచిందని ఒలెక్ట్రా సీఎండీ కె.వి.ప్రదీప్ తెలిపారు. 20 ఈ-టిప్పర్ల సరఫరాకై ఒక సంస్థతో చర్చలు తుది దశలో ఉన్నాయని చెప్పారు. వివిధ వేరియంట్లలో ఈ వాహనాన్ని విడుదల చేస్తామన్నారు. నిర్మాణం, మౌలిక సదుపాయాలు, మైనింగ్, క్వారీ రంగాల్లో ఇది గణనీయమైన మార్పును తేనుందని వివరించారు.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.49 లక్షల కోట్లు

ఫిబ్రవరి గణాంకాల వెల్లడి • 2022 ఇదే నెలతో పోల్చితే 12 శాతం అధికం

న్యూఢిల్లీ: భారత్ వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ఫిబ్రవరిలో 2022 ఇదే నెలతో పోల్చితే 12 శాతం పెరిగి రూ.1.49 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ ఆర్థిక క్రియాశీలత, వినియోగ వ్యయాల పటిష్టత దీనికి కారణం. అయితే 2023 జనవరితో పోల్చితే (రూ.1.55 లక్షల కోట్లు. జీఎస్‌టీ ప్రవేశపెట్టిన 2017 జూలై 1 తర్వాత రెండవ అతి భారీ వసూళ్లు) వసూళ్లు తగ్గడం గమనార్హం. అయితే ఫిబ్రవరి నెల 28 రోజులే కావడం కూడా ఇక్కడ పరిశీలనలోకి తీసుకోవాల్సిన అంశమని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొన్నాయి. విభాగాల వారీగా చూస్తే...

- మొత్తం రూ.1,49,577 కోట్ల వసూళ్లలో సెంట్రల్ జీఎస్‌టీ రూ.27,662 కోట్లు.
- స్టేట్ జీఎస్‌టీ రూ.34,915 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.75,069 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.35,689 కోట్లుసహా).
- సెస్ రూ.11,931 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.792 కోట్లుసహా). కాగా, జీఎస్‌టీ ప్రారంభమైన తర్వాత సెస్ వసూళ్లు ఈ స్థాయిలో జరగడం ఇదే తొలిసారి.
- 'ఒకే దేశం- ఒకే పన్ను' నినాదంతో 2017 జూలైలో పలు రకాల పరోక్ష పన్నుల స్థానంలో ప్రారంభమైన జీఎస్‌టీ వ్యవస్థలో 2022 ఏప్రిల్‌లో వసూళ్లు రికార్డు స్థాయిలో రూ.1,67,650 కోట్లుగా నమోదయ్యాయి.




2022 ఏప్రిల్ నుంచి ఇలా...

నెల	జీఎస్‌టీ ఆదాయం (రూ.కోట్లలో)
ఏప్రిల్ 2022	1,67,650
మే	1,40,885
జూన్	1,44,616
జూలై	1,48,995
ఆగస్టు	1,43,612
సెప్టెంబర్	1,47,686
అక్టోబర్	1,51,718
నవంబర్	1,45,867
డిసెంబర్	1,49,507
జనవరి 2023	1,55,922
ఫిబ్రవరి	1,49,577

ఫిబ్రవరిలో 3.35 లక్షల వాహన అమ్మకాలు

న్యూఢిల్లీ: వ్యక్తిగత రవాణాకు బలమైన డిమాండ్ కొనసాగడంతో ఫిబ్రవరిలో 3.35 లక్షల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే నెల విక్రయాలతో పోలిస్తే ఇది 11 శాతం అధికం. ఆటోమొబైల్ రంగంలో ఇప్పటి వరకు ఫిబ్రవరిలో నమోదైన అత్యధిక టోకు అమ్మకాలు రికార్డు ఇవే కావడం విశేషం. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్ ఎంఅండ్‌ఎం, కియా మోటార్స్, టయోటో కిర్లోస్కర్ కంపెనీలు చెప్పుకోదగిన స్థాయిలో అమ్మకాలు జరిపాయి. ఇదే నెలలో ద్విచక్ర విక్రయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. హీరో మోటోకార్ప్, రాయల్ ఎన్‌ఫీల్డ్ విక్రయాలు పెరిగాయి. బజాజ్ ఆటో, హోండా మోటోసైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్‌ఎంఎస్‌ఐ) టీవీఎస్ మోటార్ అమ్మకాలు నిరాశపరిచాయి. వాణిజ్య వాహనాలకు గిరాకీ లభించింది.

కంపెనీ	ఫిబ్రవరి 2023	ఫిబ్రవరి 2022	వృద్ధి/క్షీణత(%)
మారుతీ సుజుకీ	1,72,321	1,64,056	(+)5
హ్యుందాయ్	57,851	53,159	(+)9
టాటా మోటార్స్	79,705	77,733	(+)3
ఎండ్అండ్ఎం	58,801	54,455	(+)8
హోండా కార్స్	6,086	7,187	(-)15
టయోటా కిర్లోస్కర్	15,338	8,745	(+)75
కియా మోటార్స్	24,600	18,121	(+)36
బజాజ్ ఆటో	2,80,226	3,16,020	(-)11
హీరో మోటోకార్ప్	3,94,460	3,58,254	(+)10
టీవీఎస్ మోటార్స్	2,76,150	2,81,714	(-)2
హోండా	2,47,175	3,12,650	(-)21
వోల్వో ఐషర్	7,289	5,856	(+)24
అశోక్ లేలాండ్	17,568	13,281	(+)32
ఎస్కార్ట్స్	7,811	6,114	(+)27
మహీంద్రా ట్రాక్టర్స్	58,801	54,455	(+)8



ఎట్టకేలకు లాభాలొచ్చాయ్

- 8 రోజుల వరుస నష్టాలకు బ్రేక్
- కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు
- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- కలిసొచ్చిన ప్రపంచ పరిణామాలు
- అన్ని రంగాల షేర్లకూ డిమాండ్



ముంబై: ఎనిమిది వరుస నష్టాల ముగింపు తర్వాత బుధవారం స్టాక్ సూచీలు లాభపడ్డాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాలు కలిసిరాగా.., దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు మార్కెట్ వర్గాలను మెప్పించాయి. అధిక వెయిటేజీ రిలయన్స్, టీసీఎస్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు రెండుశాతం రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఉదయం సెన్సెక్స్ 174 పాయింట్ల లాభంతో 59,136 వద్ద, నిఫ్టీ 56 పాయింట్లు పెరిగి 17,360 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. తొలి అరగంట కాస్త తడబడినా.., వెంటనే తేరుకోగలిగాయి. యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం మరింత విశ్వాసాన్నిచ్చింది. ఇటీవల దిద్దుబాటులో భాగంగా కనిష్టాలకు దిగివచ్చిన నాణ్యమైన షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఎగబడ్డారు. ఒక దశలో సెన్సెక్స్ 513 పాయింట్లు బలపడి 59,475 వద్ద, నిఫ్టీ 164 దూసుకెళ్లి 17,468 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. ట్రేడింగ్ చివరి వరకు స్థిరమైన లాభాల్లో కదలాడాయి. ఫలితంగా సెన్సెక్స్ 449 పాయింట్లు పెరిగి 59,411 వద్ద, నిఫ్టీ 147 పాయింట్ల లాభంతో 17,451 వద్ద ముగిశాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా మెటల్, ప్రభుత్వరంగ బ్యాంకింగ్ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. విస్తృత స్థాయి మార్కెట్లోని చిన్న, మధ్య తరహా షేర్లకు రాణించడంతో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు వరుసగా 1.38%, 1.35శాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.424 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,499 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో సింగపూర్ మినహా అన్ని దేశాల సూచీలు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి.

- సెన్సెక్స్ సూచీ 449 పెరగడంతో బీఎస్‌ఈ ఎక్స్చేంజీలో రూ.3.28 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.
- అదానీ గ్రూప్‌లోని మొత్తం పది కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అత్యధికంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ 15% బలపడింది. అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ విల్మార్, అదానీ పవర్, అదానీ టోటల్ గ్యాస్, ఎన్‌డీటీవీ షేర్లు ఐదుశాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. అంబుజా సిమెంట్స్ 3.32%, ఏసీసీ 2.14%, అదానీ పోర్ట్స్ ఒకటిన్నరశాతం చొప్పున లాభపడ్డాయి. దీంతో గ్రూప్ మొత్తం కంపెనీల మార్కెట్ వ్యాల్యుయేషన్ రూ.7.56 లక్షల కోట్లకు చేరింది.

ఎఫ్‌అండ్‌ఓలో చమురు, గ్యాస్
ఎన్‌ఎస్‌ఈకి సెబీ గ్రీన్‌సిగ్నల్

స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ లైట్ స్వీట్ క్రూడ్‌గా పిలిచే డబ్ల్యూటీఐతోపాటు.. నేచురల్ గ్యాస్ ఫ్యూచర్స్ కాంట్రాక్టులను ప్రవేశ పెట్టనుంది. ఇందుకు సెబీ నుంచి అనుమతి పొందినట్లు ఎన్‌ఎస్‌ఈ తాజాగా వెల్లడించింది. త్వరలోనే వీటి ఎఫ్‌అండ్‌వో లావాదేవీలను ప్రారంభించనున్నట్లు పేర్కొంది.

దక్షిణాదికి లుపిన్ డయాగ్నోస్టిక్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డయాగ్నోస్టిక్స్ సేవల్లో ఉన్న లుపిన్ డయాగ్నోస్టిక్స్ దక్షిణాదిలో అడుగుపెట్టింది. రీజినల్ రెఫరెన్స్ ల్యాబొరేటరీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. దీంతో సంస్థ ఖాతాలో దేశవ్యాప్తంగా ల్యాబ్స్ సంఖ్య 24కు చేరిందని లుపిన్ డయాగ్నోస్టిక్స్ సీఈవో రవీంద్ర కుమార్ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'నవీ ముంబైలో నేషనల్ రెఫరెన్స్ ల్యాబొరేటరీ ఉంది. 380కిపైగా ఎక్స్‌క్లూజివ్ కలెక్షన్ సెంటర్లు (లుపిమిత్ర) ఉన్నాయి. 400 మందికి పైచిలుకు సిబ్బంది పనిచేస్తున్నారు. లుపిమిత్ర కేంద్రాల ఏర్పాటుకు ఫ్రాంచైజీలను ఆహ్వానిస్తున్నాం. ఏడాదిలో దేశవ్యాప్తంగా 100 ల్యాబ్స్ నెలకొల్పుతాం. ప్రతి ల్యాబ్ ఏర్పాటైన 18 నెలల్లోనే ఎన్‌ఏబీహెచ్ ధ్రువీకరణ పొందాలన్నదే మా లక్ష్యం' అని ఆయన వివరించారు.

యాక్సిస్ గూటిలో సిటీ రిటైల్

- దేశీ బిజినెస్ కొనుగోలు పూర్తి
- రూ. 11,603 కోట్లు చెల్లింపు

న్యూఢిల్లీ/ముంబై: విదేశీ సంస్థ సిటీ బ్యాంకు రిటైల్ బిజినెస్ కొనుగోలు పూర్తయినట్లు ప్రయివేట్ రంగ దేశీ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ తాజాగా పేర్కొంది. దేశీయంగా సంస్థాగత క్లయింట్ల బిజినెస్‌ను మినహాయించిన డీల్ ప్రకారం తుదిగా రూ. 11,603 కోట్లు చెల్లించినట్లు వెల్లడించింది. గతేడాది మార్చిలో యాక్సిస్ తొలిసారిగా కొనుగోలు అంశాన్ని ప్రకటించింది. దీనిలో భాగంగా 2.4 మిలియన్ సిటీ కస్టమర్లను యాక్సిస్ పొందింది. డీల్ కుదిరే సమయానికి ఈ సంఖ్య 3 మిలియన్లుగా నమోదైనట్లు యాక్సిస్ ఎండీ, సీఈవో అమితాబ్ చౌధురి తెలియజేశారు. తమ ఖాతాదారులుగా మారిన సిటీ కస్టమర్ల బ్యాంక్ ఖాతాలు, చెక్ బుక్కులు, ప్రొడక్టు లబ్ధి తదితరాలు యథావిధిగా కొనసాగనున్నట్లు వివరించారు. మొత్తం 8.6 మిలియన్ కార్డులతో నాలుగో పెద్ద క్రెడిట్ కార్డుల సంస్థగా నిలుస్తున్న యాక్సిస్ మరో 2.5 మిలియన్ క్రెడిట్ కార్డులను జత చేసుకుంది. తద్వారా మూడో ర్యాంకుకు చేరింది. రూ. 4 లక్షల కోట్ల రిటైల్ బుక్ కలిగిన యాక్సిస్ సిటీబ్యాంక్ ఇండియాకు చెందిన 3 మిలియన్ కస్టమర్లతోపాటు.. 18 పట్టణాలలో గల 7 కార్యాలయాలు, 21 బ్రాంచీలు, 499 ఏటీఎంలను సొంతం చేసుకుంది. రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంమేరకు సిటీ బ్రాండును 18 నెలలపాటు యాక్సిస్ బ్యాంక్ వినియోగించుకోనుంది.

విదేశీ విద్యకు ఉపకారం

నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌కు ప్రకటన విడుదల

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనేది ఎంతో మంది విద్యార్థుల అభిలాష. కానీ పేదరికం, ఆర్థిక సమస్యల కారణంగా ముందడుగు వేయలేకపోతున్నారు. ఇలాంటి విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ స్కీమ్‌ను తీసుకువచ్చింది.ఈ స్కీమ్ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతను అందిస్తుంది. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్.. నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను కోరుతోంది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

స్కాలర్‌షిప్స్

అర్హతలు

ఈ స్కాలర్‌షిప్ స్కీమ్ ద్వారా పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు కనీసం బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ కోర్సు అభ్యసించిన కాలేజీ వివరాలు దరఖాస్తులో పొందుపరచాలి. అదేవిధంగా పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసే విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. పీజీ చదివిన విద్యాసంస్థ వివరాలను దరఖాస్తులో రాయాలి. అలాగే సంబంధిత డిగ్రీ, పీజీల్లో కనీసం 60% మార్కులను పొంది ఉండాలి.

వయసు

2023, ఏప్రిల్ 01 తేదీ నాటికి 35 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలు మించకూడదు. ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేయాలి.

మొత్తం స్కాలర్‌షిప్‌లు

అర్హులైన విద్యార్థులకు ప్రతి ఆర్థిక సంవత్సరం 125 స్కాలర్‌షిప్‌లను అందిస్తారు. వీటిలో ఎస్సీ-115, ఎస్టీలకు(డీనోటిఫైడ్, సంచార,సెమీ సంచార తెగలు) 06 , భూమిలేని వ్యవసాయ కూలీలకు, సంప్రదాయ కళాకారులకు-4 కేటాయిస్తారు. ప్రతి ఏటా మొత్తం స్కాలర్‌షిప్‌ల్లో మహిళలకు 30 శాతం కేటాయిస్తారు.

మాస్టర్ డిగ్రీలో చేరిన వారికి మూడేళ్లు; పీహెచ్‌డీ విద్యార్థులకు నాలుగేళ్ల కాలానికి ఈ స్కాలర్‌షిప్‌లను అందిస్తారు. ట్యూషన్ ఫీజు, మెయింటనెన్స్ అలవెన్స్, అత్యవసర ఖర్చులు, వీసా ఫీజు, ఎక్విప్‌మెంట్ అలవెన్స్, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం తదితర ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందిస్తారు.

అవసరమైన డాక్యుమెంట్స్

దరఖాస్తు సమయంలో పదో తరగతి సర్టిఫికేట్, కులధ్రువీకరణ పత్రం, ఫోటో, స్కాన్డ్ సిగ్నేచర్, ప్రస్తుతం/శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం, ప్రొవిజనల్ సర్టిఫికేట్, అర్హత పరీక్షకు సంబంధించి ప్రతి సెమిస్టర్‌లో మార్క్‌షీట్స్, ప్రూఫ్ ఆఫ్ సీజీపీఏ/ఎస్‌జీపీఏ,ఫారిన్ యూనివర్సిటీ ఆఫర్ లెటర్ ఉండాలి.

విదేశీ వర్సిటీ వివరాలు

ప్రవేశం పొందిన విదేశీ యూనివర్సిటీ/విద్యాసంస్థ వివరాలను దరఖాస్తులో తెలియజేయాలి. అన్‌కండిషనల్ ఆఫర్ లెటర్‌ను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. ఒకటికంటే ఎక్కువ యూనివర్సిటీల్లో ప్రవేశం లభిస్తే.. వాటిలో ఒకదాన్ని ఎంపిక చేసుకొని సంబంధిత వివరాలను తెలియజేయాలి. అభ్యర్థి ఇప్పటికే వీసా పొంది ఉంటే.. ఆ వివరాలను కూడా దరఖాస్తులో పొందుపరచాలి. లేదా వీసాకు దరఖాస్తు చేసుకున్నట్లయితే ఆ వివరాలను రాయాలి. సంబంధిత పోర్టల్‌లో ఉన్న మార్గదర్శకాలను పాటిస్తూ పూర్తి వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసే సమయంలో ఈమెయిల్, మొబైల్ నంబర్‌లను సరిగా రాయాల్సి ఉంటుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 31.03.2023
- వెబ్‌సైట్: https://nosmsje.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

పీవీ ఎన్‌ఆర్‌వీయూ, రాజేంద్రనగర్‌లో పీహెచ్‌డీ కోర్సులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం.. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 12 సీట్లు.
» సబ్జెక్టులు: వెటర్నరీ అనాటమీ, వెటర్నరీ పారాసిటాలజీ, వెటర్నరీ పాథాలజీ, వెటర్నరీ ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, పౌల్ట్రీ సైన్స్, వెటర్నరీ గైనకాలజీ అండ్ అబ్‌స్టేట్రిక్స్, వెటర్నరీ మెడిసిన్, వెటర్నరీ సర్జరీ అండ్ రేడియాలజీ, ఆనిమల్ న్యూట్రిషన్.
» అర్హత: సంబంధిత విభాగంలో ఎంవీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. » వయసు: 01.07.2023 నాటికి 50 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ఐసీఏఆర్-ఏఐసీఈ-జేఆర్‌ఎఫ్/ఎస్ఆర్‌ఎఫ్(పీహెచ్‌డీ)-2022 ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 09.03.2023.
» వెబ్‌సైట్: www.tsvu.nic.in

ప్రఖ్యాత సంస్థలో.. వినూత్న కోర్సులు!

» ప్రవేశ ప్రకటన విడుదల చేసిన ఐఎస్‌ఐ
» యూజీ, పీజీ, పీహెచ్‌డీ, పీజీ డిప్లొమాల్లో అడ్మిషన్స్

దేశంలో పేరున్న విద్యా సంస్థల్లో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్‌ఐ) ప్రధానమైంది. ఈ ఇన్‌స్టిట్యూట్ అందించే మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. ఐఎస్‌ఐకి కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తేజ్‌పూర్, గిరిడీల్లో క్యాంపస్‌లున్నాయి. వీటిలో యూజీ, పీజీ స్థాయిలో కోర్సులు అందిస్తున్నారు. వీటిలో ప్రవేశాలకు సంబంధించి ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఐఎస్‌ఐ కోర్సుల ప్రత్యేకత, అర్హతలు, ప్రవేశ విధానం తదితర వివరాలు..



కెరీర్ గైడెన్స్

కోర్సులు ఇవే

ఐఎస్‌ఐ ప్రాంగణాల్లో బీస్టాట్, ఎంస్టాట్, బీమ్యాథ్స్, ఎంమ్యాథ్స్, ఎంటెక్, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ కోర్సులు అందిస్తున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులు, ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ, ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్ లభిస్తుంది.

స్టయిపెండ్

ఐఎస్‌ఐలో డిగ్రీ కోర్సుల్లో చేరినవారికి నెలకు రూ.5 వేలు, పీజీ విద్యార్థులకు నెలకు రూ.8వేలు, ఎంటెక్ కోర్సుల విద్యార్థులకు నెలకు రూ.12,400 స్టయిపెండ్ చెల్లిస్తారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్)కు ఎంపికైతే నెలకు రూ.31,1000తోపాటు హెచ్‌ఆర్‌ఏ; సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికైతే నెలకు రూ.35,000తోపాటు హెచ్‌ఆర్‌ఏ అందిస్తారు. అన్ని కోర్సుల విద్యార్థులకూ ఏటా కాంటింజెన్సీ గ్రాంట్ లభిస్తుంది. తక్కువ ధరకు వసతి, భోజన సౌకర్యాలు పొందొచ్చు. కోర్సు చివర్లో క్యాంపస్ నియామకాలు నిర్వహిస్తారు. ఈ సంస్థల్లో కోర్సులు పూర్తిచేసుకున్నవారికి ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.

యూజీ కోర్సులు-అర్హతలు

- **బీస్టాట్:** ఈ కోర్సుకు సంబంధించి 63 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ చదివి ఉండాలి. కోల్‌కతా క్యాంపస్‌లో ఆనర్స్ విధానంలో కోర్సు నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి మూడేళ్లు.
- **బీమ్యాథ్స్:** ఈ కోర్సులో 63 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తిచేయాలి. బెంగళూర్ క్యాంపస్‌లో ఆనర్స్ విధానంలో కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సు వ్యవధి మూడేళ్లు.

పీజీ కోర్సులు ఇవే

- **మాస్టర్ ఆఫ్ స్టాటిస్టిక్స్:** ఈ స్పెషలైజేషన్‌లో 38 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ/బీటెక్ చదివుండాలి. ఈ కోర్సు మొదటి సంవత్సరం కోల్‌కతా, చెన్నై, ఢిల్లీల్లో.. అలాగేరెండో ఏడాది కోర్సును కోల్‌కతా క్యాంపస్‌లో అందిస్తారు.
- **మాస్టర్ ఆఫ్ మ్యాథమాటిక్స్:** ఇందులో 36 సీట్లు ఉన్నాయి. మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ/బీటెక్ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తుకు అర్హులు. ఈ కోర్సు కోల్‌కతా క్యాంపస్‌లో అందిస్తున్నారు.
- **ఎంఎస్ క్వాంటిటేటివ్ ఎకనామిక్స్:** ఏదైనా డిగ్రీ కోర్సుతోపాటు ఇంటర్‌లో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి. కోల్‌కతా, ఢిల్లీ క్యాంపస్‌ల్లో ఈ కోర్సును అందిస్తున్నారు. ఢిల్లీ-35 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 21 సీట్లు ఉన్నాయి.
- **ఎంఎస్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సైన్సెస్:** ఈ కోర్సుకు సంబంధించి 20 సీట్లు ఉన్నాయి. డిగ్రీలో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి. లేదా ఏదైనా విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేయాలి. బెంగళూరు, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో నిర్వహిస్తున్నారు. తొలి రెండు సెమిస్టర్లు బెంగళూరు, మూడో సెమిస్టరు హైదరాబాద్ క్యాంపస్‌లో చదువుతారు.
- **ఎంఎస్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్:** ఈ కోర్సులో 12 సీట్లున్నాయి. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు.బెంగళూరు క్యాంపస్‌లో ఈ కోర్సు అందుబాటులో ఉంది.
- **వ్యవధి:** పీజీ కోర్సుల కాల వ్యవధి రెండేళ్లుగా ఉంది.

ఎంటెక్ కోర్సులు

- **కంప్యూటర్ సైన్స్(సీఎస్):** బీఈ/బీటెక్ లేదా ఇంటర్‌లో మ్యాథ్స్‌తో ఏదైనా పీజీ చదివిన వారు అర్హులు. కోల్‌కతా క్యాంపస్ ఈ కోర్సును ఆఫర్‌చేస్తుంది. ఐఎస్‌ఐ పరీక్షతో-30 మందిని, గేట్ స్కోర్‌తో 15 మందిని చేర్చుకుంటారు.
- **క్రిప్టాలజీ అండ్ సెక్యూరిటీ(సీఆర్ఎస్):** బీఈ/బీటెక్ లేదా ఇంటర్‌లో మ్యాథ్స్‌తో ఏదైనా పీజీ చదివినవారు అర్హులు. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందిస్తున్నారు. ఐఎస్‌ఐ పరీక్షతో 20 మందికి, గేట్ స్కోర్‌తో ఐదు మందికి అవకాశం కల్పిస్తారు.
- **క్వాలిటీ, రిలయబిలిటీ అండ్ ఆపరేషన్ రీసెర్చ్(క్యూఆర్ఓఆర్):** ఈ కోర్సులో 32 సీట్లు ఉన్నాయి. స్టాటిస్టిక్స్‌లో మాస్టర్ డిగ్రీ ఉండాలి. దీంతోపాటు ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివుండాలి. లేదా మ్యాథ్స్‌లో మాస్టర్ డిగ్రీతో పాటు డిగ్రీలో స్టాటిస్టిక్స్, ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివుండాలి. లేదా బీఈ/బీటెక్ ఉండాలి. కోల్‌కతా క్యాంపస్ ఈ కోర్సును అందిస్తోంది.

పీజీ డిప్లొమాలు

- పీజీ డిప్లొమా కోర్సుల కాలవ్యవధి ఏడాదిగా ఉంది.
- **పీజీ డిప్లొమా ఇన్ స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ అనలిటిక్స్:** మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ చదివిన వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. చెన్నై, తేజ్‌పూర్ క్యాంపస్‌ల్లో అందిస్తున్నారు. చెన్నైలో-25, తేజ్‌పూర్‌లో 18 సీట్లు ఉన్నాయి.
- **పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ అండ్ రూరల్ మేనేజ్‌మెంట్ విత్ స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ ఎనలిటిక్స్(పీజీడీఏఆర్ఎస్ఎంఏ):** ఏడాది కాలవ్యవధి కలిగిన ఈ కోర్సును గిరిడీ(జార్ఖండ్) క్యాంపస్ అందిస్తోంది. ఇందులో 18 సీట్లు ఉన్నాయి. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఇంటర్‌లో మ్యాథ్స్ లేదా స్టాటిస్టిక్స్ చదివుండాలి. ఈ కోర్సుకు స్టయిపెండ్ లేదు.
- **పీజీ డిప్లొమా ఇన్ అప్లయిడ్ స్టాటిస్టిక్స్:** ఇందులో 30 సీట్లు ఉన్నాయి. గత విద్యాసంవత్సరం నుంచి ఐఎస్‌ఐ అప్లయిడ్ స్టాటిస్టిక్స్‌లో ఏడాది వ్యవధి కలిగిన పీజీ డిప్లొమా కోర్సును ఆన్‌లైన్‌లో కోర్స్ ఎరాతో కలిసి అందిస్తోంది. ఇంటర్‌లో మ్యాథ్స్ చదివి, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్:** ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్‌ఐ),కోల్‌కతా; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), ఖరగ్‌పూర్; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం), కోల్‌కతా-ఈ మూడు సంస్థలూ కలిసి రెండేళ్ల పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సు అందిస్తున్నాయి. అర్హత: కనీసం 60శాతం మార్కులతో బీటెక్/ఎంటెక్ /ఎమ్మెస్సీ /ఎంకాం/ఎంబీఏ పూర్తిచేసుకున్నవారు అర్హులు. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక విధానం

ఐఎస్‌ఐ ఆయా కోర్సులను బట్టి ప్రత్యేకమైన ఎంపిక విధానాన్ని అనుసరిస్తోంది. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ, ఇంటర్వ్యూ, ఇంటర్‌లో సాధించిన మార్కులు, పని అనుభవం తదితరాల ఆధారంగా కోర్సులోకి తీసుకుంటారు.

పరీక్ష ఇలా

ఐఎస్‌ఐ ప్రవేశ పరీక్షను 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో 50 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. వెర్బల్ ఎబిలిటీ నుంచి -15 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్-05 ప్రశ్నలు, డేటాఇంటర్ ప్రిటేషన్ అండ్ డేటా విజువలైజేషన్ -05 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 3 గంటలు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 10.03.2023
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 05.04.2023
- అడ్మిట్ కార్డులు: 2023, ఏప్రిల్ 26 నుంచి
- ఐఎస్‌ఐ అడ్మిషన్ టెస్ట్ తేదీ: మే 14, 2023
- వెబ్‌సైట్: https://www.isical.ac.in

క్లుప్తంగా...

పన్ను ఆదాయంలో 'రికార్డు'

వరుసగా 8 నెలలు రూ.10 వేల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పన్నుల ఆదాయం నెలకు రూ.10 వేల కోట్లు దాటుతోంది. వరుసగా 8 నెలలపాటు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10 వేల కోట్లు మించి పన్ను ఆదాయం వచ్చిందని గణాంకాలు చెబుతున్నాయి. 2022 ఏప్రిల్, మే నెలల్లో రూ.9 వేల కోట్లపైగా పన్ను రాబడులు సమకూరగా ఆ తరువాత వరుసగా జనవరి వరకు ప్రతి నెలా రూ.10 వేల కోట్లు దాటాయి. ఏటా మార్చిలో (ఆర్థిక సంవత్సరంలో చివరి నెల) రూ.11 వేల కోట్లకు మించి పన్నులు వసూలవుతుండగా ఈసారి అంతకన్నా ముందే ఆ మేరకు పన్నులు వసూలయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు సమర్పించిన లెక్కల్లో వెల్లడించింది. ఈ లెక్కల మేరకు రాష్ట్ర ప్రభుత్వ పన్నుల ఆదాయం 2022 డిసెంబర్‌లో రూ.11,213.78 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది ఇప్పటివరకు పన్ను ఆదాయం రూ.1,02,197.52 కోట్లు రాగా, ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరో రూ. 20 వేల కోట్లు కలిపి రూ.1.22 లక్షల కోట్లపైనే ఆదాయం రావచ్చని భావిస్తోంది.

రేపట్నుంచి 'కిసాన్' అగ్రిషో

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద 'కిసాన్'అగ్రిషో హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా ఈ నెల 3 నుంచి 5 వరకు జరగనుంది. ఈ ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులకు అగ్రిషో అందుబాటులో ఉంటుంది. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలోని పెట్టుబడిదారులు, రైతులు ఈ షోలో పాల్గొనున్నారు. 150 మందికిపైగా ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచనున్నారు. వ్యవసాయ రంగంలో కొత్తగా వచ్చిన మార్పులు, అధునాతన పరికరాలను ఇక్కడ ప్రదర్శిస్తారు. వ్యవసాయ రంగంలోని స్టార్టప్ సంస్థలకు ప్రోత్సాహమిచ్చే 'స్పార్క్' ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ సంస్థ అధునాతన సాంకేతికలు, వినూత్న ఆలోచనలను ప్రదర్శించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. 20 వరకు స్టార్టప్ సంస్థలు తమ సాంకేతికత నైపుణ్యాన్ని, కాన్సెప్ట్‌లను ప్రదర్శించనున్నాయి. కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐకార్ సంస్థలు కూడా తమ ప్రదర్శనశాలలను జ్ఞాన కేంద్రం పేరిట ఏర్పాటు చేయనున్నాయి. వీటిలో రైతులు అధునాతన సాంకేతికతలతో పాటు వ్యవసాయ రంగంలో కొత్తగా వస్తున్న మార్పులపై సమాచారం తెలుసుకుంటారు.

కొత్త ఆశల సింధువులు

స్వయం ఉపాధి బాటలో ట్రాన్స్‌జెండర్లు

గౌరవప్రదమైన జీవితం కోసం ఆరాటం

అవకాశాలిస్తే అద్భుతాలు చేస్తామంటూ ధీమా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

ఆ ఇద్దరూ.. ఊహ తెలిసినప్పటి నుంచీ.. తాము స్త్రీలమా.. పురుషులమా.. అన్న విషయం తెలియక మథనపడ్డారు. ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్ ఇలా ప్రతి చోటా గుర్తింపు సమస్యే. పైపెచ్చు హేళన, వివక్ష. దీంతో మరింత మనోవేదనకు గురయ్యారు. ఇలాగే ఉంటే.. తమ మనుగడ కష్టమవుతుందని భావించారు. ఇంటి గడప దాటి తమలా ఉండే వారితో కలిసి జీవిస్తున్నారు. తమ కాళ్ల మీద తాము నిలబడే గౌరవ ప్రదమైన జీవితం కోసం ప్రయత్నం చేస్తున్నారు. తోటివారికి సైతం సహకరిస్తున్నారు. సమాజంలో అన్నీ ఉండి కూడా ఏమీ చేయలేని ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వారే కరీంనగర్‌కు చెందిన ఆషాఢం ఆశ, నక్కా సింధు. స్వయం ఉపాధికి ప్రభుత్వ రుణం సంపాదించిన రాష్ట్రంలోనే తొలి ట్రాన్స్‌జెండర్‌గా ఆషాఢం ఆశ రికార్డు సృష్టించింది. అదేవిధంగా స్వయం ఉపాధి కోసం డ్రైవింగ్ లైసెన్స్ సంపాదించిన రాష్ట్రంలోని రెండో ట్రాన్స్‌జెండర్‌గా నక్కా సింధు గుర్తింపు సాధించింది. కరీంనగర్ జిల్లాకు చెందిన వీరిద్దరూ తమ కమ్యూనిటీకి ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నారు. ట్రాన్స్‌జెండర్ అనగానే.. ట్రాఫిక్ సిగ్నళ్లు, రైళ్లు, రైల్వేస్టేషన్లలో డబ్బులు వసూలు చేసేవాళ్లే కాదు.. అని కుండబద్దలు కొడుతున్నారు. తమకు అవకాశాలిస్తే.. నైపుణ్యంతో సొంతకాళ్ల మీద నిలబడతామని ఢంకా భజాయిస్తున్నారు.



ఫొటోగ్రఫీ వృత్తి కోసం 5 లక్షల రుణం సాధించిన ఆశ

ప్రభుత్వ రుణం సంపాదించిన తొలి ట్రాన్స్‌జెండర్‌గా రికార్డు

కాలేజీ సర్టిఫికెట్లు ఇవ్వలేదు..

కరీంనగర్‌కు చెందిన ఆషాఢం ఆశ మగాడిలా పుట్టినా.. చిన్ననాడే తన ఆలోచనలన్నీ అమ్మాయిలా ఉన్నా యని ఆమెకు అర్థమైపోయింది. ఆమె ప్రవర్తనను మొదట్లో కుటుంబసభ్యులు వ్యతిరేకించినా తర్వాత అర్థం చేసుకున్నారు. తన ఇష్టం మేరకు చదివించి హోటల్ మేనేజ్‌మెంట్‌లో సైతం చేర్పించారు. కానీ ఆఖరి సెమిస్టర్‌లో తాను థర్డ్ జెండర్ అని గుర్తించిన క్లాస్‌మేట్స్ వేధించడం ప్రారంభించారు. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన ఆశ.. ఆపరేషన్లు చేయించుకుని పూర్తిగా అమ్మాయిలా మారింది. తీరా వెళ్లి సర్టిఫికెట్లు కావాలని అడిగితే కాలేజీ నిరాకరించింది. విధిలేని పరిస్థితుల్లో ఫొటోగ్రఫీ, గ్రాఫిక్స్ నేర్చుకుంది. మొదట్లో ఆల్బమ్‌లు అందంగా డిజైన్ చేసేది. తర్వాత తానే స్వయంగా ఫొటోలు తీయడం ప్రారంభించింది. మెల్లిగా ఈవెంట్లకు ఆర్డర్లు కూడా ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం చాలామంది అవకాశాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కరీంనగర్ మెప్మా అధికారుల ద్వారా కలెక్టర్ కర్ణన్‌ను కలిసింది. ఆయన వెంటనే రూ.5 లక్షలు బ్యాంకు రుణం ఇప్పించడంతో ఫొటోగ్రఫీ వృత్తిని అభివృద్ధి చేయడంపై దృష్టి సారించింది.



ఆషాఢం ఆశ

సమాజం మారుతోంది.. సహకారం లభిస్తోంది

సమాజంలో మాపై చిన్నచూపు ఇంకా ఉంది. తొలి నాళ్లలో నేను ఫొటోలు బాగా తీసినా థర్డ్ జెండర్‌నని చెప్పి వెనుకడుగు వేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితిలో మార్పు వస్తోంది. మా సమస్యలను సమాజం మెల్లిగా అర్థం చేసుకుంటోంది. ప్రముఖ నటులు లారెన్స్, సుధీర్‌బాబు, అక్షయ్ కుమార్‌లు మాలాంటి వారి కథలతో సినిమాలు తీయడం ద్వారా మా ఇబ్బందులు సమాజానికి తెలిసేలా చేశారు. ప్రభుత్వాలు, కోర్టుల నుంచి మాకు గుర్తింపు, సహకారం లభించడం గొప్ప విషయం. మాలాంటి వారికి ఆధార్, పాన్, ఓటరు తదితర గుర్తింపు కార్డులు, ప్రభుత్వ సాయాల సాధనకు కృషి చేస్తున్నా.

ట్యాక్సీ కోసం డ్రైవింగ్ లైసెన్స్ పొందిన సింధు

సహచర థర్డ్ జెండర్లలో స్ఫూర్తి నింపుతున్న వైనం



విజయగాథలతో స్ఫూర్తి పొంది..

కరీంనగర్‌కే చెందిన నక్కా సింధు కొన్నినెలల క్రితం వరకు ఎలాంటి పనిలేకుండా ఉండేది. ఆశ లాగానే థర్డ్ జెండర్ కావడం వల్ల ఎవరూ పనిచ్చేవారు కాదు. స్కూలు వరకే చదువుకోవడం, బయట వివక్ష , హేళన కారణంగా ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. కానీ ఉస్మానియాలో ప్రభుత్వ డాక్టర్లుగా చేరిన ట్రాన్స్‌జెండర్లు డాక్టర్ ప్రాచీ రాథోడ్, డాక్టర్ రుతు జాన్‌పాల్‌ల గురించి తెలుసుకున్నాక సింధు జీవితంలో మార్పు వచ్చింది. తమిళనాడులో థర్డ్‌జెండర్ కోటాలో ఎస్సై ఉద్యోగం సాధించిన ప్రతీక యాష్మీ విజయ గాథ కూడా ఆమెలో స్ఫూర్తినింపింది. ఎలాగైనా తన కాళ్ల మీద తాను నిలబడాలనే పట్టుదలతో కరీంనగర్ మెప్మా వారి సాయంతో డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకుంది. డ్రైవింగ్ లైసెన్స్ పొందిన రెండో థర్డ్‌జెండర్‌గా (తొలి లైసెన్స్ జనగామ జిల్లాలోని డాలీ పేరిట జారీ అయింది) ప్రత్యేక రికార్డు సాధించింది.వెంటనే ట్యాక్సీ తీసుకునేందుకు అవసరమైన రుణం కోసం దరఖాస్తు చేసుకుంది.

చిన్నచూపు పోవాలి..

నాకు చాలాకాలం పాటు ఎలాంటి పని దొరకక పోవడంతో చాలా కుంగిపోయా. కానీ నాలాంటి వారు కొందరి గురించి తెలుసుకున్నాక కొత్త ధైర్యం వచ్చింది. కరీంనగర్ మెప్మా వారి ప్రోత్సాహం నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. అదే పట్టుదలతో కలెక్టర్ గారి సహకారంతో డ్రైవింగ్ లైసెన్స్ సాధించా. ప్రస్తుతం ట్యాక్సీ తీసుకోవడానికి అవసరమైన రుణం కోసం దరఖాస్తు చేసుకుంటున్నాను. సమాజంలో థర్డ్ జెండర్‌లపై చిన్నచూపు పోవాలి. అప్పుడే మాలాంటి వారికి అవకాశాలు వస్తాయి.



\- నక్కా సింధు

ఒక్కరోజులో 21 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో కరోనా కేసుల్లో పెరుగుదల కనిపిస్తోంది. తాజాగా బుధవారం 4,405 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా, అందులో 21 మందికి కరోనా సోకినట్లు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. అందులో హైదరాబాద్‌లోనే 17 కేసులు నమోదయ్యాయి. 93 మంది ఆస్పత్రులు లేదా ఐసోలేషన్‌లో ఉన్నారన్నారు. గత నెల 22న 11 కేసులు, 23న 12 కేసులు, 24న 16 కేసులు, 25న 14 కేసులు, 26న ఏడు కేసులు, 27న 17 కేసులు, 28న 18 కేసులు నమోదు కాగా, తాజాగా ఆ సంఖ్య 21కు చేరుకుంది. గత నెల 17న కేవలం 4 ఉన్న కేసులు ఇప్పుడు ఈస్థాయికి రావడాన్ని వైద్య వర్గాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. పెళ్లిళ్లు, ఇతరత్రా శుభకార్యాలు పెరగడం వంటి కారణాలతో గొంతు సమస్యలు వస్తున్నాయి. కొందరిలో జ్వరం కూడా కనిపిస్తోంది.



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్లు ప్రధానాలయం ఉద్ఘాటన జరిగిన తరువాత.. తొలిసారిగా తిరుమాడ వీధుల్లో దివ్య విమాన రథంపై ఊరేగారు. అంతకుముందు ఉదయం ఆలయంలో స్వామి వారిని శ్రీమహావిష్ణు అలంకారంలో గరుడ వాహనంపై ఊరేగించారు. - యాదగిరిగుట్ట

సైబర్ సెక్యూరిటీ ఆఫ్ ఇండియాగా సైబరాబాద్

'సైబర్ ఆర్క్' కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/రాయదుర్గం: సైబర్ సెక్యూరిటీ ఆఫ్ ఇండియాగా సైబరాబాద్‌ను మారుస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. సైబర్ సెక్యూరిటీలో గ్లోబల్ లీడర్ అయిన ఇజ్రాయెల్‌కు చెందిన 'సైబర్ ఆర్క్ ఆర్ అండ్ డీ ఫెసిలిటీ సెంటర్‌ను హైదరాబాద్ నాలెడ్జి సిటీలో ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సైబర్ ఆర్క్ సంస్థ ఇజ్రాయెల్ వెలుపల అతిపెద్ద కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. సైబర్ సెక్యూరిటీ అంశంపై తెలంగాణ ప్రభుత్వంతో సైబర్ ఆర్క్ కలిసి పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో 230 టెక్నాలజీ కంపెనీలు పనిచేస్తున్నాయని, యువతను ఈ రంగంలో రాటుదేలేలా పనిచేస్తున్న టాస్క్, ఇతర సంస్థలకు సహకారం అందించాలని కోరారు.

సైబర్ ముప్పును గుర్తించాలి

టెక్నాలజీ, కమ్యూనికేషన్లపై ఆధారపడటం ఎక్కువైన కొద్దీ పరికరాలు, మనుషుల మధ్య అనుసంధానం పెరగడంతోపాటు డేటా, భద్రతలకు ప్రాముఖ్యత కూడా అదేస్థాయిలో అధికమవుతుందని కేటీఆర్ అన్నారు. సైబర్ ముప్పు తీవ్రతను ప్రభుత్వాలు, కంపెనీలు, సంస్థలు కూడా గుర్తించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో భౌతికయుద్ధాల కంటే సైబర్ ప్రపంచంలో జరిగే పరస్పర దాడులే ఎక్కువవుతాయని, దేశాలు, సంస్థలు సైబర్, మౌలిక సదుపాయాలపై దాడుల ద్వారా తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు ప్రయత్నిస్తాయని అభిప్రాయపడ్డారు. 'ఐఎంఎఫ్ అధ్యక్షుడిగా నియమితులైన అజయ్ బంగా కొంతకాలం క్రితం నాతో మాట్లాడుతూ మాస్టర్‌కార్డ్ సర్వర్లపై అంతా బాగుందనుకున్న రోజుల్లో కనీసం యాభై వేల వరకు దాడులు జరుగుతాయని చెప్పారు. మిగిలిన సమయంలో అంతకు పది, ఇరవై రెట్లు ఎక్కువ దాడులు జరుగుతాయన్నారు. దీన్నిబట్టే సైబర్ దాడులతో కలిగే నష్టం, ప్రమాద తీవ్రత ఏమిటో అర్థమవుతుంది'అని కేటీఆర్ అన్నారు. ఈ విషయాన్ని దేశంలో అందరి కంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వమే గుర్తించిందని, అందుకు తగ్గట్టుగా సైబర్ విధానాన్ని అమలు చేసిన రాష్ట్రంగానూ రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైబర్ ఆర్క్ సంస్థ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ పెరెట్జ్ రెగే, ఆ సంస్థ ఇండియా రీజినల్ సేల్స్ డైరెక్టర్ రోహన్ వైద్య, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.



సైబర్ ఆర్క్ ఆర్‌అండ్‌డీ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్, సంస్థ ప్రతినిధులు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.